ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

17-6-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 136 పేజీలు: 10+4 వెల: 6.50

అధికార లాంఛనాలతో రూపానీ అంత్యక్రియలు

బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు, ఆరుగురి మృతి

5లో



సోమవారం ప్రధాని మోడీకి పురస్కారం బహూకరిస్తున్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్

## ప్రధాని మోడీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

### 140 కోట్ల భారతీయులకు అంకితం: ప్రధాని

**నికోసియా, జూన్ 16:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనకు వెళ్లిన విషయం విదితమే. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ప్రధాని మోడీ సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మోడీకి అరుదైన గౌరవం లభించింది. ఆదేశ అత్యున్నత పురస్కారంతో మోడీని అక్కడి ప్రభుత్వం సత్కరించింది. సైప్రస్ అత్యున్నత పురస్కారం 'ది గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్'ను ప్రధాని మోడీ అందుకున్నారు. ఈ అవార్డుతో >>2



## హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ పర్యటన రద్దు

**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** రెండురోజుల తిరుమల, తిరుపతిజిల్లా పర్యటనలో సోమవారం ఉదయం కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ కృష్ణపట్నం వెళ్లాల్సిన కార్యక్రమం ఉన్నా, హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యతో పర్యటన రద్దయ్యింది. ఆయన హెలికాప్టర్‌లో ఎక్కిన తరువాత ముందుగానే పైలట్ ఈ సమస్యను గుర్తించడంతో ఉన్నఫళంగా రద్దయ్యింది. కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం 8గంటలకు తిరుచానూరు పద్మావతిఅమ్మవారి దర్శనానంతరం ఆయన తిరుపతి విమానాశ్రయం నుండి కృష్ణపట్నం పోర్టు సందర్శనకు వెళ్లాల్సి ఉంది. ఆయన కార్యక్రమం నిర్ణయించారు. >>2

## కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ టిడిపి కైవసం



చెన్నుబోయిన చిట్టిబాబు

**విజయవాడ, జూన్16, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లాలో మరో మున్సిపాలిటీని తెలుగు దేశం పార్టీ కైవసం చేసుకుంది. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. చైర్మన్‌గా టిడిపికి చెందిన చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా చుట్టుకుదురు శ్రీనివాస్ >>2


## కేబినెట్ భేటీ 24కు వాయిదా

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** కేబినెట్ భేటీ వాయిదా పడింది. ఈ నెల విశాఖ నగరంలో 21న యోగాడే ఏర్పాట్ల నేపథ్యంలో 19న జరగాల్సిన కేబినెట్ భేటీ వాయిదా పడింది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.,విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసారు. ఈ నెల 24న సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం జరుగుతుంది. అమరావతి నగర నిర్మాణం పనులు, పోలవరం -బనకచర్లతో పాటు, రెవెన్యూ సంబంధిత అంశాలపై మంత్రి మండలి చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుతం యోగా డే సందర్భంగా సోమవారం సిఎం చంద్రబాబు విశాఖలో పర్యటిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా పాల్గొంటున్న ఈ యోగాడే ఏర్పాట్లు సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షణ చేయనున్నారు.

# రాష్ట్రంలో 'రక్షణ' పెట్టుబడులు

## రూ. 30 వేల కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా త్వరలో కొత్త డిఫెన్స్ పాలసీ

## పరిశ్రమల కోసం 15 వేల ఎకరాలు కేటాయింపు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం రక్షణ రంగంలో (డిఫెన్స్) పెట్టుబడులకు కోసం ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.30,000 కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా త్వరలోనే నూతన డిఫెన్స్ పాలసీని ప్రకటించనున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఇందుకు సంబంధించి సిఎంవో నుంచి కీలక సమాచారం ప్రకటించింది. డిఫెన్స్ ప్రణాళికలో నాలుగు రక్షణ రంగ పారిశ్రామిక నోడ్‌లు ఏర్పాటు చేసేందుకు మార్గదర్శకాలు దానిలో పొందుపరిచింది. రూ.30 వేల కోట్ల పెట్టుబడులే టార్గెట్‌గా రక్షణ రంగ ప్రణాళికలో స్పష్టం చేసారు. అవసరమైన పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త డిఫెన్స్ పాలసీ అమలులోకి రానున్నది. ఈ పాలసీ ద్వారా రాబోయే ఐదేళ్లలో సుమారు 30 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని నిర్దేశించింది. ఇందుకు వీలుగా పెట్టుబడులతో వచ్చే పరిశ్రమలకోసం సుమారు 15,000 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో రెండు రక్షణ రంగ పరిశ్రమల కారిడార్‌లను కేంద్రం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే వాటిని ఇతర రాష్ట్రాలకు కేటాయించింది. ఈ రంగంలో మరో కారిడార్‌ను కేంద్రం అనుమతించే అవకాశం లేదు. దీంతో కారిడార్‌లకు ప్రత్యామ్నాయంగా డిఫెన్స్ నోడ్‌లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈపాలసీద్వారా ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకువీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలనుకుంటుంది. ఈ పాలసీని సిఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆ దిశలో ఆయన రక్షణ రంగం పెట్టుబడులపై పూర్తి దృష్టిని కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నాలుగు రక్షణ రంగ పారిశ్రామిక నోడ్‌ల అభివృద్ధికి కొత్త పాలసీలో మార్గదర్శకాలను సిద్ధంచేసినట్లు అధికారులు చెబుతున్నారు.

అనంతపురం జిల్లా లేపాక్షి నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్ మధ్య భారీ నోడ్‌ను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. దీన్ని జాతీయ రహదారికి అనుసంధానంగా ఏర్పాటు చేయనున్నారు. బెంగళూరుకు దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుకు దిగ్గజ సంస్థలను ఆకర్షించే అవకాశం ఉంటుందని భావిస్తుంది. నెల్లూరు దొనకొండ మధ్య మరో నోడ్ అభివృద్ధికి అధికారులు ప్రతిపాదించారు. దొనకొండ దగ్గర భారీ విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. రామాయపట్నం పోర్టుకు దగ్గరగా నోడ్‌ను అభివృద్ధి చేయడం వల్ల ఎగుమతులకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. విశాఖపట్నం దగ్గర మరో నోడ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. దీని కోసం కనీసం 2 వేల ఎకరాలను సేకరించాలని భావిస్తున్నారు. జగ్గయ్యపేట దగ్గర మరో డిఫెన్స్ నోడ్‌ను అధికారులు ప్రతిపాదించారు. దీనికోసం సుమారు 2 వేల ఎకరాలను ఇప్పటికే గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. నవరత్నాల్లో ఒకటిగా ఉన్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సత్యసాయి జిల్లా పాలసముద్రం దగ్గర డిఫెన్స్ సిస్టం ఇంటిగ్రేటెడ్ కాంప్లె >>2

## మత్స్యకారుల కుటుంబాలకు అండ

### ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జీవనభృతి కోసం సముద్రంలో చేపలు వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద బోటు నుంచి జారిపడి మృతి చెందిన కృష్ణాజిల్లా నాగాయిలంక మండలంకు చెందిన ఇద్దరు,నాగిడి రాము,గుల్లదామోదర గ్రామం, తమ్ము పోతురాజు, సంగమేశ్వర గ్రామానికి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు, మత్స్యశాఖ నుంచి రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. మొత్తంగా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు ఇచ్చి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

## ఆరుగురుకంటే పిల్లలుంటే.. వారికి త్వరలో జమ

### తల్లికి వందనం డబ్బుపై వివరించిన మంత్రి లోకేష్

### అర్హతలన్నీ పరిశీలించి డబ్బు జమ చేస్తున్నామని వెల్లడి



**విజయవాడ.జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** తల్లికి వందనం పథకం లబ్దిదారులందరికి వారి ఖాతాల్లో డబ్బు జమచేస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. అర్హతలన్నింటిని క్షుణంగా పరిశీలించిన తరువాత బ్యాంకుల డబ్బు జమచేసామన్నారు. ఆరుగురు కంటే ఎక్కువ పిల్లలున్న తల్లులు, అనాథ శరణాలయాల్లో ఉంటున్న పిల్లలకు తల్లికి వందనం పథకం డబ్బులు ఇంకా జమచేయలేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తరువాతే వారికి నిధులు విడుదలవుతాయని మంత్రి లోకేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన ట్వీట్‌లో పేర్కొన్నారు. తల్లికి వందనం సూపర్ సక్సెస్ అని, తల్లుల కళ్లలో ఆనందం చూసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడుపు మంట మూడింతలు పెరిగిందని విమర్శించారు. జగన్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలే అందరూ చేస్తారనుకుంటే ఎలా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో దుష్ప్రచారాలని నమ్మవద్దన్నారు. తల్లికి వందనం లబ్దిదారులకు వారి ఖాతాల్లో డబ్బు జమచేయడానికి ఎవరైనా ఇబ్బందులు పెడితే గ్రామ/ వార్డు సచివాలయాల వద్ద ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13,000 చొప్పున ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఒక్కో విద్యార్థికి సంబంధించి మిగతా 2000 రూపాయలను పాఠశాలల నిర్వహణ నిధి కింద ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లుగా పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు.

67 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తున్నామని దానికి రూ.10,091 కోట్లు ఖర్చు అవుతుంది వివరించారు. ఈ నిధుల నుంచి స్కూళ్ల డెవలప్‌మెంట్‌కు రూ.1,346 కోట్లు వెళ్తాయని అన్నారు. అమ్మ ఒడి మార్గదర్శకాలే పాటిస్తూ అదనంగా ఎంతమంది పిల్లలున్నా ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. గతప్రభుత్వం 42,61,965 మందికి అమ్మ ఒడి ఇచ్చిందని కాని కూటమి ప్రభుత్వం 67,27,164 మందికి తల్లికి వందనం ఇస్తున్నామని వెల్లడించారు. అలానే ఈ పథకానికి గత ప్రభుత్వం రూ.5,540 కోట్లు ఖర్చుపెడితే తాను రూ.8,745 కోట్లు ఇస్తున్నామని మంత్రి అన్నారు.

**ఫిర్యాదులకు జూన్ 26 వరకు గడువు:**

ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఒకే బిడ్డ ఉన్న తల్లులు 18,55,760, ఇద్దరు బిడ్డలు ఉన్న తల్లులు 14,55,322, ముగ్గురు >>2



సోమవారం నలగాంపల్లి వద్ద హైవేపై రోడ్డెక్కిన మామిడి రైతులు

## రోడ్డెక్కిన మామిడి రైతులు

### పర్మిట్లు జారీ చేయని పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యం

**బంగారుపాళ్యం, జూన్ 16 ప్రభాతవార్త:** మామిడి రైతులు మామిడి పంటను పల్ప్ ఫ్యాక్టరీకి తరలించడానికి అవసరమైన పర్మిట్లను పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యం జారీ చేయకపోవడంతో మామిడి రైతులు ఆగ్రహించారు. ప్రభుత్వం మామిడి రైతులకు సత్వరం పర్మిట్లు జారీ చేసి పంటను కొనుగోలు చేయాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ పల్ప్ ఫ్యాక్టరీలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంపై రైతులు ఒక్కసారిగా రోడ్డెక్కారు. తమకు సత్వరం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

వివరాలిలా వున్నాయి. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం నలగాంపల్లి వద్ద వున్న సన్ గోల్డ్ పల్ప్ ఫ్యాక్టరీ మామిడి పల్ప్‌ను ప్రతి ఏడాది తయారు చేస్తోంది. ఈ సీజన్‌లో ఈ ఫ్యాక్టరీకి సైతం మామిడి కాయల కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలాగే మండలంలో మొగిలి సమీపంలో శ్రీని ఫుడ్ పార్క్‌కు సైతం మామిడి పల్ప్ తయారీకి అవసరమైన మామిడి దిగుబడిని కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి జారీ చేసింది. అయితే శ్రీని ఫుడ్ పార్క్‌లో గత ఏడాది తయారు చేసిన మామిడి పల్ప్ నిల్వలు అలాగే వుండటంతో ఇప్పటి వరకు ఈ ఫ్యాక్టరీ నందు పల్ప్ తయారీకి యాజమాన్యం ముందుకు రాలేదు. దీంతో మిగిలిన ఏకైన పల్ప్ ఫ్యాక్టరీ నలగాంపల్లి వద్దవున్న సన్ గోల్డ్ ఫ్యాక్టరీ కావడంతో రైతులందరు తమ కాయలను ఈ ఫ్యాక్టరీకి తరలించడానికి పూనుకున్నారు.

తమ సామర్థ్యంకుమించి మామిడి కాయలు చేయడం కష్టసాధ్యంగా వుందని ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు వివరించినప్పటికీ మండలంలో ఒకే ఫ్యాక్టరీ వుండటంతో మామిడి దిగుబడిని రైతులందరు ఈ ఫ్యాక్టరీకి తరలించడానికి పూనుకున్నారు. గత రెండురోజులుగా ఫ్యాక్టరీ ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా మామిడి కాయల లోడ్లతో ట్రాక్టర్లు నిలిచిపోవడం జరిగింది. >>2



సోమవారం టెల్‌అవివ్‌లో ఇరాన్ మిసైల్ పడిన బెనిబార్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇజ్రాయెల్ పోలీసులు

## ఆగని సమరం.. ప్రతీకార దాడులు ముమ్మరం

### ఇజ్రాయెల్‌పై 370 బాలిస్టిక్ క్షిపణులు, వందలాది డ్రోన్లతో టెహ్రాన్ దాడి

### ఇరాన్ సుప్రీం ఖమేనీ హత్యకు ఇజ్రాయెల్ వ్యూహం

### ఆయుధాలు సరఫరా చేస్తున్న ట్రక్కులు ధ్వంసం

**టెల్‌అవీవ్, జూన్ 16:** ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. అయితే ఇరాన్ తన ప్రతిదాడిలో భాగంగా ఇప్పటివరకు 370 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీంతోపాటు వందలాది డ్రోన్లను ఇజ్రాయెల్ మీదకు వదిలినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం కూడా ధ్రువీకరించింది. సోమవారం ఉదయం వరకు ఇజ్రాయెల్‌లో 24 మంది మరణించారు. మరో 59 మంది గాయపడ్డారు. వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉన్నది. ఇరాన్ ప్రయోగించిన ప్రొజెక్టయిల్స్.. ఇజ్రాయెల్‌లోని 30 ప్రాంతాలను ధ్వంసం చేశాయి. అయితే శుక్రవారం నుంచి జరుగుతున్న దాడుల్లో.. ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్‌లో 224 మంది మరణించారు.

ఇరాన్‌కు చెందిన మిలటరీ చీఫ్‌లను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుని హతమార్చిన విషయం విదితమే. అయితే ఇరాన్ సుప్రీం నేత అయాతొల్లా ఖమేనీ హత్యకుకూడా ఇజ్రాయెల్ ప్రణాళిక చేసినట్లుతెలిసింది. కానీఆ ప్లాన్‌ను >>2

## ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

### దాదాపు 67 లక్షల మందికి 'తల్లికి వందనం' అమలు: మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు15నుంచి అమలులోకి వస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. సిఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి వాగ్దానాన్ని ప్రణాళికబద్ధంగా అమలు చేస్తునారన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా, ఎన్ని కష్టాలున్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, అందుకు నిదర్శనమే తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి బిడ్డకీ రూ.15 వేల చొప్పున నిధులు జమచేయడమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంత్రి నేడు మీడియాతో మాట్లాడారు. స్కూల్లు తెరిచే నాటికి ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు ఇస్తామన్న హామీ మేరకు పథకం అమలు చేశాం. గతంలో జగన్ రెడ్డి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని గెలిచాక కోతలు పెట్టి దగా చేశాడు. అందరికీ ఇస్తానన్న హామీకి తూట్లు పొడిచి ఒక్కరికే అని నాలుక మడతవేశారు. కానీ నేడు దాదాపు 67లక్షల మందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేశాం.

స్కూళ్లను మోడల్ స్కూళ్లుగా మార్చి విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు ఉండేలా నియామకాలకు శ్రీకారం చుట్టాం. తాజాగా పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ స్కూల్లు సాధించిన ఫలితాలు ప్రభుత్వ పాలనకు నిదర్శనం. రాష్ట్రాన్ని నాలెడ్జ్ కేంద్రంగా మార్చాలని ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఫలితాలొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకంలో అత్యధిక లబ్దిదారులు బడుగు బలహీన వర్గాల వారే కావడం సంతోషకరం. నలుగురు కంటే పిల్లలున్న వారు దాదాపు 27 వేలమంది ఉంటే వారందరికీ తల్లికి వందనం పథకం అమలైంది. ఒకే కుటుంబంలో 12 మంది పిల్లలుంటే వారికి దాదాపు లక్షన్నరకు పైగా సొమ్ము జమైంది. ఇది >>2

## బనకచర్లను అనుమతించొద్దు

### కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్రయాదవ్‌కు తెలంగాణ మంత్రి ఉత్తమ్ లేఖ

**హైదరాబాద్, జూన్16,ప్రభాతవార్త:** పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఏలాంటి పర్యావరణ అనుమతులు ఇవ్వొద్దని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు లేఖ రాశారు. 2022 సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు గోదావరి పరివాహక రాష్ట్రాలు, కేంద్రజలశక్తి, పర్యావరణ మంత్రిత్వశాఖలు సంయుక్తంగా సమావేశమై పర్యావరణంకు కలిగే ముప్పును చర్చించి ముందుకు పోవాలని సూచించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన లేఖలో కేంద్ర పర్యావరణమంత్రికి ఎత్తిచూపారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నేషనల్ ప్రాజెక్టుగా ప్రకటించడంపై ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ సుప్రీంకోర్టులో వాజ్యం వేశాయని కోర్టుపరిధిలో ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంకోసం మొత్తం గోదావరి జలవివాదల ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘిచి కడుతోందని దీనిని నిలిపివేయాలని కేంద్ర అడువులు, పర్యావరణ >>2



సోమవారం ఢిల్లీలో జరిగిన రిలీఫ్ కమిషనర్ల సమావేశానికి హాజరై ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# ఆ ఫోన్లు అప్పగించండి

## కార్ రేస్ సమయంలో వాడిన సెల్ ఫోన్లు 18 లోగా ఇవ్వాలని తెలంగాణ మాజీ మంత్రి కెటిఆర్‌ను ఆదేశించిన ఎసిబి

## లండన్ కంపెనీకి రూ. 50 కోట్లు బదలీ, త్రైపాక్షిక అగ్రిమెంట్, ఎస్‌నెక్స్ట్‌జెన్ కంపెనీ గురించి ప్రశ్నించిన అధికారులు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫార్ములా ఈ కార్ రేసు పై ఎసిబి నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి కెటిఆర్ రెండవ దఫా విచారణ సోమవారం ముగిసింది. బంజారాహిల్స్ లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో ఎనిమిది గంటల పాటు జరిగిన ఈ విచారణలో కెటిఆర్‌ను ఎసిబి జాయింట్ డైరక్టర్ రితురాజ్, డిఎస్‌పి మాజీద్ ఖాన్‌ల నేతృత్వంలోని బృందం భిన్న అంశాలపై ప్రశ్నించింది. ఫార్ములా ఈ కార్ రేసు జరిగిన సమయంలో వా డిన సెల్‌ఫోన్లను ఈ నెల 18వ తేదీలోగా తమకు అప్పగించాలని ఎసిబి అధికారులు కెటిఆర్‌ను కోరారు. రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి నాటి మంత్రి కెటిఆర్‌ను ఎసిబి అధికారులు రెండవసారి సుధీర్ఘంగా విచారించారు. ఇం తకు ముందు ఒకసారి కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి ఈ కేసులో సహ నిందితుడుగా వున్న అర్వింద్ కుమార్, మరో నిందితుడు బిఎల్ఎన్ రెడ్డి లను ఎసిబి విచారించడం తెలిసిందే. మొదటి దఫా విచారణలో వెలుగు చూసిన సమాచారం ఆధారంగా కెటిఆర్‌ను సోమవారం నాడు రెండవ దఫా విచారిం చారు. ఉదయం పది గంటల సమయంలో బంజారాహిల్స్ లో గల ఎసిబి ప్రధాన కార్యాలయానికి వెళ్లిన కెటిఆర్ సాయంత్రం ఆరు గంటల సమయంలో బయ టకు వచ్చారు. ఈ సందర్భంగా కెటిఆర్‌ను ఎసిబి అధికారులు అనేక అంశాలపై భిన్న కోణాల్లో విచారించినట్లు తెలిసింది. ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధిం చి అప్పట్లో నారాయణగూడలో గల ఇండియన్ ఓవర్సీ స్ బ్యాంక్ నుంచి లండన్‌లోని ఎఫ్‌ఈఓ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా బదిలీ అయిన 50 కోట్లకు పైగా నగదు గురించి ఎసిబి అధికారులు కెటిఆర్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ నగదు క్రిప్టో కరెన్సీ రూపంలో ఎందుకు చెల్లించాల్సి వచ్చిందనే దానిపై ఆయనను ఎసిబి అధికారులు ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి విచారణ చేస్తున్న ఎసిబి అధికారులు ఇందులో ఆరు ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించి ఈ అంశాలపైనే కెటిఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. ఎఫ్‌ఈఓ కంపెనీకి నగదు చెల్లింపులు జరిపిన సమయంలో నిబంధనలను ఎందుకు పాటించలేదని, ఇం దులో ఎవరికి లాభం చేకూర్చేందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ రేస్ నిర్వహణలో త్రైపాక్షిక అ గ్రిమెంట్ ఎందుకు జరిగిందని, ఈ అగ్రిమెంట్‌లో ఎస్ నెక్స్ట్ జెన్ అనే కంపెనీని ఎందుకు చేర్చాల్సి వచ్చిందని ఎసిబి అధికారులు కెటిఆర్‌ను ప్రశ్నించారని సమా చారం. ఫార్ములా ఈ కార్ రేసులో ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీ పాత్ర ఏమిటీ...? ఇందులో వచ్చిన లాభం ఎంత...? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు అడిగారని తెలిసింది. కేవలం రెండు లక్షల క్యాపిటల్‌తో వున్న ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీకి ఇంతపెద్ద బాధ్యతలు ఎలా అప్పగించారు? ట్రై పార్టీ అగ్రిమెంట్‌కు నాలుగు నె లల ముందు ఏర్పాటు చేసిన కంపెనీకి బాధ్యతలు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటీ? ఇందులో సర్కారుకు వచ్చిన నష్టం ఎంత...? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

ఈ కార్ రేసింగ్ నిర్వహణలో ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీ చేర్చుకోవడం వల్ల ఇందులో క్విడ్ ప్రోకో వుందనే దానిపై మీ స మాధానం ఏమిటీ? ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీ బిఆర్ఎస్‌కు 49 కోట్ల రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్లు ఎందుకు ఇచ్చింది? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. బిఆర్ఎస్‌కు అందిన 49 కోట్ల కోట్ల రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్లు ఒకేసారి కాకుండా 49 సార్లు ఇవ్వడం వెనుకగల కారణాలు ఏమి టీ? తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచే ఉద్దేశం వుంటే పేరు ప్రతిష్టలు వున్న అనేక కంపెనీలను కాదని చిన్నపాటి సంస్థ అయిన ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీకి ఎం దుకు ప్రాధాన్యం ఇచ్చారు...? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించి మొదటి రేసులో లాభాలు వ చ్చాయా? నష్టాలు వచ్చాయా...? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించారు.

ఫార్ములా ఈ కార్ రేసు జరిగిన 2021 నుంచి 2024 మధ్య కాలంలో కెటిఆర్ వాడిన సెల్‌ఫోన్లను వెంటనే తమకు విచారణ నిమిత్తం అప్పగించాలని ఎసిబి అధికారులు కోరగా అవి తన వద్ద ఇప్పుడు లేవని చెప్పారు. ఈ నెల 18 వ తేదీలోగా వాటిని తమకు అప్పగించాలని ఎసిబి అధికారులు కెటిఆర్‌ను కోరారు. అవసరం అయితే మరోసారి విచారణకురావాలని ఎసిబి అధికారులు కెటిఆర్‌నుకోరారు. కెటిఆర్ విచా రణ సమయంలో ఎసిబి ప్రధాన కార్యాలయం సమీపంలో గల నీలోఫర్ కేఫ్‌ను ఎసిబి అధికారులు మూసి వేయించారు.

## మామిడి రైతులు

>> ఫ్యాక్టరీ యాజమాన్యం పర్మిట్ల అనుమతులు ఇవ్వకపోవడంతో రైతులు పడిగాపులు పడుతున్నారు. దీంతో సోమవారం ఉదయం ఫ్యాక్టరీ సమీపంలోని చైన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై మామిడి రైతులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొద్ది సేపటికే రహదారిపై ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయం తెలిసిన వెంటనే తహసిల్దారు రాజేంద్రప్రసాద్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. రైతులు ససేమిరా ఒప్పుకోక తమ మామిడి కాయలకు ప్రభుత్వం నిర్ధేశించిన పర్మిట్ల అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యంతో పలు దఫాలు చర్చించి ఈ వారంలోపు రైతులందరికీ రోజువారీగా పర్మిట్లు జారీచేశారు. చివరికి శాంతిం చిన రైతులు ధర్నాను విరమించారు. అనంతరం రహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేశారు.

## దాడులు ముమ్మరం

>>విరమించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌పై వత్తిడి తెచ్చినట్లు భావిస్తున్నారు. ఖమేనీని హతమార్చే ప్లాన్ తమకు లేదని కూడా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తెలిపారు. టెహ్రాన్‌కు మిస్సైల్ లాంచర్లు తీసుకెళ్తున్న ట్రక్కులపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ దళంపేర్కొన్నది. ఆయుధాలను తీసుకెళ్తున్న అనేక ట్రక్కులను గుర్తించి.. ఇజ్రాయెల్ వైమానిక దళం వాటిపై దాడి చేసింది. సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ లాంచర్లతో పాటు ఇతర ఆయుధాలు ఆ ట్రక్కుల్లో ఉన్నాయి.

**ఇజ్రాయెల్ చేతికి ఇరాన్ గోల్డెన్ ఇన్ఫర్మేషన్..**

ఇరాన్ చేపట్టే ప్రతి అణు కదలికపైనా ఇజ్రాయెల్ నిఘా నేత్రాలున్నాయి. అది న్యూక్లియర్ బాంబుకు సంబంధించిన డిజైన్ ప్రాసెస్‌కు సంబంధించి అత్యంత కీలక ప్రయోగం చేసిందనే గోల్డెన్ ఇన్ఫర్మేషన్ వేగుల నుంచి టెల్‌అవీవ్ నాయకత్వానికి చేరింది. దీంతో టెహ్రాన్‌తలుచుకుంటే కొన్ని వారాల్లో అణుబాంబును రూపొందించగలదని నిర్ధారణకు వచ్చింది. ఇక ఏమాత్రంఉపేక్షించినా తమ అస్తిత్వానికి ముప్పు వాటిల్లుతుందని ఇజ్రాయెల్ ముందస్తు దాడులకు దిగిందని 'టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' కథనంలో పేర్కొంది. ఆయుధ శ్రేణి యురేనియం నుంచి ఓ పేలుడు పరికరంగా మార్చేందుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేయడం కోసం పలు వర్కింగ్ గ్రూప్‌లను ఇరాన్ ఏర్పాటు చేసిందని ఆ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి.

**ఇజ్రాయెల్‌ను తప్పుగా అంచనా వేసిన ఇరాన్ జనరల్స్..**

ఓవైపు అమెరికాతో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇజ్రాయెల్ తమపై దాడాచేసే అవకాశం ఉండదని ఇరాన్ జనరల్స్ బలంగానమ్మారు. అదే టెహ్రాన్‌ను తొలి దాడిలో బాగా నష్టపోయేటట్లు చేసింది. ఫలితంగా మిలిటరీలోని పలు సీనియర్ ర్యాంకుల అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఆరో విడత చర్చలకు ఇజ్రాయెల్ దుందుడుగా ఎటువంటి దాడా చేయకపోవచ్చని ఇరాన్ నాయకత్వం నమ్మింది. ఈ క్రమంలో చాలామంది మిలిటరీ కమాండర్లు అజాగ్రత్తగా ఉన్నారు. ఈదాడులను తట్టుకొనే షెల్టర్లలోకాకుండా..ప్రైవేటుఇళ్లల్లోబసచేసి ప్రాణాలు పోగొట్టుకున్నారు. దీంతోపాటు ఐఆర్‌జిసి ఏరోస్పేస్ ఫోర్స్ కమాండర్ అమిర్‌అలీ హాజిజాదే కూడా తన సిబ్బందితో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ ఈ మీటింగ్ జరుగుతున్న బంకర్‌పైనా బాంబులువేసింది. దీంతో అతడితోపాటు సీనియర్ సిబ్బంది చనిపోయారు. తమ ప్రభుత్వంలో ఉన్న ఇజ్రాయెలీ కోవర్టులను చూసి షాకవ్వడం ఇరాన్ వంతైంది.

## పర్యటన రద్దు

>> అయితే ఆయన తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకుని విమానాశ్రయం చేరుకున్నారు. అప్పటికే ఆయన వ్యక్తిగత సిబ్బందికి హెలికాప్టర్ సాంకేతిక సమస్యతో భద్రత కారణాల రీత్యా మంచిదికాదని పైలట్ తెలిపారు. హెలికాప్టర్ ఎక్కిన తరువాత సాంకేతిక సమస్య ఉందని గుర్తించడంతో పర్యటన అర్థాంతరంగా రద్ద య్యింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి భద్రత సిబ్బంది నిర్ధారించారు. కృష్ణపట్నం పర్యటన రద్దవడంతో ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇటీవలకాలంలో దేశంలో విమానాలు ప్రమాదం, సాంకేతిక సమస్యలు, హెలికాప్టర్ సాంకేతిక సమస్యలు ఎదురవుతుండటంతో సోమవారం తిరుపతిలో కేంద్ర మంత్రి హెలికాప్టర్‌కూడాసాంకేతికంగా సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డిజిపి సంబంధిత అధికారులను ఆదేశించడం విశేషం.

**డిజిపి ఆదేశం**

సిఎం చంద్రబాబు పర్యటనలకు ఉపయోగించే హెలిక్టపర్ అదే కావడంతో దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంటెలిజెన్స్ చీఫ్‌కు డిజిపి హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు.

## పేర్ని నానికి అరెస్ట్ వారెంట్ జారీ

**విజయవాడ జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి వైకాంగ్రెస్‌పార్టీ నేత పేర్ని వెంకట్రామయ్య(నాని) కి అరెస్టు వారెంట్ జారీ అయింది. 2019లో టిడిపి కార్యకర్త చందు శ్రీహర్షపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసులో పేర్ని నాని సాక్షిగా ఉన్నారు. వరుసగా వాయిదాలకు కోర్టులో హాజరు కాకపోవడంతో ఆయనకు మచిలీపట్నం కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఆయన్ని కోర్టులో హాజరుపరచాలని పోలీసులనుఆదేశించింది. అనంతరం కేసు విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేసింది.

## పురస్కారం

>> తనను సత్కరించినందుకు సైప్రస్ ప్రభుత్వానికి ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును 140 కోట్ల భారతీయులకు అంకితం చేస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. అంతేగాక ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహానికి అంకితం చేస్తున్నట్లు కూడా ప్రధాని మోడీ ప్రకటించారు. ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టో డౌలైడ్స్ ఆహ్వానం మేరకు ప్రధాని సైప్రస్ వెళ్లారు. కాగా గడిచిన రెండు దశాబ్దాల్లో భారత ప్రధాని సైప్రస్ దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి కావడంగమనార్హం. ఈ పర్యటనలో ప్రధానిమోడీ.. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. తర్వాత ప్రధాని కెనడాలో జరుగుతున్న జి-7 సదస్సు కు హాజరుకానున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 17-06-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
షష్ఠి మ. 2.43
శతభిషం రా. 12.59
వర్జ్యం ఉ. 8.10-9.45
దు.ఉ. 8.14-9.05 2) రా. 11.57-12.49
రాహుకాలం - మ. 3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాలవారికి ప్రోత్సాహకరంగా వుంటుంది. ధనలాభం.

**వృషభం :** ఉద్యోగులకు ఏర్పడిన చికాకులు తొలుగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు.

**మిథునం:** ప్రత్యర్థుల పై పట్టు సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో లాభాలు సాధిస్తారు.

**కర్కాటకం :** ఆకస్మిక ప్రయాణాలు లభిస్తాయి. సొంత ఆలోచనలతో ముందుకు సాగడం మంచిది.

**సింహం :** ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. దీర్ఘకాలిక ఋణబాధలు తొలుగుతాయి.

**కన్య:** పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**తుల :** కుటుంబ సభ్యులనుండి సహాయసహకారాలు అందుతాయి. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:** అనుకోని అతిథులనుండి ఆహ్వానాలు అందుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** నూతన భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**మకరం:** వృత్తి - వ్యాపారాలలో ఎదురైన ఆటుపోట్లు తొలగించుకుంటారు. ప్రయాణాలు.

**కుంభం :** ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**మీనం :** చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా

- శ్రీమత్[illegible] శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం తిరుమలలో శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న కేంద్రమంత్రి గోయల్

# 'వికసిత్‌భారత్'తోనే భారత్ విశ్వగురువుగా ఆవిర్భవిస్తుంది

## శ్రీవారిసేవలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎంచుకున్న 'వికసిత్ భారత్' తోనే దేశం విశ్వగురువుగా ఆవిర్భవిస్తుందని కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ అన్నారు. ఇదీ దేశప్రగతికి మరింత వృద్ధిచెందేలా దోహదపడతుం దన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారని, పారిశ్రామికప్రగతికి కేంద్రం సంపూర్ణమద్దతునిస్తుందని గోయల్ తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి పూర్తిసహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపరిచేందుకు సిఎం చంద్రబాబునాయుడు వినూత్న ఆలోచనతో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. సోమవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రులు అనగాని సత్యప్రసాద్, టిజి భరత్‌తో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి అధికారులు స్వాగతంపలికారు. ఉదయం విఐపి బ్రేక్‌దర్శనాల ప్రారంభసమయంలో వీరంతా కలసి తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామి సేవలోపాల్గొని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి క్యాలండర్, శేషవస్త్రం బహుకరించారు. వీరివెంట బోర్డుసభ్యులు డాక్టర్ పనబాకలక్ష్మి, జంగాకృష్ణమూర్తి, శాంతారాం, భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ ఇఒ భాస్కర్, ఓఎస్‌డి సత్రానాయక్‌ఉన్నారు. శ్రీవారిదర్శనం ఎంతోఅనుభూతి కలిగించిందని తెలిపారు.

## రాష్ట్రంలో 'రక్షణ' పెట్టుబడులు

>> క్స్‌ను 14 వందల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనుంది. దీనికి అవసరమైన భూములను ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ సంస్థకు అప్పగించింది. రాడార్, వెపన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటు చేయనుంది. భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఎపి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ రెండు దశల్లో 2,400 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనుంది. క్షిపణులు, వార్‌హెడ్స్ తయారీ యూనిట్ ఏర్పాటు కోసం వెయ్యి ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. మడకశిరలో రక్షణ రంగానికి సంబంధించి ఆర్టిలరీ మందుగుండు సామగ్రి షెల్, టీఎన్‌టీ ఫిల్లింగ్, మల్టీమోడ్ హ్యాండ్ గ్రనేడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్ సంస్థ 11 వందల 97 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు అన్ని ప్రాధాన్యతా రంగాల్లోను పెట్టుబడులను ఏపీ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది.

## వారికి త్వరలో జమ

>> పిల్లలు ఉన్న తల్లులు 2,10,684, నలుగురు పిల్లలు ఉన్న తల్లులు 2,053 మంది ఉన్నారని వారందరికీ తల్లికి వందనం ఇస్తున్నామని లోకేష్ తెలిపారు. తల్లి లేని పిల్లలకు తండ్రికి లేదా గార్డియన్ ఖాతాలో తల్లికి వందనం డబ్బులు జమ చేస్తామని అలానే అనాథ పిల్లలుంటే జిల్లా కలెక్టర్ నిర్ధారించిన ప్రకారం వారి ఖాతాలో నిధులు జమ చేస్తామని అన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి నిధులు ఇవాళ్టి నుంచి తల్లుల ఖాతాలో జమ అవుతాయని వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13,000 చొప్పున ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఒక్కో విద్యార్థికి సంబంధించి మిగతా 2000 రూపాయలను పాఠశాలల నిర్వహణ నిధి కింద ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులుగా పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లోని 76,000 మందికి కూడా తల్లికి వందనం వర్తింపచేశామని తెలిపారు. తల్లికి వందనం జాబితా సచివాలయం, గ్రామ, వార్డు కార్యాలయాల్లోనూ ఉంచుతామని, ఇంకా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే తెలియజేస్తే పరిష్కారం చేస్తామని తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణకు జూన్ 26 వరకు గడువు పెట్టామని జూన్ 30న తల్లికి వందనం తుదిజాబితా పెడతామని తెలిపారు.

## ఛైర్మన్, వైస్ ఛైర్మన్ టిడిపి కైవసం

>> ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి కరిమికొండ శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. అయితే కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఫలితంపై తీవ్ర ఉత్కంఠం నెలకొంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దగ్గరుండి మరీ అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్లో తీర్పు ఫలితం అధికారుల వద్దకు వచ్చింది. ఈ క్రమంలో భారీ బందోబస్తు మధ్య సీల్డ్ కవర్‌ను అధికారులు. తెరిచి.. ఫలితాలను ప్రకటించారు కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను టిడిపి దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. తరువాత కొద్ది సేపటికే కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్‌గా చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్ పర్సన్‌లుగా కరిమికొండ శ్రీలక్ష్మి చుట్టుకుదురు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేసారు.

## మహిళలకు ఉచిత బస్సు

>> కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి. గతంలో రూ.200 ఉన్న పెన్షన్ రూ.2000 చేసిన ఘనత కూటమిదే, ఆతర్వాత వచ్చిన జగన్ రెడ్డి రూ.3000 చేస్తానని మాటిచ్చి విడతల వారీగా, వాయిదాల వారీగా అంటూ ప్రజల్ని దగా చేశాడు. కానీ కూటమి అధికారంలోకి రాగానే, ఇచ్చిన హామీ మేరకు రూ.4000 పెన్షన్ అమలుచేసాం. దాదాపు 65 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నాం.ఎన్నికల హామీ మేరకు కోటి మందికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నాం. పేదల నోటి దగ్గరి అన్నం దూరం చేసిన దుర్మార్గుడు జగన్ రెడ్డి. కూటమి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు తెరిపించాం. పేదల కడుపునింపుతున్నాం. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించుకోబోతున్నాం. ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కూడా ఆగస్టు నుండి అమలు చేస్తున్నాం. ఏ విద్యార్థి కూడా ఆర్థిక సమస్యలతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే ప్రతి బిడ్డకీ ఇస్తామన్నాం. ఇచ్చి చూపించాం.పారదర్శకమైన పాలన చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నాడు. కులాలు, మతాల పేరుతో రాజకీయం చేస్తున్నాడు. గత ఐదేళ్ల పాపాలు బయటకు వస్తుండడంతో నానా యాగీ చేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మద్యంలో వేల కోట్ల కుంభకోణం చేశారు. భూ కుంభకోణాలకు పాల్పడ్డారు. విచారణ చేస్తున్న అధికారుల్ని, పోలీసుల్ని బెదిరించి ఏం చేయాలనుకుంటున్నారో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. మహిళలపట్ల జగన్ రెడ్డి, వారి రౌడీ మూకలు అనుసరిస్తున్న విధానాలే వారి మనస్తత్వానికి నిదర్శనం. రాష్ట్రంలోని మహిళల్ని జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేయడమే కాకుండా.. ఆందోళన చేసిన వారిపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఇలాంటి రాబందుల్ని రాష్ట్రం నుండి తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడూ తీసుకోవాలి. ప్రజలు చీకొట్టినా.. వైఎస్సార్సీ నాయకులకు బుద్ధి రాలేదు. రాష్ట్రం కోసం ప్రజల కోసం కష్టబడే వారికి ప్రజలు అండగా నిలవాలని కోరుకుంటున్నానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## జైలు నుంచి కొమ్మినేని విడుదల

**విజయవాడ, జూన్16,ప్రభాతవార్త ప్రతినిధి:** సుప్రీంకోర్టు ఉత్తర్వులతో కొమ్మినేని శ్రీనివాసరావు సోమవారం రాత్రి గుంటూరు జైలు నుంచి విడుదల అయ్యారు. ఓ ఛానల్ డిబేట్‌లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టిడిపి నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 10న హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించారు. కొమ్మినేని విడుదలకు సంబంధించి ఈనెల 13న సుప్రీంకోర్టు బెయిల్ ఉత్తర్వులు ఇచ్చింది. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు జైలు అధికారులు ఆయన్ను విడుదల చేశారు. జైలు నుంచి కొమ్మినేని బయటకు రాగానే మాజీ మంత్రి అంబటి రాంబాబు, పలువురు వైఎస్సార్సీ నాయకులు, న్యాయవాదులు కలిశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. కొమ్మినేని విడుదలలో కూడా అధికారులు తీవ్ర జాప్యం చేశారన్నారు. రాత్రి ఏడు గంటల వరకు కాలయాపన చేశారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం కన్నా వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికే సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే కొమ్మినేనిపై అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు.

# ఇది యుద్ధాల శకం కాదు: సైప్రస్‌లో ప్రధాని మోడీ

**నికోసియా, జూన్ 16:** ఆపరేషన్ సిందూర్ సమయంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి నిరంతరం మద్దతు ఇచ్చినందుకు సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలైడ్స్‌కు ప్రధానిమోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం వల్ల పశ్చిమాసియాలో తలెత్తుతున్న ఉద్రిక్తతలపై ఇరువురు చర్చించుకున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా, యూరప్‌లో కొనసాగుతున్న సంఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చల ద్వారానే సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందవచ్చని అన్నారు. ఇయు అధ్యక్ష పదవి సైప్రస్‌కు రావడంపై ఆ దేశానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆ దేశ నాయకత్వంలో ఇయుతో భారత్‌కు మరింత మెరుగైన సంబంధాలు ఏర్పడతాయని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశం ఇయు మద్దతు సాధిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

ఈ పర్యటనను ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం లిఖించేందుకు సువర్ణావకాశంగా ప్రధాని మోడీ పేర్కొన్నారు. సైప్రస్‌కు భారత్ అత్యంత విశ్వసనీయ దేశమని అన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై పరస్పర విశ్వాసం ఇరు దేశాల సంబంధాలకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. సైప్రస్ ప్రభుత్వంతో రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతికకత, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలలో సహకారం గురించి చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను ఎలా బలోపేతం చేయాలనే విషయాలపైనా తాము మాట్లాడుకున్నామన్నారు.

సైప్రస్‌లో యోగా, ఆయుర్వేదం ప్రజాదరణ పొందుతుండడం ఆనందంగా ఉందని అన్నారు. వీలైనంత త్వరగా భారత్‌ను సందర్శించాల్సిందిగా సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్‌ను మోడీ ఆహ్వానించారు. భారతీయులకు సైప్రస్ మంచి పర్యాటక ప్రాంతమని.. ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను తీసుకువచ్చేలా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.

ప్రధాని మోడీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. మోడీని అక్కడి ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ మకరియోస్ 3'తో సత్కరించింది. ఈ పర్యటన తర్వాత.. ప్రధాని మోడీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జి-7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

# బనకచర్లను అనుమతించొద్దు

>> మంత్రిత్వశాఖకు కూడా 2025 అక్టోబర్ 23న అభ్యర్థించామని 2011 ఫిబ్రవరిలో 8 పనులు నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్‌కు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం వద్దకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు సాధ్యత నివేదికతో ప్రతిపాదనలు తీసుకెళ్లింది. పోలవరం నుంచి బనకచర్లకు నీటి తరలింపు ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక శాఖకు రాష్ట్ర అధికారులు సుమారు 2 గంటలపాటు వివరించారు. రూ.81,000 కోట్లతో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుతో రైతులు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఆర్థిక, నీటిపారుదల శాఖ అధికారులు కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ వివరించింది. మే నెలలో జరిగిన భేటీల్లో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై పూర్తి వివరాలు ఇవ్వాలని గతంలో కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేత్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయన సిడబ్ల్యుసికి డిపిఆర్ ఇవ్వాలని సూచించడంతో ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్రజలశక్తి మంత్రి డిపిఆర్‌ను ఒప్పుకోవద్దని టెండర్‌లు నిర్వహించకుండా అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ లేఖ రాశారు.

**హరీష్‌రావు ఓ అజ్ఞాని...తెలంగాణ నీటి ప్రయోజనాలు బలిపెట్టింది బిఆర్ఎస్**

గోదావరి ఒక్క చుక్క నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించనీయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకొంటుందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మాజీ నీటిపారుదలశాఖ మంత్రి బిఆర్ఎస్ నాయకుడు హరీష్‌రావు అజ్ఞానిగా మాట్లాడుతున్నారని తెలంగాణ నీటి ప్రయోజనాలు బలిపెట్టింది బిఆర్ఎస్ పాలనలోనే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపికి బనకచర్ల ద్వారా 200టిఎంసిల నీటిని ఆయన తెలిపారు. బనకచర్లకు అనుమతులు ఇవ్వకుండా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా బేసిన్ నుంచి తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే పదేళ్ల బిర్ఎస్ సహకరించిందని ఉత్తమ్ విమర్శించారు.

ఉమ్మడి ఎపిలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు ఏపీకి వెళితే, బీఆర్ఎస్ హయాంలో 1,254 టీఎంసీలు తరలించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఎపికి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు.

# ఒడిశా నుండి అక్రమంగా గంజాయి



## ముగ్గురు సభ్యుల ముఠా అరెస్టు

**నెల్లూరు క్రైమ్, జూన్ 16, ప్రభాతవార్త :** ఒరిస్సా రాష్ట్రం నుండి అక్రమంగా గంజాయి తీసుకువచ్చి నెల్లూరు నగరంలో అమ్మకాలు జరుపుతూ యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను సంతపేట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బపిసాహు ప్రస్తుతం ముత్తుకూరు గ్రామంలో నివసిస్తున్నాడు. స్థానిక చంద్రబాబు నగర్‌కు చెందిన షేక్ మాబాషలు ఇద్దరు కలిసి ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరులో విక్రయాలు జరుపుతుంటారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు, నెల్లూరు రూరల్ డిఎస్పి జి శ్రీనివాసరావు పర్యవేక్షణలో, సంతపేట సీఐ దశరథ రామారావు, ఎస్సై బాలకృష్ణ లు తమ సిబ్బందితో కలిసి సంతపేట స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గంజాయి విక్రయాలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో బపిసాహూ, మాబాషాలు నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో మన్సూర్ నగర్‌కు చెందిన షేక్ షఫీకి గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడ్డారు. ముద్దాయిల వద్ద నుండి రూ.70 వేలు విలువచేసే 3.5 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిఐ దశరథ రామారావు, ఎస్సై బాలకృష్ణ, ఏఎస్ఐ శ్రీహరి, హెడ్ కానిస్టేబుల్ లావణ్య కుమార్, పీసీలు షేక్ అల్లా బక్షు, సురేంద్రబాబు, సుదర్శన్ గౌడ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# కొల్లేరులో పర్యటించనున్న సుప్రీం సాధికారత కమిటీ

**కైకలూరు , జూన్, 16(ప్రభాతవార్త):** కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించేందు ఈనెల 17,18 తేదీల్లో జిల్లాలో సుప్రీంకోర్ట్ నియమించిన సాధికారిత కమిటీ పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం సాధికారిత కమిటీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా మండవల్లి మండలం మణుగునూరు, పులపర్రు, కైకలూరు మండలం ఆటపాక, ఆలపాడు, కొల్లేటికోట ప్రాంతాలలో కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించారు. వీరితో పాటు కైకలూరు శాసన సభ్యులు డా. కామినేని శ్రీనివాసరావు, ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు , పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కొల్లేరుకు సంబంధించి సుప్రీం సాధికారిత కమిటీ ఈనెల 17,18 తేదీల్లో కొల్లేరులోని కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. మానవీయత కోణంలో కొల్లేరులో ఎన్ని నివాసిత ప్రాంతాలు ఉన్నాయి, జిరాయితీ భూములు, డి.ఫారం పట్టా భూములు ఏమున్నాయి, 2006 సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఎలా అమలు చేశారనే సంబంధిత 4 అంశాలను కమిటీ పరిశీలించనున్నదన్నారు. దీనికి సంబంధించి మంగళ, బుధ వారాల్లో సాధికారిత కమిటీ పర్యటించే ప్రాంతాల ప్లాన్‌ను తయారు చేసేందుకు ఈరోజు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిం దన్నారు.

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కె. వెట్రిసెల్వి

రెండు రోజుల పర్యటన అనంతరం బుధవారం ఏలూరు కలెక్టరేట్ లో కొల్లేరుకు సంబంధించిన వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడు మండలంలోని కొల్లేరు వాసులు కూడా తమ సమస్యలను అందజేయవచ్చన్నారు. కైకలూరు శాసన సభ్యులు డా. కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ వేత్తలు, కొల్లేరులో కొన్ని వందల సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న ప్రజలు వారి అవసరాలు, వారి సమస్యలు, జిరాయితీ భూములకు సంబంధించి పరిశీలనకోసం సుప్రీం సాధికారిత కమిటీ జిల్లాలో పర్యటించనున్నదన్నారు. కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించి మూడు నెలల్లో నివేదిక సమర్పించాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. దానిలో భాగంగానే సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున, కొంతమంది ప్రైవేట్ రైతులు కూడా అర్జీని పెట్టుకోవడం జరిగిందన్నారు. 2006లో కొల్లేరులో చేపల చెరువులు కొట్టిన పరిస్థితి, ప్రజల జీవనవిధానం వారి ఇబ్బందులను జిరాయితీ భూముల వివరాలను కమిటీ మంగళవారం నిడమర్రు ప్రాంతంలో జిరాయితీ భూములను, బుధవారం కైకలూరు ప్రాంతంలోని ఆటపాక, కొల్లేటికోట లో పర్యటించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తరతరాల నుంచి జీవిస్తున్న కొల్లేరు ప్రజలు తమ వినతులను కమిటీకి సమర్పిస్తారన్నారు. అయితే ఈ పర్యటనలో కొన్ని మార్పులు కూడా ఉండవచ్చని వాటిని తెలియజేయడం జరుగుతుందన్నారు.

## 22 ప్రముఖ ఆలయాలకు ప్రత్యేకాధికారుల నియామకం

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయశాఖ పరిధిలోని 22 ఆలయాలకు ఏడీసీ, ఆర్జేసీ, డీసీ కేడర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా ఏపీ ప్రభుత్వం నియమించింది. ప్రముఖ దేవాలయాల్లో భక్తుల సౌకర్యార్థం శానిటేషన్, క్యూలైన్ల మేనేజ్‌మెంట్, ఇతర సౌకర్యాల పర్యవేక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీటిలో ప్రధాన ఆలయాలైన సింహాచలం, అన్నవరం, విశాఖ కనకమహా లక్ష్మీ ఆలయం, అరసవిల్లి, ద్వారకాతిరుమల, వాడపల్లి, మోపిదేవి, బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంతో పాటు ఇలా మొత్తం 22 ఆలయాలను అధికారులు ఎంపిక చేశారు. దేవదాయశాఖ అధికారుల నిర్దేశం మేరకు వీరు ఆయా ఆలయాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. క్యూలైన్ల పర్యవేక్షణ, భక్తులు వేచి ఉండే గదులను పరిశుభ్రంగా ఉంచ డం, ప్రసాదం నాణ్యతపై పర్యవేక్షణ ఇలా అన్ని రకాల భాధ్యతలు చూడాలి. ఆలయాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. ఎక్కడా లోపాలు లేకుండా చూడాలి. ఏవైనా సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలి. సమీక్షలు నిర్వహించి, కమిషనర్‌కు నివేదికలు పంపాలి. దేవదాయ శాఖ నిర్దేశించిన ప్రత్యేక నిబంధనలకు అనుగుణంగానే 22 ఆలయాల్లో శానిటేషన్, క్యూలైన్ల ఏర్పాట్లు, ప్రసాదంతయారీ చేశారు.

# ఢిల్లీ టిటిడి కళాశాలలో వృత్తిపరమైన కోర్సులు

## - కళాశాల ప్రవేశాలలో తెలుగు విద్యార్థులకు కోటా

### - టిటిడి ఎస్వీకళాశాల గవర్నింగ్‌బాడీ సమావేశంలో టిటిడి ఛైర్మన్ నాయుడు

**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీనగరంలో తిరుమలతిరుపతి దేవస్థానం నడుపుతున్న శ్రీవేంకటేశ్వర కళాశాలలో విద్యార్థులకు ఉపాధి అవకాశం ఉన్న వృత్తిపరమైన కోర్సులను ప్రవేశపెట్టాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సూచించారు. కళాశాలలో అవసరమైన మౌళిక సదుపాయాల పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఎస్వీకళాశాలలో తెలుగు విద్యార్థులకు అడ్మిషన్ల కోటాలో ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. టిటిడి ఆద్వర్యంలోని ఢిల్లీలోని ఎస్వీ కళాశాల 155వ గవర్నింగ్ బాడీ సమావేశం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి టిటిడి బోర్డుసభ్యులు డాక్టర్ పనబాకలక్ష్మి, శాంతారాం, ఎస్.నరేశ్‌కుమార్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, టిటిడి ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిఇ సత్యనారాయణ, టిటిడి డిఇఒ వెంకటసునీల్, గవర్నింగ్‌బాడీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నింగ్‌బాడీ ఛైర్మన్ హోదాలో బిఆర్‌నాయుడు మాట్లాడుతూ ఢిల్లీలోని కళాశాలలో టిటిడి ప్రతిష్టమరింత పెంచేలా ఎస్వీకళాశాలను రూపొందించాలన్నారు. ఢిల్లీలో టిటిడి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్వీకళాశాలలో అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉత్తరాదివైపున ఉన్న టిటిడి ఆలయాల్లో, ఢిల్లీలోని ఎస్వీకళాశాలకు ఇంజనీరింగ్ పనులు చేపట్టేందుకు వీలుగా ప్రత్యేకంగా ఇంజనీరింగ్ ఇఇ విభాగాన్ని ఏర్పాటుచేయాలని ఛైర్మన్ నాయుడు ఇఒ శ్యామలరావుకు సూచించారు. ఆ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉద్యోగ పోటీపరీక్షలకు శిక్షణనిచ్చేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. కళాశాలలో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఇంజనీరింగ్ మరమ్మతులను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. కాలంచెల్లిన భవనాల స్థానంలో భవనాల పునర్నిర్మాణం, ఆడిటోరియం మరమ్మతులు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నూతన టెక్నాలజీతో కళాశాల ప్రవేశంలో మరింత ఆకర్షణీయంగా ఉండేలా మార్పులుచేర్పులు చేపట్టాలన్నారు. కళాశాలకు సంబంధించిన పలు అంశాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వఝుల రవి ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్, ఇఒ దృష్టికి తీసుకువచ్చారు.

# జర్నలిజంలో ఆన్‌లైన్ శిక్షణా తరగతులు

### మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్

**విజయవాడ జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తు జీవనోపాధి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఆన్లైన్ శిక్షణా తరగతులతో జర్నలిస్టులకు సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించాలని ప్రతిపాదనను కార్యచరణలోకి తీసుకుని రానున్నట్లు సిఆర్ ఏపీ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ తెలిపారు. సురేష్ ను సీనియర్ జర్నలిస్టు, ఉమ్మడి రాష్ట్ర ప్రెస్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు నిమ్మరాజు చలపతిరావు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్దంగా ఆన్లైన్ శిక్షణా తరగతులతో జర్నలిస్టులకు సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించాలని నిమ్మరాజు విజ్ఞప్తి చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహించామని ఆపై తొలి ఛైర్మన్ కే శ్రీనివాసరెడ్డి సహకారంతో ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం ప్రారంభించామని నిమ్మరాజు తెలిపారు. ఈ తరగతులలో అందించిన సర్టిఫికెట్ల వలన ఆశించినంత ప్రయోజనం కన్పించలేదన్నారు. సెల్ఫోన్ వ్యవస్థ వలన ఏ ఒక్కరు ప్రసంగాల పట్ల దృష్టి కేంద్రీకరించ లేకపోతున్నారని అన్నారు. అసెంబ్లీ తరహాలో తరగతి గది వెలుపల సెల్ఫోన్లను సేకరించడం మంచిదన్నారు. 30 ఏళ్ల క్రితం గుంటూరులో సురేష్, తను కలిసి పనిచేసిన స్మృతులను నిమ్మరాజు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నిమ్మరాజు విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామని సురేష్ తెలిపారు. మీడియా ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తానని సురేష్ తెలిపారు.

# పిఆర్సీని వెంటనే ఏర్పాటు చేయండి

### - ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

**విజయవాడ, జూన్ 16,ప్రభాతవార్త ప్రతినిధి:** పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని, ఉద్యోగుల సమస్యలపైనా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విజయవాడ లోని ఏపీ ఎన్జీవో భవన్‌లో మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో ఉద్యోగులు అన్ని విధాలా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలి. ఒకటో తేదీనే జీతాల చెల్లింపు, రూ.30వేల కోట్ల పైబడి ఆగిపోయిన ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల్లో రూ.7500 కోట్లు చెల్లించడం ఊరట కలిగించింది. అయితే 2023 జులైలో వేయాల్సిన పీఆర్సీ జాడ ఇప్పటికీ లేకపోవడంతో ఉద్యోగులు నష్టపోతున్నారు. అపరిష్కృతంగా ఉన్న మూడు డిఏల చెల్లింపుపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ప్రతి నెలా మా జీతాల నుండి మినహాయిస్తున్న హెల్త్ కార్డుల నగదును అనుపత్రులకు జమ చేయాలి. సచివాలయాల ఉగ్యోగులకు వారు నివాసం ఉంటున్న మండలాల్లో పనిచేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం సరికాదు'అని విద్యాసాగర్ అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన విజయనగరం జిల్లాకు చెందిన డివి రమణను ఉద్యోగులు సత్కరించారు.

# తిరుమల సమాచారం

## టిటిడి ఢిల్లీ కళాశాల గవర్నింగ్ బాడీ ఛైర్మన్‌గా బిఆర్‌నాయుడు

### - కళాశాల అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం



**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** దేశరాజధాని ఢిల్లీనగరంలో టిటిడి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్వీకళాశాల పూర్తిస్థాయి అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఇందుకు త్వరలోనే ఢిల్లీలో గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించేలోపు కళాశాలలో మౌళిక వసతులు, సదుపాయాలుపై నివేదికలు తయారుచేస్తే అవసరమైన వాటిని సమకూరుస్తానన్నారు. సోమవారం తిరుపతిలో జరిగిన ఢిల్లీ ఎస్వీకళశాల గవర్నింగ్ బాడీ సమావేశంలో ఛైర్మన్ బిఆర్‌నాయుడును గవర్నింగ్ బాడీ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గవర్నింగ్ బాడీ ప్రతినిదులు ఆయనను అభినందించారు. ఢిల్లీలోని కళాశాలను మరింత ఉన్నతస్థాయికి అభివృద్ధిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

## యాత్రికుల భద్రతకు టిటిడి పెద్దపీట

### - మొదటిఘాట్‌లో కాలినడక భక్తులకు ప్రత్యేక క్యూలైన్



**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి అలిపిరి నుండి కాలినడకన తిరుమలకు వచ్చే భక్తుల సౌలభ్యం కోసం మొదటిఘాట్‌రోడ్డుపై కొంతదూరం వరకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. ఈ క్యూలైన్‌లను పటిష్టంగా నిర్మించడంతో భక్తులకు వాహనాల నుండి ప్రమాదాలు జరిగే అవకాశం లేదు. అలిపిరి కాలినడక మార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి మోకాళ్ళపర్వతం వరకు మొదటిఘాట్‌రోడ్డుపై నడచిరావడం జరుగుతుంది. ఇక్కడ గతంలో రోడ్డుదాటే సమయంలో అనేక ప్రమాదాలు జరిగాయి. భక్తులు ప్రాణాలు కోల్పోవడం, ఒతగాత్రులవడం జరిగింది. ఈ రోడ్డుపై భక్తులకు భద్రత గోవిందా అని వార్త ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన టిటిడి పాలకమండలి, అధికారులు పటిష్టంగా మొదటిఘాట్‌లో పుట్‌పాత్‌పై క్యూలైన్లరూపంలో అమర్చి దానినుండి ఎండ, వానకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించారు. అంతేగాక చిరుతపులుల బారినుండి కూడా రక్షణ కల్పించడంతో కాలినడక భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు రోడ్డుదాటే సమయంలో, నడచివచ్చేటప్పుడు భద్రత సిబ్బంది రక్షణగా వస్తున్నారు.

## అసౌకర్యాల నడుమ హోమం టిక్కెట్లు

### - అర్ధరాత్రినుండే అలిపిరిలో బారులు



**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి రకరకాలుగా భక్తులు ఆలోచన చేస్తుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గత పాలకమండలి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి అలిపిరిలో హోమం జరిపించి అందులో పాల్గొన్నభక్తులకు అదేరోజు 300 రూపాయలు సుపథం మార్గంలో శ్రీవారి దర్శనం చేయించేలా విధానం అమలు చేశారు. తోలుత ఈ విధానంలో ఆఫ్‌లైన్‌లోనే 200టిక్కెట్లు జారీచేసేవారు. ఉదయం 10గంటలకు హోమం పూర్తయితే అక్కడ నుండి ఈ రశీదుతో తిరుమలకు వచ్చిన భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఈ హోమం దర్శనాలకు డిమాండ్ పెరగడంతో వీటిని కూడా ఆన్‌లైన్ చేశారు. రోజుకు 150 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో, 50 టిక్కెట్లు అలిపిరిలోనే ఆఫ్‌లైన్‌లో ఇచ్చేలా చూశారు. ఈ ఆఫ్‌లైన్‌లో 50 టిక్కెట్లకు తొలిరోజుల్లో ఉదయం 5-6గంటల ప్రాంతంలో వచ్చిన భక్తులకు కూడా హోమంలో పాల్గొనే అవకాశం ఉండేది. అయితే ఈ విషయం దావానంలా వ్యాప్తిచెందడంతో సామాన్యభక్తులు కూడా తిరుమలలో దర్శనం టిక్కెట్లు దొరకనివాళ్ళు అర్థరాత్రి నుండి అలిపిరిలో నడకదారిమెట్లమార్గంలో గోప్రదక్షణశాల వద్ద హోమం కోసం బారులుతీరాల్సి వస్తోంది. రోజుకు సరాసరి 200మంది వరకు భక్తులు ఇక్కడ అర్థరాత్రినుండి పడిగాపులు కాయడం పరిపాటిగా మారింది. 50 టిక్కెట్లకు గంటలతరబడి నిరీక్షణతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇంకి చంటిపిల్లలు, వృద్ధులు కూడా తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ఇక్కడ రద్దీతో టిక్కట్లను పెంచాలని భక్తులు కోరుతున్నారు.

# హంస గుర్తింపు రద్దు వాస్తవం కాదు :అధ్యక్షుడు అరవపాల్

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్వీస్ అసోసియేషన్‌గా కొనసాగు తుందని రాష్ట్ర అధ్యక్షులు అరవపాల్ స్పష్టం చేశారు. హంసపై వచ్చిన నిరాధారమైన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే సంఘాలకు ప్రభుత్వ గుర్తింపునిచ్చేందుకు జారీ చేసిన జీఓ ప్రకారం సాధారణ పరిపాలన శాఖ ఏపీ హంసను అధికారికంగా గుర్తించిందని వివరించారు. తమ అసోసియేషన్ వైద్యాధికారి కంటే తక్కువ స్థాయిలో ఉన్న ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. తమపై వచ్చిన నిరాధార ఆరోపణలపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయానికి జూన్ 11నే నివేదికను సమర్పించామన్నారు. 2001 జూన్ 22 నుంచి సంఘం అన్ని కార్యకలాపాలను చట్టబద్ధంగా నిర్వహిస్తోందని, సంఘం నమోదు, గవర్నింగ్ బాడీ ఎన్నికలు, సభ్యత్వాలు అన్నీ క్రమబద్ధంగా జరిగాయని వెల్లడించారు. ఇటీవల డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం పేరుతో చేసిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపడతామని తెలియచేశారని, ఈ విచారణలో అన్ని రకాలుగా సహకరిస్తామని చెప్పామన్నారు. అయితే, విచారణ పూర్తి కాకముందే ఏపీ హంస గుర్తింపు తాత్కాలికంగా నిలిపివేయబడినట్లు ప్రధాన పత్రికలో వార్త రావడం, దాని ఆధారంగా ప్రచారం జరగడం సరికాదని అరవపాల్ పేర్కొన్నారు. విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నామని, అప్పటి వరకు సంయమనం పాటించాలని కోరారు. ఈ సందర్భంగా విచారణకు తగినంత సమయం ఇవ్వాలని, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని విచారణాధికారిని కోరుతున్నామన్నారు. అలాగే జాబితాలో మరణించిన, పదవీ విరమణ చేసిన, అనర్హులైన సభ్యులు ఉన్నారని ఆరోపణలు చేసారని, రెండేళ్ళ క్రితం నాటి పాత రికార్డుల ఆధారంగా ఆరోపణలు చేయడం అన్యాయమని, ప్రస్తుత డేటాను పరిగణనలోకి తీసుకోకుండా చేసిన ఆరోపణలు పరువు నష్టం కలిగించేవి అవుతాయని అరవపాల్ స్పష్టం చేశారు. ఏపీ హంస పరిధి లోని సంస్థాగత ఎన్నికలన్నీ బైలాస్ ప్రకారమే ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్వోఎస్ఏ నియామకాల ప్రకారం గుర్తింపు పొందని సంస్థ ఇచ్చే ఫిర్యాదును స్వీకరించడం, గుర్తింపు పొందిన హంస వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. ఈ విషయంలో నిష్పాక్షిక దర్యాప్తునకు సహకరించడానికి ఏపీ హంస పూర్తిగా సిద్ధంగా ఉందని, అలాగే ఆధారాలు సమర్పించడానికి రెండు వారాల సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామని ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు.

# విజయవాడలో 'పెళ్లి' మోసం

**విజయవాడ క్రైం,జూన్ 16,ప్రభాతవార్త** కర్నాటకకు చెందిన ఓ పెళ్ళి కుమారుడిని కృష్ణలంకకు చెందిన ఆమని అనే యువతితో పాటు కొంత మంది బ్రోకర్లు కలిసి కన్యాశుల్కం రీతిలో పెండ్లి కుమారుని నుండి డబ్బులు వసూలు చేసి ఆనక పరారైన ఉదంతంపై ఫిర్యాదు మేరకు ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక లోని కొప్పల్ జిల్లా, కొరటాయి మండలం, జేవీ క్యాంపు గ్రామానికి చెందిన కాంట్రాక్టరు వద్ద గుమాస్తాగా పనిచేస్తున్న కర్నాటకలో స్థిరపడ్డ గున్నం దుర్గాప్రసాద్‌కి 34 సంవత్సరాలు నిండినా వివాహం కాకపోవడంతో తాను ఉంటున్న ప్రాంతానికి చెందిన శ్రీదేవిని ఆశ్రయించాడు. ఆమె తనకు తెలిసిన రాజమండ్రికి చెందిన తాయారు అనే పెళ్ళిళ్ళ బ్రోకరును ఆశ్రయించింది. ఆమె తనకు తెలిసిన విజయవాడకు చెందిన పార్వతి, మెరాగ్ అనే వారి ద్వారా విజయవాడ కృష్ణలంక లోని 'ఎం' హోటల్ పక్క రోడ్డులో యువతి బంధువుల ఇంటి వద్ద పెళ్ళిచూపుల తతంగాన్ని నడిపించారు. ఈ నేపథ్యంలో పెండ్లి కుమార్తె ఆమని బంధువుల ఇంటిలో పెండ్లి చూపులు చూపించారు. పెండ్లి కుమారుడైన గున్నం దుర్గాప్రసాద్ వివాహం నిమిత్తం పెండ్లికుమార్తె పల్లవికి రూ. 2లక్షల70వేలు ఎదురు కట్నం ఇచ్చేలాగున ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే వారి నుండి ఖర్చులకని పెండ్లికుమార్తె తరపు వారికి రూ. 18వేలు ఇచ్చారు. బ్రోకరుగా వ్యవహారించిన

> - కన్యాశుల్కం రీతిలో పెళ్లి కుమారుని నుండి డబ్బు వసూలు
> - వివాహమై ఓ బిడ్డ ఉన్న యువతితో నాటకం ఆడించిన మధ్యవర్తులు
> - పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

పార్వతికి రూ. 50వేలు ఇచ్చారు. మరో బ్రోకరు రాజమండ్రికి చెందిన తాయారుకు రూ. 20వేలు ఇచ్చారు. పెండ్లి కుమార్తె బట్టలకని ఆమె స్నేహితురాలికి రూ. 18వేలు ఇచ్చారు. మిగిలిన సొమ్మును కర్నాటకలో తమ ఊరిలో ఉంటున్న శ్రీదేవికి ఇచ్చారు. గత నెల 13న విజయవాడలో పెండ్లి చూపుల తతంగం కూడ జరిపించారు. వివాహ తతంగంలో కొంత భాగాన్ని ఒన్‌టౌన్ ప్రాంతంలో నిర్వహించారు. అమ్మాయి వరునికి నచ్చడంతో ఇక మోసానికి తెరలేపారు. ఈ నెల 5న ఇంద్రకీలాద్రిపై వివాహం తంతు పెండ్లికుమార్తె అయిన ఆమనితో జరిపించారు. అనంతరం వారందరూ కర్నాటకకు చేరుకున్నారు. 7వ తేదీన కర్నాటక లోని పెండ్లికుమారుని స్వగృహంలో రిసెప్షన్ కూడ ఘనంగా నిర్వహించారు. మూడు నిద్రల అనంతరం పెండ్లికుమారుని ఇంట్లో ఆమని తన భర్తతో కాపురం చేసేందుకు నిరాకరించడంతో భర్త, అతని కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. దాంతో ఆమెను నిలదీయడంతో షాకింగ్ విషయం బయటకు వచ్చింది. తనకు అప్పటికే వివాహం అయ్యిందని, తనకు ఒక పిల్లవాడు కూడ ఉన్నాడని, తనను భర్త వదిలేయడంతో పిల్లలతో కలిసి జీవిస్తున్నానని, ఐదు రోజులు పెళ్ళికుమార్తెగా నటిస్తే రూ. 50వేలు ఇస్తామని ఆశ చూపి, తనకు కొంత సొమ్ము మాత్రమే ఇచ్చారని, తాయారు, పార్వతి, విమల, తదితరుల బ్రోకర్ల మాటలు విని ఈ వివాహం చేసుకున్నానని తెలిపింది. దాంతో మధ్యవర్తులు వివాహం అయిన శ్రీదేవి, పార్వతి, మెరాగ్ తదితరులు వివాహమైన మహిళను వివాహం గాని మహిళగా నమ్మించి సుమారు రూ. 4లక్షలు తన వద్ద వసూలు చేసి, వివాహం చేసి మోసం చేశారని ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు వివాహం జరిపించిన బ్రోకర్లపై ఛీటింగ్, తదితర సెక్షన్ల క్రింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆప్కో, లేపాక్షి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త డిజైన్ పోటీ

## గోడ పత్రికను ఆవిష్కరించిన ఆప్కో ఎండి విశ్వ మనోహారన్

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ హస్తకళలు, చేనేత కళలకు ఆధునిక రూపమిచ్చే ఉద్దేశంతో ఆప్కో, లేపాక్షి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త డిజైన్ పోటీని నిర్వహిస్తున్నట్లు ఈ సంస్థల ఎండి విశ్వ మనోహరన్ తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సైతం ఈ పోటీలో భాగస్వామిగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ హస్తకళలుగా గుర్తింపు పొందిన కొండపల్లి, ఎటికొప్పాక బొమ్మలు, కలంకారి ప్రింట్లు, లెదర్ పప్పెట్రీ, వుడ్ కార్వింగ్‌లు , నేత కళలుగా ప్రసిద్ధి చెందిన ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, బందరు ఇత్యాది - ఆధారంగా నూతనంగా రూపొందించిన వస్త్రాలు, సూక్ష్మ జాపికల విభాగంలో నూతనత్వం ఉట్టిపడేలా కొత్త డిజైన్లను ఆహ్వానిస్తున్నారు. వినియోగ ప్రయోజనమున్న వస్తువులకు ప్రాధాన్యత ఇస్తారు. పోటీకి 18 సంవత్సరాల పైబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కళాకారులు, నేతన్నలు, డిజైనర్లు, విద్యార్థులు పాల్గొనవచ్చు. సృజనాత్మకత, సంప్రదాయ నైపుణ్యం, స్థిరత్వం వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను నిపుణుల కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రతి విభాగంలో మూడేసి బహుమతులు ప్రకటిస్తారు - మొత్తం 30 బహుమతులు. మొదటి బహుమతి ..25,000, రెండో బహుమతి ..15,000, మూడో బహుమతి ..10,000. మొత్తం ప్రైజ్ మనీ ..5 లక్షలను ఆప్కో, లేపాక్షి సంయుక్తంగా అందజేస్తున్నాయి. పాల్గొనదలచిన వారు తమ రూపొందించిన నమూనాలను 2025 జూలై 16లోపు సమీప లేపాక్షి లేదా ఆప్కో షోరూమ్‌లలో అందించాలి. ఇది జూన్ 17న ప్రారంభమైన 30 రోజుల వ్యవధిలో ముగుస్తుంది. వివరాలు, మార్గదర్శకాల కోసం ఈ వెబ్‌సైట్‌లను సందర్శించవచ్చని విశ్వ మనోహరన్ తెలిపారు.

# 21న రాష్ట్రంలో లక్షపైగా యోగా కార్యక్రమాలు

### - ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణబాబు

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జూన్ 21 వ తేదీన రాష్ట్రంలో 1 లక్ష పైబడి ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించుటకు ప్రభుత్వ ఆయుష్ శాఖ ఏర్పాట్లు చేస్తోందని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి. కృష్ణ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇప్పటికే 1,05, 266 ప్రదేశాలను గుర్తించడం, ఇక్కడ ఒక సారి యోగా సాధన చేయడం కూడా పూర్తైందని వారు తెలిపారు. జూన్ 21 వ తేదీన ఈ యోగా ప్రదేశాలో 2 కోట్ల మంది ప్రజలు యోగా సాధన చేస్తారని చెప్పారు. యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. యోగాంధ్రను ఒక నిరంతర కార్యక్రమంగా నిర్వహించే ఆలోచన ప్రభుత్వం చేస్తోందన్నారు.

వార్త

నువ్వీ కార్యం సాధించలేవు అని అందరూ అన్న పనిని నిర్వహించడమే మనిషి జీవితంలో గొప్ప ఆనందం.

-వార్డ్ బగెహాట్

# ఏవియేషన్‌కు ఎన్ని శాపాలో!

ప్రతికూల వాతావరణం, సాంకేతిక సమస్యకు మానవ తప్పిదాలతో ఇప్పుడు ఏవియేషన్ రంగ ప్రతిభ మసిబారుతోంది. గత 40 రోజుల్లో విమానరంగం ఒక్క కుదుపునకు గురైంది. ఒక మహా విషాదాన్ని భారతదేశం చవిచూసింది. దీనికితోడు 5 హెలికాప్టర్‌లు అననుకూల వాతావరణంలో కూలిపోయాయి. ఇంకా ఇలాంటి ఘటనలు నమోదవుతూనే ఉన్నాయి. అహ్మదాబాద్ ప్రమాదంలో ఇప్పటికే 279 మంది మృతి చెందినట్లు అధికారికంగా ప్రకటించారు. కాలిన గాయాలతో ఇప్పటికీ క్షతగాత్రులు ఆసుపత్రులలోనే చికిత్స పొందుతున్నారు. తాజాగా గౌరీకుండ్ సోన్ ప్రయాగ్ అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి చెందారు. గౌరీ కుండ్ అడవులకు దాదాపు 5కి.మీ ఎగువనున్న కొండప్రాంతానికి చేరుకోగానే కూలిపోయింది. దట్టమైన పొగమంచువల్ల పైలట్‌కు మార్గం సరిగా కనిపించక ప్రమాదం జరిగినట్టు తేల్చేశారు. ఉత్తరాఖండ్ హెలికాప్టర్ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. కానీ ఇదే పరిష్కారం కాకూడదు. అణ్వాయుధాలు, అంతరిక్ష ప్రయోగాల్లో రోజురోజుకీ ఎంతో ముందడుగువేస్తున్నా ఏవియేషన్ రంగంలో ఎందుకు వెనుకబడి ఉన్నామో తెలుసుకునేందుకు ఇన్నాళ్లు పట్టింది. జీవ విహంగం ఢీకొడితే ఎంతో పెద్దగా ఉండే లోహవిహంగం తలకిందులైపోతుందంటే ఆశ్చర్యంగా ఉంది. 'మేడే'కాల్ అంటే చావుకు దగ్గరయ్యామన్న సంకేతానికి స్పందించలేకపోవడం విచిత్రమే మరి. కారణాలేవైనా గాల్లో ప్రాణాలు కోల్పోవడమంటే హృదయ విదారకమే. సహజ మరణం వేరు సజీవ దహనం వేరు. ఈ రెండింటికీ ఒకేలా స్పందించలేము. అర్థాయుష్షుతో ఒకరు విగత జీవుడయ్యారంటే, అది అనుకోని దుర్ఘటనలో అయితే కోలుకోవడం కష్టమే. ప్రమాదాలు జరగనంతసేపూ 'మేమే విజయవంతంగా విమానాలు నడిపామని, మనదే ఘనత అని చాటుకునే విమాన సంస్థలు ప్రమాదం జరిగాక తప్పించుకునేందుకు చూస్తాయి. ఎయిర్ ఇండియా అలాకాక కష్టనష్టాల భారాన్ని తానే భరిస్తోంది. బోయింగ్ డ్రీమ్ లైనర్ ప్రమాదం టాటాసన్స్ చరిత్రలోనే అత్యంత ఘోరమైన దుర్ఘటన అని టాటాసన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ బహిరంగంగానే ప్రస్తావించారు. ఇప్పటికే ప్రమాద మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని ప్రకటించారు. క్షతగాత్రుల వైద్య ఖర్చులకూ వారే భరోసా ఇచ్చారు. అదనంగా తక్షణ ఉపశమనంగా 25 లక్షలు ఇస్తోంది. విమానాల కండిషన్, వాటి నిర్వహణ విధానం, వివిధశాఖల అప్రమత్తత వంటి అన్ని విషయాల్లోనూ కూలంకషంగా పరిశీలిస్తున్నారు. ఎవరేమిచెప్పినా ఎన్ని విశ్లేషణలు చేసినా, ఎన్ని అనుభవాలను క్రోడీకరించినా అహ్మదాబాద్ విమాన ప్రమాద కారణాలు అంతుపట్టడం లేదు. అయితే అదృష్టవశాత్తు బ్లాక్‌బాక్స్ దొరికింది. కనుక ప్రమాద కారణాలను తేల్చే స్తుందన్న నమ్మకం అధికారుల్లో, ఏవియేషన్ మంత్రిత్వ శాఖలో వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మాంట్రియల్ ఒప్పందం మేరకు ఎయిర్ ఇండియా మొత్తం 412కోట్ల రూపాయలు మృతుల కుటుంబాలకు చెల్లించాల్సి ఉం టుంది. ఎయిర్ ఇండియా మొత్తం 30డ్రీమ్‌లైనర్‌లను నడుపుతోంది. 2012 మోడల్స్ కూడా ఉన్నాయి. ఎంతో భద్రత కలిగిన పటిష్ట విమానంగా కీర్తించబడే డ్రీమ్‌లైనర్‌కు దాని వినియోగదారులకు పరోక్షంగా దాని తయారీదారులకు కష్టాలొచ్చిపడ్డాయి. విమాన పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్ చిట్టచివరి సందేశంఇప్పుడు బ్లాక్‌బాక్స్ వాయిస్ రికార్డర్ నుంచి బయటపడింది. 'మేడే…నో పవర్..గోయింగ్‌డౌన్' ఆ తర్వాత ఏం జరిగిందో మనకుతెలిసిందే. అంత అప్రమత్తంగా ఉన్నా వారెవరినీ కాపాడుకోలేకపోయాం. గుర్తుగా మిగిలిపోయిన మృత్యుంజ యుడు బ్రిటన్ జాతీయుడు విశ్వాస్‌కుమార్ రాజేష్‌ను తప్ప. అందరూ అనుకున్నట్లు రెండు ఇంజిన్‌లు ఒకేసారి విఫలమయ్యే ఛాన్స్ బహు తక్కువ అయినందునఇంధన 'కల్తీ' అయిందా? అనే కొత్త సందేహం వ్యక్తం చేస్తున్నారు. పక్షి ఢీకొంటే విద్యుత్ సరఫరాకు అంతరాయం నిజమేకానీ 'ఒక పక్షి రెండు ఇంజన్లను' ఒకేసారి ఢీకొనడం సాధ్యం కాదని తేల్చేశారు. బోయింగ్‌లో అత్యాధునిక శ్రేణి విమానాల్లో రెండుశక్తివంతమైన ఇంజిన్లు ఉంటాయి. కనుక ఇంజిన్‌ల వైఫల్యాన్ని కొట్టిపారేస్తున్నా రు. జీఈ ఏరో స్పేస్ తయారు చేసిన ఈ ఇంజన్లలో ఎలాంటి సమస్యలూ లేవని ఈ డ్రీమ్ లైనర్ తనిఖీలో ఏప్రిల్ నెలనివేదిక తెలుపుతోంది. బోయింగ్ 787 నిర్వ హణ ఒప్పందాన్ని ఇప్పుడు టర్కిష్ టెక్నిక్ సంస్థ త్రోసి రాజంటోంది. ఎయిర్ ఇండియా ఎఐ 171 విమానాన్ని 787 చెబుతుంటారు. అయితే టర్కీ కంపెనీ తాము 777వైడ్ బాడీల నిర్వహణకే పరిమితమంటోంది. ఈప్రమాదం తర్వాత విమాన నిర్వహణ విధానాల పాటింపువంటి అంశాలలో నిర్వహణ భాగస్వామ్య సంస్థలు బహిరంగ వివరణలిస్తూ ఈ ప్రమాదానికి తమ నిర్వహణలకు సంబంధమేమీ లేదని వివరిస్తున్నాయి. నిన్నమొన్నటి భారత్,పాక్ యుద్ధ సందర్భంగా ఇరుదేశాల గగనతలాలపై ఆంక్షలు, తాజాగా ఇరాన్, ఇజ్రాయిల్‌ల మధ్య జరిగిన యుద్ధంలో ఇరాక్ గగనతలాన్ని మూసేశారు. ఇలా గగనతలాల మీద ఆంక్షలతో ప్రయాణీకుల ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఏక మొత్తం మీద విమానయాన రంగం ఆటుపోట్లకు గురయింది. విమానయానంపై అపోహలైనా, అపార్థాలైనా తొలగాలంటే ఇప్పటివరకు జరుగుతున్న ప్రమాదాలు ఏ కోవకు చెందినవో తేలాలి. పటిష్ట నివారణ చర్యలకు ముందడుగు వేయాలి. అప్పుడే ప్రయాణికుల్లో విశ్వాసం కలుగచేయకలుగుతాయి.

నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం కొనసాగిస్తే మనం ఏ పనైనా సాధించగలం.



షేక్‌స్పియర్

నీలో ఉన్న శక్తిని నీవు తెలుసుకున్నప్పుడే గమ్యం చేరగలవు. కనుక ముందు నీ గురించి నీవే పరిశోధించుకో.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



### పెరిగిన ఇంజినీరింగ్ ఫీజులు

**ఇటీవలికాలంలో** ఇంజినీరింగ్ కళాశాలలు తమ ఫీజులను భారీగా పెంచబోతున్నారన్న వార్తలు విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది ఇప్పటికే ఆర్థికంగా ఒత్తిడిలో ఉన్న మధ్యతరగతి,పేద కుటుంబాలకు మరింత భారంగా మారుతోంది. కోచింగ్,హాస్టల్,ప్రయాణ ఖర్చులతో విద్యార్థులు ఇప్పటికే తీవ్ర ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు అదనపు ఫీజుభారం వల్ల వారి విద్యను మధ్యలోనే నిలిపేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రతిమూడు సంవత్సరాలకు ఫీజు సమీక్షించాల్సి ఉంటుంది. కానీ2025-28 సంవత్సరాలకు ఎఫ్‌ఆర్‌సీ ప్రతిపాదించిన 100శాతం ఫీజు పెంపు అనేది అర్థవంతంకాదు. విద్యాశాఖ కార్యదర్శి గారు దీనిని తగిన విధంగాతిరస్కరించారు. గరిష్ఠంగా 30శాతానికి మించకూడదని ఆమె సూచించటం సముచితమైన అభిప్రాయం.

**- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం**

### తెలుగు వారసత్వాన్ని చాటాలి

**తెలుగు** ప్రాచీన కవులలో శ్రీనాథుడు గొప్ప కావ్యాలు, పురాణాలు, ప్రబంధాలు రాశారు. కవిత్రయం మహాభారతాన్ని ఆంధ్రీకరిస్తే, పోతన తేట తెలుగులో భాగవతాన్ని మనకు అందించారు. శైవ వాఙ్మయం విషయానికి వస్తే పురాణాంతర్గత విషయాలను స్వతంత్రమైన కావ్యమార్గంలో రచన చేయటంలో శ్రీనాథుడు దిట్ట. హైదరాబాదు నగరంలో అట్టి ప్రాచీనకవి విగ్రహం లేకపోవటం ఎంతో లోటుగా ఉంది. ఇప్పటికైనా తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుని ట్యాంక్‌బండ్‌పై శ్రీనాథుని విగ్రహాన్ని నెలకొల్పి తెలుగుభాషా సాంస్కృతిక వారసత్వాన్ని చాటాలి.

**- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్**

### చెరగని మచ్చ

**విపరీతమైన** ఆక్సిడెంట్లు అయితే గాని, అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోతే గాని వ్యవస్థలు గాని, సబంధిత అధికారులుగాని స్పందించకపోవడంమనంచూస్తూనే ఉన్నాం. ఇప్పుడూ అదే జరుగుతోంది. క్రేష్ అయిన బోయింగుకు సంబంధించి అధికారులు,ఎయిర్పోర్ట్ అథారిటీర్లకు కుంభకర్ణ నిద్ర నుండి మేల్కొనినట్లుగా జాగ్రత్తల దొంతర్లు ఒకదానిపై ఒకటి పెట్టేస్తున్నారు. కోట్ల కోట్లు సరితూగే లైఫ్ ఇవ్వగలరా. ఆ జీవితాల్ని తీసుకురాగలరా.

**- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్**

### గుర్తింపుతో పెరగనున్న ఆదరణ

**ఎపిలోని** ప్రముఖ పర్యాటక స్థలం బెలూం గుహలకు భౌగోళిక వారసత్వ గుర్తింపు లభించింది. దేశంలోనే అత్యంత పురాతనమైన, పొడవైన అంతర్భాగ గుహలుగా ప్రఖ్యాతిగాంచిన ఈ గుహలలో క్రీ.పూ.400ఏళ్ల కిందట ఆదిమానవులు నివసించారు. ఈ గుర్తింపుతో బెలూం గుహలకు పర్యాటకుల ఆదరణ పెరగడంతోపాటు వసతులు మెరుగు కానున్నాయి. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ కింద బాపట్ల జిల్లా కుప్పడం చీరకు కేంద్ర గుర్తింపు లభించింది. ధవళ వర్ణంలో మేటి పట్టుతో రూపొందే కుప్పడం చేనేత చీరలకు ఈ గుర్తింపుతో అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ లభించనుంది. చేనేత కళాకారులకు చేతినిండా పని దొరకనుంది.

**-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా**

### మరపురాని మహా విషాదం

**అన్నిరకాల** ప్రయాణాల్లో కెల్లా విమాన ప్రయాణం సురక్షితమైనది అంటారు. కానీ గత గురువారం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయం నుండి 'లండన్' లోని 'గాట్విక్'కు వెళ్లవలసిన బోయింగ్ 787 బయలుదేరిన రెండు నిమిషాలలోపే విమానాశ్రయం సరిహద్దు గోడలకు పక్కనే ఉన్న భవనాల మీద కూలిపోయి అందులోని ప్రయాణికులు, సిబ్బంది మొత్తం 241 మంది దుర్మరణం చెందటం అనేది విమానయాన చరిత్రలోనే అత్యంత ఘోర దుర్ఘటనగా చెప్పవచ్చు. ప్రపంచంలోని వివిధ సంస్థల తయారీ విమానాలతో పోల్చినప్పుడు బోయింగ్ విమానాలు అత్యున్నతమైనవని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు ఈ దుర్ఘటనకు ఎవరు బాధ్యులు? మానవ తప్పిదమా లేక సాంకేతికత కారణమా అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం నిపుణుల పర్యవేక్షణలో కనుగొని, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆశిద్దాం.

**- దాసం వెంకటరెడ్డి,బెంగుళూరు**

### కల్తీ విత్తనాలను అరికట్టాలి

**ఖరీఫ్** సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఫర్టిలైజర్ యాజమాన్య సంస్థలు రైతులకు అందించేవిత్తనాలపైదృష్టిసారించి నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులు మోసపోకుండా చూడాలి. అదేవిధంగా అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీకి రాష్ట్ర ప్రభుత్వమే అందించే ప్రయత్నం చేయాలి.

**-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా**

మనవి: ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పవన విద్యుత్తును బలోపేతం చేయడమెలా?

*గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ ప్రకారం, మన దేశంలో పవన శక్తి ఉత్పత్తి ఖర్చు ఇతర సాంప్రదాయక వనరుల కంటే 40 శాతం తక్కువగా ఉంది. ఇది పెరుగుతున్న విద్యుత్ ధరలకు శాశ్వత కవచంలా పని చేస్తుంది. అంతేకాకుండా, పవన విద్యుత్ రంగం అభివృద్ధి చెందడం వల్ల కొత్త ఉద్యోగ అవకాశాలు వస్తాయి, తద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. భూసేకరణ చిక్కులు ఒక పెద్ద సమస్య. పెద్ద విండ్ టర్బైన్‌లకు చాలా స్థలం అవసరం. వ్యవసాయ భూమిని పవన విద్యుత్ ప్రాజెక్టులకోసం మార్చడంలో జరిగే జాప్యం పెద్ద ప్రాజెక్టులకు అడ్డంకిగా మారుతోంది. నాణ్యతలేని గ్రిడ్, మౌలిక సదుపాయాలు మరో ముఖ్యమైన సవాలు. అధిక పవన విద్యుత్ సామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో సరైన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ లేకపోవడం వల్ల విద్యుత్‌ను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు చేరవేయడం కష్టం. దీనివల్ల విద్యుత్ ఖర్చులు పెరుగుతున్నాయి. ఉత్పత్తి అయిన విద్యుత్ వృథా అవుతోంది.*

డి.జె.మోహన రావు

వాతావరణ కాలుష్యం, భూతాపం వంటి సమస్యలు ప్రపంచాన్ని పీడిస్తున్న ప్రస్తుత తరుణంలో, స్వచ్ఛమైన, పునరుత్పాదకమైన పవన శక్తి మన భవిష్యత్తుకు నిజమైన ఆశాకిరణంగా నిలుస్తోంది. దేశ ప్రగతిలో 'గాలి శక్తి' కీలక పాత్ర పోషిస్తోంది. 2014లో దేశ పవన విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం సుమారు 23.35 గిగావాట్లు మాత్రమే. పదేళ్ల కాలంలో ఈ రంగం అనేక ఆటుపోట్లను తట్టుకొని నిలబడింది. 2025 మార్చి 31 నాటికి మన దేశం 50.04 గిగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించి, ఈ రంగంలో ప్రపంచంలోనే నాల్గవ స్థానంలో నిలిచింది. చైనా, అమెరికా, జర్మనీలు మాత్రమే మన కంటే ముందున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో దేశం సుమారు 28,214 గిగావాట్ గంటల పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇది సుమారు 83,385 గిగావాట్ గంటలకి చేరుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం 4.15 గిగావాట్ల కొత్త పవన విద్యుత్ సామర్థ్యాన్ని జోడించింది. ఇది అంతకు ముందు సంవత్సరం కంటే ఎక్కువ. దేశంలో గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు పవన విద్యుత్ ఉత్పత్తిలో ముందున్నాయి. మన దేశంలో సంవత్సరానికి దాదాపు 18,000 మెగావాట్ల విండ్ టర్బైన్‌లను తయారు చేసే సామర్థ్యం ఉండటం 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తికి నిదర్శనం. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ అంచనాల ప్రకారం, తీరప్రాంతాల్లో 71గిగావాట్ల వరకు సముద్ర పవన విద్యుత్ (ఆఫ్‌షోర్ విండ్ ఎనర్జీ) ఉత్పత్తి చేయగల అపారమైన అవకాశం ఉంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నివేదిక ప్రకారం 2029-30 చివరి నాటికి పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 99.9 గిగావాట్లు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. సాంకేతికత అభివృద్ధితో పవన విద్యుత్ ప్రాజెక్టుల స్థాపన ఖర్చు గణనీయంగా తగ్గింది. తద్వారా ఇది 'గ్రీన్ ఎనర్జీ' విప్లవానికి ఊపునిస్తోంది. ఈ అద్భుతమైన ప్రగతికి సరైన విధానపరమైన నిర్ణయాలు, పెట్టుబడులు, స్థిరమైన ప్రణాళిక కారణం. పవన విద్యుత్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు, భూసేకరణలో సరళీకరణ, ప్రాజెక్టుల వేగవంతమైన అనుమతులు ఈ వృద్ధికి ఆజ్యం పోశాయి. ముఖ్యంగా, 'ఫీడ్‌ఇన్ టారిఫ్' నుండి 'పోటీ బిడ్డింగ్' పద్ధతికి మారడం పారదర్శకతను పెంచి, ప్రాజెక్టుల అమలును వేగవంతం చేసింది. అలాగే, అంతర్‌రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీల మినహాయింపు వంటివి పవన విద్యుత్ ఉత్పత్తిదారులకు మరింత వెసులుబాటును కల్పించాయి. పవన విద్యుత్ అంటే గాలిని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేసే పర్యావరణహిత ప్రక్రియ. దీనికి ప్రధానంగా విండ్ టర్బైన్‌లు అనే భారీ యంత్రాలు ఉపయోగపడతాయి. గాలి వేగంగా వీయగానే అవి తిరగడం మొదలుపెట్టి, జనరేటర్‌ను నడిపి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇది పూర్తిగా పర్యావరణ అనుకూలమైనది, ఎటువంటి కర్బన ఉద్గారాలను ఉత్పత్తి చేయదు, కాబట్టి గ్రీన్‌హౌస్ ప్రభావానికి, వాతావరణ కాలుష్యానికి కారణం కాదు. ఇది స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించే ఆకుపచ్చని పరిష్కా



రం. గ్రిడ్ సదుపాయం సరిగా లేని మారుమూల ప్రాంతాల్లో పవన శక్తిని ఉపయోగించి గ్రామీణ విద్యుదీకరణకు చక్కటి, స్థిరమైన మార్గాన్ని అందించవచ్చు. ఆర్థికంగా చూస్తే, సాంప్రదాయక విద్యుత్ ప్రాజెక్టులతో పోలిస్తే,పవన విద్యుత్ తయారీకి తక్కువ వ్యయం అవుతుంది. నిర్వహణ ఖర్చులు కూడా చాలా తక్కువ. గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ ప్రకారం, మన దేశంలో పవన శక్తి ఉత్పత్తి ఖర్చు ఇతర సాంప్రదాయక వనరుల కంటే 40 శాతం తక్కువగా ఉంది. ఇది పెరుగుతున్న విద్యుత్ ధరలకు శాశ్వత కవచంలా పని చేస్తుంది. అంతేకాకుండా, పవన విద్యుత్ రంగం అభివృద్ధి చెందడం వల్ల కొత్త ఉద్యోగ అవకాశాలు వస్తాయి, తద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. భూసేకరణ చిక్కులు ఒక పెద్ద సమస్య. పెద్ద విండ్ టర్బైన్‌లకు చాలా స్థలం అవసరం. వ్యవసాయ భూమిని పవన విద్యుత్ ప్రాజెక్టులకోసం మార్చడంలో జరిగే జాప్యం పెద్ద ప్రాజెక్టులకు అడ్డంకిగా మారుతోంది. నాణ్యతలేని గ్రిడ్, మౌలిక సదుపాయాలు మరో ముఖ్యమైన సవాలు. అధిక పవన విద్యుత్‌సామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో సరైన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ లేకపోవడం వల్ల విద్యుత్‌ను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు చేరవేయడం కష్టం. దీనివల్ల విద్యుత్ ఖర్చులు పెరుగుతున్నాయి. ఉత్పత్తి అయిన విద్యుత్ వృథా అవుతోంది. విధానాలలో అస్థిరత ఈ రంగానికి అనిశ్చితిని కలిగిస్తోంది. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ప్రోత్సాహకాలను ఉపసంహరించడం వల్ల పెట్టుబడిదారులు వెనకడుగు వేస్తున్నారు. విండ్ టర్బైన్ బ్లేడ్‌ల లభ్యత సమస్యగా ఉంది,వాటిని ఎక్కువగా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. చివరగా, ఈవ్యర్థాల సమస్య పర్యావరణానికి ఒక కొత్త సవాలుగా మారుతోంది. పాతబడిపోయిన టర్బైన్ భాగాలను పారవేయడం కష్టం, ముఖ్యంగా కాంపోజిట్ మెటీరియల్‌తో చేసిన బ్లేడ్‌లను రీసైకిల్ చేయడం మరింత క్లిష్టమైన పని. పవన విద్యుత్‌కు ఉన్న పరిమితులలో, గాలి లభ్యత ఎల్లప్పుడూ స్థిరంగా ఉండదు. బలమైన, స్థిరమైన గాలులు వీచే చోట మాత్రమే విండ్ టర్బైన్‌లు సమర్థవంతంగా పనిచేస్తాయి. అన్ని సమయాల్లోనూ గాలి ఒకే విధంగా ఉండదు. అధిక గాలుల ప్రమాదం ఉంది, టర్బైన్ బ్లేడ్‌లు, అధిక గాలులు పిడుగుల వల్ల దెబ్బతినే అవకాశం ఉంది. వోల్టేజ్ హెచ్చుతగ్గులు విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించడంలో ఇబ్బందులు కలిగిస్తాయి. చివరగా శబ్దకాలుష్యం విండ్ టర్బైన్ బ్లేడ్‌లు తిరిగేటప్పుడు సమీపంలోని నివాసితులకు కొంతచికాకు కలిగించవచ్చు. దేశవ్యాప్తంగా ఒక ఏకరీతి జాతీయ పవన విధానాన్ని అమలు చేయడం అత్యవసరం. పాత విండ్ ఫారమ్‌లను అధిక సామర్థ్యంగల టర్బైన్‌లతో 'రీపవర్' చేయడం ద్వారా ఉత్పత్తిని గణనీయంగా పెంచవచ్చు. భూబ్యాంకు ఏర్పాటు చేయాలి. సముద్ర పవన విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించాలి. డెన్మార్క్, యునైటెడ్ కింగ్‌డమ్ వంటిదేశాల సహాయంతో, సముద్ర తీరంలో టర్బైన్‌ల ఏర్పాటును వేగవంతం చేయాలి. హైబ్రిడ్ విండ్‌సోలార్ ప్రాజెక్టులు ప్రోత్సహించాలి. 'గ్రీన్ బాండ్ల' ద్వారా నిధుల సమీకరణను ప్రోత్సహించాలి. పవన విద్యుత్ వల్ల కలిగే ఉద్గారాల తగ్గింపును 'కార్బన్ క్రెడిట్' విధానాలద్వారా ద్రవ్యీకరించాలి. విండ్ ఎనర్జీ పరికరాల తయారీ కోసం 'ఉత్పత్తి_అనుసంధాన ప్రోత్సాహక పథకం' ప్రవేశపెట్టాలి. కొత్త సాంకేతికతలపై దృష్టి సారించాలి. లోతైన సముద్రంలో గాలి శక్తిని ఉపయోగించుకోవడానికి 'తేలియాడే విండ్ టర్బైన్‌లను' అన్వేషించాలి. గాలి శక్తి ప్రాముఖ్యతను గుర్తించి, దానిని మరింత విస్తృతంగా ఉపయోగించుకునే దిశగా అడుగులు వేద్దాం. •

# ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ అందరి బాధ్యత!

మన్నారం నాగరాజు

ప్రపంచం వేగంగా ముందుకు పోతోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న జనాభా, నీటి వనరులపై అధిక భారం.. ఇవన్నీ కలిసి మన భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నాయి. ప్రత్యేకించి మన దేశంలో గ్రామీణ ప్రాంతాల నుండి మహానగరాల వరకూ నీటి వినియోగం పెరిగిపోతోంది. భూగర్భజలాల పరిమితి, వర్షాలపై ఆధారపడిన వ్యవసాయ విధానంవంటి అంశాలు నీటి సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఇంకుడు గుంతలు ఒక చౌక,సాధారణ, సమర్థవంతమైన పరిష్కారంగా ముందుకు వస్తున్నాయి. కానీ దీనికి తగిన విధంగా ప్రాధాన్యత ఇవ్వడం, ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు ఉండేలా చేయడం ప్రభుత్వాల ముఖ్య బాధ్యతగా మారాల్సిన అవసరం ఉంది. వర్షపు నీటిని భూమిలోకి చేరుస్తూ, భూగర్భజలాలను పునరుత్పత్తి చేసే విధానంగా ఇంకుడు గుంతలు పనిచేస్తాయి. ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక గుంత ఏర్పాటు చేయాలన్న నిబంధనను ప్రభుత్వాలు విధించాలి. ఇది కేవలం సలహాస్థాయిలో కాకుండా, చట్టబద్ధంగా అమలులోకి రావాలి. మహానగరాల్లో కొత్తగా ఇల్లు కట్టించుకునే వారు, అపార్ట్‌మెంట్లు నిర్మించుకునే వారు, ఇతర నిర్మాణాలు చేపట్టేవారు పర్మిషన్ పొందే దశలోనే ఈ అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు అందాలి. ఇంకుడు గుంత ఏర్పాటు చేయడమేగాక, కనీసం రెండు చెట్లు నాటడం తప్పనిసరి షరతుగా ఉండాలి. ఇది పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారుతుంది. నగరాల్లో పెరిగే ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే, నీటి నిల్వలను భద్రపరచాలంటే చెటు, వర్షపు నీటి నిల్వలు ఎంతో అవసరం. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తించాలి. ప్రభుత్వాలు ప్రజలకు కేవలం నియమాలు విధించడం కాదు,అవగాహన కల్పించడంలో ముందుండాలి. గ్రామీణ ప్రాంతాల్లో నీటి విలువను తెలియజేయాల్సిన బాధ్యత స్థానిక పాలన వ్యవస్థలపైనా ఉంది. గ్రామపంచాయతీలు, వాటి పరిధిలోని వాలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు,అందరూ కలిసి నీటి నిలువపై ప్రచారం చేయాలి. పాఠశాలల స్థాయిలో నుంచే విద్యార్థులకు నీటి విలువ, వృథా ఆపడం, గుంతల ఏర్పాటుపై బోధించాలి. ప్రజలకూ ఇదే సమయంలో స్పష్టమైన బాధ్యత ఉంది. ఇంటి నిర్మాణం అనేది కేవలం ఇంటి గోడలు కాదు. అది ప్రకృతితో సంబంధాన్ని ఏర్పరచే అవకాశం. వాస్తవానికి మన పురాతన సంస్కృతిలో వర్షపు నీటిని నిల్వ చేయడం, చెట్లు నాటడం, తోటలు పెంచడం చాలా సాధారణంగా కనిపించేవి. ఆధునిక జీవనశైలిలో ఇవన్నీ మరిచిపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాబట్టి, ప్రజలంతా కూడా తమ ఇంటి నిర్మాణంలో మరొక గదిని వేసినట్టు, ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేయడం, రెండు చెట్లు నాటడం తప్పనిసరి బాధ్యతగా భావించాలి. పర్యావరణ పరిరక్షణ అనే ప్రక్రియలో భాగస్వాములవ్వాలంటే, నీటి విలువను గుండెల్లో పెట్టుకోవాలి. ఇకపై ప్రభుత్వాల కార్యాచరణల్లో నీటి నిల్వ, వృథా నివారణ, చెట్ల పెంపకం, గుంతల ఏర్పాటును కీలక భాగంగా చేస్తూ ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో వాటిని చేర్చాలి. నీటి భద్రత లేకుండా ఏ అభివృద్ధీ స్థిరంగా ఉండదు. ప్రస్తుతం నీటి కొరత, భూగర్భ జలాల వనరులు ప్రధాన సమస్యలుగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్)ఏర్పాటు చేయడం అత్యంత అవసరం. ఈ చర్య వర్షపునీటిని భూగర్భంలోకి చొప్పించి నీటి లభ్యతను పెంచుతుంది. అయితే ప్రజలు స్వచ్ఛందంగా ఈ గుంతలు ఏర్పాటు చేసుకోవడంలో ఆసక్తి చూపడం తక్కువగా కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో, ప్రభుత్వాలు ప్రోత్సాహకంగా పని చేయాలి. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసిన ఇళ్లకు వార్షిక ఇంటి పన్నులో 10శాతం నుండి 15శాతం వరకు రాయితీకల్పిస్తే, ఇది ప్రజలను ఉత్తేజితులుగా చేసుకుంటారు. ఈ విధంగా ఒకవైపు ప్రజలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందంటే, మరోవైపు నీటి భద్రత పెరుగుతుంది. ఇది పర్యావరణ హితమైన చర్యగా మారుతుంది. ఈ విధానం ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరిగి, నగరాలు, గ్రామాలు నీటి పరిరక్షణలో ముందంజ వేయగలవు. దీని వల్ల భవిష్యత్ తరాలకు నీటి లభ్యతపై భరోసా కలుగుతుంది. •

# అనుభవ సారంతో 'అభివృద్ధి మథనం'



రావులపాటి సీతారాంరావు

ఈ మధ్య అనుభవజ్ఞులైన సీనియర్, వెరీ సీనియర్ సిటిజన్లు ఒక సమావేశంఏర్పాటు చేసినప్పుడు వారి సంభాషణ ఆసక్తికరంగా మారింది. చాలా తాపీగా ప్రారంభమైన చర్చలు కొద్ది సేపటికే వేడెక్కాయి. వేడి ఎక్కడానికి అనేక కారణాలు ఉన్నాయి. వారంతా వివిధ రంగాల్లోంచి వచ్చిన వారు. జీవితాన్ని కాచి వడపోసిన వారు! దేశమంటే ప్రాణం పెట్టే వారు. ఉద్యోగాల్లో ఉన్నప్పుడు వేరువేరు వృత్తుల్లో ఉన్నా దేశ భవిష్యత్తును గురించి ఆలోచించటమే కాదు, దేశం ఎటుపోతున్నది అని మథనపడ్డవారు. ప్రస్తుతం తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని తపన పడ్తున్నవారు. జీవితాల్లో విశ్రాంతి తీసుకొనే సమయం ఆసన్నమయినప్పుడు కూడా వారు దేశంలోని పరిస్థితులను గురించి ఆలోచనలనుపంచుకోవటమే కాదు నిర్దిష్టమైన అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నప్పుడు వ్యతిరేకత వచ్చినాసరే, ఖండితంగా చెప్పే విధానాల్లో మార్పురాకపోవటం వినేవారికి ఎవరికైనా ఆశ్చర్యంతో పాటు ఒకింత సంతోషం కూడా కలిగించింది. ఇండియా పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం అవసరమా అన్న ప్రశ్న కొందరిని కలవరపెట్టే మరి కొందర్ని ఆలోచింప చేసింది. ఆప్రశ్న ఉద్దేశ్యం ఆర్థికాభివృద్ధి దేశం సాధిస్తున్న తరుణంలో ఈ సంఘర్షణ వల్ల మళ్లీ దేశం వెనుకడుగు వేస్తుందేమో అన్న ఆవేదనను వెలికి తీసింది. రకరకాల అభిప్రాయాలు చర్చలకు ప్రాణం పోసాయి. అర్థవంతంగా తలలు పండినవారు మాట్లాడుకొనే విధానం ఈ కాలం వారు గమనిస్తే బాగా అని కొంతమంది అనుకోకుండా ఉండలేకపోయారు. మొదటి రోజు యుద్ధంలో ప్రభుత్వాలు ఏమి ప్రకటించినా లీక్‌లిచ్చి చెప్పుకున్నా రెండు దేశాల మధ్య పోరు బయటకు రసవత్తంగా జరిగినట్లు వార్తలు వచ్చినా పాకిస్థాన్ సైన్యమే అదను చూసి అయిదారు విమానాలను దెబ్బతీసిందని, ఆ దెబ్బతగిలిన మరుక్షణమే భారతదేశ సైన్యాలు మెరుపువేగంతో డ్రోన్లను యథేచ్ఛగా రంగంలోకి దింపి పి.ఓ.కెలోనూ, పాకిస్థాన్ సరిహద్దులోనూ స్థావరాలను మట్టుపెట్టి ఉగ్రవాదులకు ప్రాణనష్టం కలిగించిందని దాదాపు ఏకాభిప్రాయానికి వేడివాడి చర్చల తర్వాత రావటం గమనార్హం. యుద్ధం అనేది పహల్గాం సంఘటన జరిగిన తర్వాత అనివార్యమనీ మతద్వేషాలను రెచ్చగొట్టే కుట్రతో అమాయకులను పర్యాటకులను మతం పేరుతో ఆడవారి ముందు పొట్టన పెట్టుకోవడం అనమానుషమని, యుద్ధానికి అంతకంటే మరో సహేతుకమైన కారణం ఇంకోటి ఉండబోదు. అంతే కాదు, జాతి గౌరవాన్ని నిలబెట్టుకోవటం అలాంటి ఘటనలు జరిగినప్పుడే అవసరమని ఆపరేషన్ సింధూర్ తలపెట్టకపోతే ఇండియా అంతర్జాతీయంగా బలమైన నాలుగైదు దేశాలలో ఒకటిగా లెక్కింపబడుతున్న ఈ తరుణంలో తలొంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడి ఉండేదని భావించడం జరిగింది. ట్రంప్ నాయకత్వం గుడ్డివాడి చేతిలో రాయిని



మరిపిస్తున్నదని, సమర్థులైన ప్రసిడెంట్లను ప్రపంచానికి అందించిన అమెరికా ట్రంప్ రాకతో నగుబాటు పాలవుతున్నదన్న అభిప్రాయాలు దాదాపు అక్కడున్న అందరి నుంచీ రావటం గమనార్హం. మనం మరిన్ని అధునాతనఆయుధాలు సమకూర్చుకోవాల్సిన సమయం ఆసన్నమయిందని కొన్ని సంవత్సరాల కిందట ఆర్డర్ చేసిన యుద్ధవిమానాలు ఇప్పటికీ అందలేదని బాహాటంగా ఇండియన్ ఎయిర్ చీఫ్ చెప్పటం ప్రస్తావనకు వచ్చినప్పుడు ఇప్పుడున్న పరిస్థితులలో జాప్యం ఎంతమాత్రం తగదని సమావేశంలోని అందరూ అభిప్రాయపడ్డారు. మన సైన్యం ఏ దేశానికీ తీసిపోని విధంగా ఉందని, ఎన్నో విజయాలు దేశానికి అందించిన ఘనత భారత సైన్యానికి ఉందని ఉదాహరణలు ఇచ్చుకుంటూ కొందరు చెప్పటం దేశ సైన్యంపట్ల గౌరవాన్ని పెంచింది. మనదేశంలోని ముస్లిం నాయకులు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో మేము భారతదేశ పౌరులం, మీరు మతాన్ని వెలికి తెచ్చి పహల్గాంలో విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కుట్ర పూరిత చర్యకు పూనుకోవడం అమానుషం అని పాకిస్థాన్‌కు నిర్ద్వంద్వంగా చెప్పటం భారతదేశ లౌకిక విధానానికి అంతర్జాతీయంగా ఎనలేని ప్రతిష్ట తెచ్చిందని చర్చల్లో పాల్గొన్న కొందరు ప్రత్యేకంగా చెప్పటం వింటున్న వారికి వళ్లు గగుర్పొడిచేట్లు చేసింది. మరొక ఆసక్తికరమైన అంశం సమావేశంలో చర్చకు వచ్చినప్పుడు కొంత ఉద్విగ్నత చోటు చేసుకుంది. ఎందుకు అధికారయంత్రాంగం రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నదని ఇంతకు పూర్వం ఒత్తిళ్లు వున్నా అధికారులు సామరస్య ధోరణిలో నాయకుల సందేహాలు రూల్ విధానం చెప్పి తీర్చేవారని అందువల్ల ప్రభుత్వంలోని కొందరు నాయకులు స్వలాభాపేక్షతో తప్పులు చేయడానికి సిద్ధపడినా ప్రభుత్వంలో ఉన్నత స్థానంలో ఉన్ననాయకుడో, నాయకులో నచ్చచెప్పి, ప్రజలకు నష్టం జరగకుండా చూసేవారని, చర్చిస్తున్న వారిలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. అయితే అధికారుల్లో ఎక్కువ మంది జీ హుకుం అనటం చేత, స్వలాభాపేక్షతో ప్రభుత్వంలోని నాయకులు వారితో తప్పులు చేయిస్తున్నారని తాము మాత్రం చట్టానికి దొరకకుండా తప్పుకుంటున్నారని కొందరు గట్టిగానే వాదించారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన రాజకీయ నాయకులు కానీ, అధికారులు కానీ క్రమేపీ ప్రజాభిప్రాయం మేరకు లొసుగులను సరిదిద్దే ప్రయత్నం ఈ మధ్యకాలంలో చేస్తున్నారని ఇది మంచి పరిణామమని కొందరు సర్దిచెప్పటంతో ఆ అంశంపై చర్చకు ఫుల్‌స్టాప్ పడింది. అమెరికన్ ప్రసిడెంట్ ట్రంప్ వల్ల విద్యార్థులకు ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లేవారికి వెళ్లిన వారికి తీరని నష్టం జరుగుతున్నదని, ఇప్పుడు అమెరికాకు వెళ్లి ఆర్థికంగా న్యాయసమ్మతంగా ఎదుగుతున్న యువతకు బ్రేకులు పడుతున్నాయని, అక్కడి పరిస్థితులూ, ట్రంప్‌విధానాల వల్ల యువత వెనక్కు మళ్లుతుందని, అలాని అది ఒక విధంగా దేశానికి లాభదాయకమే అని భావించారు. అయితే ఇతర దేశాలకు మనదేశం నుంచి వెళ్లేవారి సంఖ్య ఈమధ్య పెరుగుతున్నదని అది శుభపరిణామమని కూడాగుర్తించారు. అమెరికాలో ఉన్న వయసు మళ్లిన మన దేశస్థులూ ముఖ్యంగా తెలుగువారు ప్రస్తుతం నానా ఇబ్బందులకు గురవుతున్నారని వెనుక నుయ్యి, ముందు గొయ్యిలా వారి పరిస్థితి ఉందని ఆవేదనతో కొందరు చెప్పటం ఈ అంశంలో మరో కోణాన్ని కూడా చూపించినట్లయింది. ఈ అంశాలే కాదు, మరెన్నో అంశాలు చర్చల్లో చోటు చేసుకున్నాయి. గంభీరంగా చర్చలు సాగినా హాస్యం కూడా సభ్యులు మాటల్లో చిలకరించటంతో సాయంకాలం సమావేశానికి వింత శోభను చేకూర్చినట్లయింది. సీనియర్లు, జూనియర్లను ఏ మాత్రం తీసిపోని విధంగా వయసును లెక్క చేయకుండా డిబేట్లలో ఏమాత్రం తగ్గేదేలే అన్న విధంగా పాల్గొనటంతో వయసు మళ్లినాకుర్రతనం పోగొట్టుకోలేదని ఆనాటి సాయంకాలం రాత్రిగా మారి వెలుగులు విరజిమ్మినప్పుడు తెలిసింది. అనుభవాన్ని అందుకే ఎవరూ కాదనలేరుగా! •

# అధికార లాంఛనాలతో మాజీ సిఎం రూపానీ అంత్యక్రియలు



సోమవారం విజయ్‌రూపాని భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న గుజరాత్ సిఎం భూపేంద్ర పటేల్

**న్యూఢిల్లీ, జూన్16:** గుజరాత్ మాజీ ముఖ్య మంత్రి విజయ్ రూపానీ అంత్యక్రియలు సోమవారం రాజ్‌కోట్‌లో అధికార లాంఛనాలతో జరిగాయి. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహాన్ని డిఎన్ఎ పరీక్షల ద్వారా అధికారులు గుర్తించారు. లండన్ ఉంటున్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళుతుండగా విజయ్ రూపానీ ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. అంతకుముందు రెండుసార్లు మే 19న, జూన్ 5న ఆయన లండన్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. విమానం ఎక్కే ముందు ఎయిర్‌పోర్ట్‌లో రూపానీ ఎంతో ఉత్సాహంగా కనిపించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఇద్దరు బ్రిటిష్ జాతీయులు తీసిన వీడియోలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. జూన్ 12వ తేదీన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం అహ్మదాబాద్ విమానాశ్రయంనుంచి టేకాఫ్ అయిన కొద్ది సేపటికే కుప్పకూలింది. ఈ విమానం సమీపంలోని ఓ మెడికో హాస్టల్‌పై పడటంతో పెను విషాదం చోటుచేసుకుంది. విమానంలో సుదూర ప్రయాణానికి సరిపడా సుమారు 1,25,000 లీటర్ల ఇంధనం ఉండటంతో, కూలిన వెంటనే భారీగా మంటలుచెలరేగాయి. ప్రమాద సమయంలో విమానంలో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది సహా మొత్తం 242 మంది ఉన్నారు. వీరిలో ఒకే ఒక ప్రయాణికుడు స్వల్ప గాయాలతో అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడగా, విజయ్ రూపానీతో సహా 241 మంది దుర్మరణం పాలయ్యారు. కాగా విమానం కూలిన ప్రదేశంలోని మెడికో హాస్టల్‌లో కూడా భారీ ప్రాణనష్టం సంభవించింది. ఇప్పటివరకు 35 మంది వైద్య విద్యార్థులు మరణించగా, మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయ్ రూపానీ అంత్యక్రియలను ఈ రోజు రాజ్‌కోట్‌లో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించినట్లు అధికారులు చెప్పారు. ఆయన జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు సంతాపదినంగా ప్రకటించింది. ఈ అంత్యక్రియలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు హాజరయ్యారు.

# బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు



## ఆరుగురు మృతి, 9 మందికి గాయాలు

**లక్నో, జూన్ 16:** ఉత్తరప్రదేశ్‌లోని బాణాసంచా కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో తొమ్మిది మంది మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరందరినీ హుటాహుటిన దగ్గరలోని ఆస్పత్రులకు తరలించారు. అటార్సి గ్రామంలోని టపాసుల తయారీ కేంద్రంలో ఈ పేలుడు సంభవించింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి అత్యవసర సేవలైన అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టంకోసం తరలించారు. ఈ ఘటనపై రాజబ్‌పూర్ పోలీసు స్టేషన్ అధికారిమాట్లాడుతూ..'సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు అటార్సిలోని లైసెన్స్ పొందిన బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు, అంబులెన్స్, అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మహిళా కార్మికులు చనిపోయారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం అస్పత్రికి తరలించాం. మృతదేహాలకు పోస్టు మార్టం జరుగుతోంది. పేలుడు వెనుకగల కారణాన్ని దర్యాప్తుచేస్తున్నాం' అని వెల్లడించారు.



# 'జనగణన'కు నోటిఫికేషన్ జారీ

**న్యూఢిల్లీ, జూన్ 16:** దేశంలో 15 యేళ్ల తర్వాత చేపట్టబోయే జన గణనకు సంబంధించిన కేంద్ర హోమ్‌మంత్రిత్వ శాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కింపు ప్రక్రియ సోమవారం నుంచే అధికారికంగా ప్రారంభమైనట్లయింది. మొత్తంగా రెండు దశల్లో జనాభాను లెక్కించనున్నారు. 2027 మార్చి 1వ తేదీ నాటికి జనగణన పూర్తి కానుంది. మంచు ఎక్కువగా ఉండే 'కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూకాశ్మీర్, లడ్డాఖ్‌తోపాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబరు 1 అర్ధరాత్రి వరకు జన గణనను నమోదు చేయనున్నాం. ఇవి కాకుండా దేశవ్యాప్తంగా మిగతా ప్రాంతాలన్నింటిలో 2027 మార్చి 1 నాటికి జనాభా లెక్కను పూర్తి చేయనున్నాం' అని హోమ్‌మంత్రిత్వ శాఖ ఆ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఇది మొత్తంగా 16వ, స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన.

ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యూప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదు చేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోమ్ శాఖ వెల్లడించింది. సమాచార సేకరణ, బదలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు తెలిపింది.

సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని చేపట్టారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ, కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలోనే జనగణనతోపాటు కుల గణన చేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్ పెరగడం, కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు పూర్తి చేయడంతో కుల గణనకూ కేంద్రం సిద్ధమైంది. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించియ 30కి పైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

# అహ్మదాబాద్ దుర్ఘటనలో మ్యూజిక్ ఆల్బమ్స్ దర్శకుడు అదృశ్యం

## మహేష్ జీరావాల మరణించి ఉంటాడని భావిస్తున్న పోలీసులు

## డిఎన్ఎ పరీక్షలకు రక్త నమూనాలు ఇచ్చిన కుటుంబ సభ్యులు



**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఈ నెల 12వ తేదీన జరిగిన విమాన దుర్ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపడం తెలిసిందే. ఈ దుర్ఘటనలో విమాన ప్రయాణీకులతో పాటు సిబ్బంది, విమానం కూలిన ప్రాంతంలోని మెడికల్ కాలేజికి చెందిన వైద్యులు, అక్కడి సిబ్బంది కూడా మరణించడం విదితమే. ఇదే సమయంలో ఆ మార్గంలో ప్రయాణించిన కొందరి ఆచూకీ ఇప్పుడు తెలియరావడం లేదు. గుజరాత్‌లో పేరున్న మ్యూజిక్ అల్బమ్స్ దర్శకుడు మహేష్ జీరావాల అలియాస్ మహేష్ కలావాడియా (55) కూడా ఇలా కనిపించకుండా పోయిన వారిలో వున్నారు. విమాన దుర్ఘటన జరిగిన రోజున మధ్యాహ్నం 12 గంటల వేళ జీరావాల కారులో ఇదే ప్రాంతంలోని లా గార్డెన్‌లో తన మిత్రుడు ఒకరిని కలిసేందుకు వెళ్లారు. 1.14 గంటల సమయంలో ఆయన తన భార్య హీతల్‌కు ఫోన్ చేసి మీటింగ్ అయిపోయింది, నేను ఇంటికి బయలు దేరాను, వచ్చేస్తున్నాను అని చెప్పాడు. అయితే అరగంట తరువాత కూడా ఇంటికి రాకపోవడంతో తాను కంగారుపడి తన భర్త జీరావాలకు 1.41 గంటలకు ఫోన్ చేయగా స్విచాఫ్‌గా వచ్చిందని హీతల్ తెలిపారు. అంతకు కొన్ని నిమిషాల ముందే ఇదే ప్రాంతంలో విమాన దుర్ఘటన జరగడం, 275 మందికిపైగా ప్రయాణీకులతో పాటు మెడికల్ కాలేజి విద్యార్థులు, సిబ్బంది మరణించిన విషయం తనకు తెలిసిందని హీతల్ తెలిపారు. దీనిపై తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు తన భర్త ఫోన్ చివరి లొకేషన్‌ను పరిశీలించగా విమాన దుర్ఘటనకు 700 మీటర్ల దూరంలో వుందని ఆమె వెల్లడించారు. ఈ దుర్ఘటనలో తన భర్త కూడా మరణించి వుంటాడని ఆమె విలపిస్తున్నారు.

సాధారణంగా తన భర్త ఆ మార్గంలో ఎప్పుడు ప్రయాణం సాగించడని, ఆ రోజున ఎందుకు వచ్చాడో తెలియడం లేదని హీతల్ తెలిపారు. కాగా విమాన దుర్ఘటనలో మరణించిన వారి భౌతిక కాయాలను గుర్తించేందుకు డిఎన్ఎ పరీక్షలు కొనసాగుతుండడంతో జీరావాల కుటుంబీకులు కూడా డిఎన్ఎ పరీక్షలనిమిత్తం రక్త నమూనాలను ఇచ్చారు. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు కేవలం 60మృతదేహాలను మాత్రమే గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో వెయ్యి డిగ్రీల ఉష్ణోగ్రత జనించడంతో ప్రయాణీకులతో పాటు మెడికల్ కాలేజి విద్యార్థులు ఇతరుల శరీరాలు గుర్తు పట్టేందుకు వీల్లేకుండా కాలిపోయాయి. ఇందులో అనేక మృతదేహాలకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించడం కూడా కష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. జీరావాలకు భార్య హీతల్‌తో పాటు ఒక కుమార్తె, కుమారుడు వున్నారు. పలు మ్యూజిక్ అల్బమ్స్‌తో అతను గుజరాత్ సినీ ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. దీంతో పాటు బాలీవుడ్‌లోనూ పలు చిత్రాలకు పనిచేశాడు.

# పహల్గాంలో మళ్లీ పర్యాటక ప్రాంతాలు కళకళ



**జమ్మూకశ్మీర్, జూన్16:** పహల్గామ్ ఉగ్రవాద దాడి యావత్ భారత్‌ను ఉలిక్కిపడేలా చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22న పహల్గామ్ సమీపంలోని బైసరన్ గడ్డి మైదానంలో ఆహ్లాదంగా గడుపుతున్న పర్యాటకులపై టెర్రరిస్టులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఆ ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. కేవలం పురుషులే లక్ష్యంగా చేసుకుని జరిపిన ఈ ఉన్మాదంతో ఎంతో మంది మహిళలు తమ పసుపు కుంకుమలకు దూరమయ్యారు. అయితే ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌పేరుతో ఉగ్రవాద స్థావరాలపై మెరుపుదాడులు చేసి ఉగ్రవాదులను చావుదెబ్బ కొట్టింది.

ఇదిలా ఉంటే పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత జమ్ముకశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడింది. పహల్గామ్, చుట్టుపక్కల ప్రాంతాలలో పర్యాటకుల రాకపోకలు తగ్గిపోయాయి. అక్కడికి వెళ్లాలంటేనే ప్రజలు అమ్మో అంటూ భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని పర్యాటక ప్రాంతాలను తెరవలేదు. ఉగ్రవాద దాడి కశ్మీర్‌లోయలోని పర్యాటక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. జమ్మూలోని మతపరమైన యాత్రలపై కూడా ప్రభావం చూపింది. తాజాగా, ఈ విషయంపై జమ్మూ, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. మూసి ఉన్న పర్యాటక ప్రదేశాలు తిరిగి తెరచుకోనున్నాయని ఆయన ట్వీట్ చేశారు. భద్రతా పరంగా తీసుకున్న ముందు జాగ్రత్తల కారణంగా తాత్కాలికంగా మూసిన జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని పర్యాటక ప్రదేశాలను జూన్ 17 నుంచి తిరిగి ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో పహల్గామ్ మార్కెట్, వెరినాగ్ గార్డెన్, కోకర్నాగ్, అచాబల్ గార్డెన్, బేతాబ్ వ్యాలీ, పార్కులు ఉన్నాయని వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగాన్ని తిరిగి నిలబెట్టేందుకు వివిధ చర్యలు తీసుకుంటోంది. గత నెలలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పహల్గామ్‌లో క్యాబినెట్ సమావేశానికి హాజరై, బేతాబ్ వ్యాలీ వంటి మూసిఉన్న ప్రాంతాలను సందర్శించారు.

# విమానం పేలిన ప్రదేశం నుంచి నడుచుకుంటూ వచ్చిన రమేశ్!

## మృత్యుంజయుడి మరో విడియో వైరల్



**న్యూఢిల్లీ, జూన్ 16:** అహ్మదాబాద్ విమాన ప్రమాద సమయంలో.. రమేశ్ విశ్వాస్‌కుమార్ మృత్యుంజయుడిగా ప్రాణాలతో బయటపడిన విషయం తెలిసిందే. ఆ విమానంలో ఉన్న 242 మందిలో 241 మంది చనిపోగా, రమేశ్ ఒక్కడే సజీవంగా ఉన్నాడు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే బిజె మెడికల్ కాలేజీపై విమానం కూలిన తర్వాత ఆ ప్రాంతం నుంచి విశ్వాస్‌కుమార్ నడిచి వస్తున్న దృశ్యాలు మొబైల్ ఫోన్లకు చిక్కిన విషయం తెలిసిందే. ఈ నెల 12న జరిగిన ఆ ప్రమాద ఘటనకు చెందిన మరో విడియో ఒకటి వైరల్ అవుతోంది.

కొత్త విడియో చాలా భయానకంగా ఉంది. విమానం కూలగానే భారీగా మంటలు, పొంగ వ్యాపించిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రాంతం నుంచి రమేశ్ ఒక్కడే నడుచుకుంటూ వచ్చాడు. అతని వెనుక భాగం దట్టమైన మంట, పొగలు చిమ్ముతున్నా.. రమేశ్ మాత్రం తన చేతిలో ఫోన్ పట్టుకుని రోడ్డు వైపు నడిచాడు. అయితే సమీపంలో ఉన్న కొందరు వ్యక్తులు.. రమేశ్‌ను సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. రమేశ్ తెలుపురంగు టీషర్టు ధరించినట్లు విడియోలో ఉన్నది. ఎడమ చేతిలో మొబైల్ ఫోన్ పట్టుకుని ఉన్నాడు. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం.. టేకాఫ్ తీసుకున్న 32 సెకన్లకే కుప్పకూలింది. ఎమర్జెన్సీ గేటు సమీపంలోని 11ఎ సీటులో కూర్చున్న రమేశ్ ఒక్కడే ఆ దుర్ఘటనలో ప్రాణాలతో బయట పడ్డాడు. ఎలా తాను బతికానో చెప్పడం కష్టమే అని అతడు మీడియాకు చెప్పాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడిని ప్రధాని మోడీ సహా ఇతరులు పరామర్శించారు.

# విమాన దుర్ఘటనలో 99 మృతదేహాల గుర్తింపు

## కొనసాగుతున్న డిఎన్ఎ పరీక్షలు

**అహ్మదాబాద్, జూన్ 16:** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలో డిఎన్ఎ పరీక్ష ద్వారా ఇప్పటివరకు 99 మృతదేహాలను అధికారులు గుర్తించారు. 64 మంది మృతదేహాలను కుటుంబసభ్యులకు వారు అప్పగించారు. వారంతా ఖేడా, అహ్మదాబాద్, కోట, మహేసానా, భరూచ్, వడోదర, అరవల్లి, ఆనంద్, జునాగఢ్, అమ్రేలి, మహిసాగర్, భావ్‌నగర్‌కు చెందిన వారిగా అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రజనీష్ పటేల్ తెలిపారు. గత వారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లయిట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన సెకన్ల వ్యవధిలోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో దాదాపు 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు అహ్మదాబాద్‌లోని సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



# నిలకడగా సోనియాగాంధీ ఆరోగ్యం

**న్యూఢిల్లీ, జూన్ 16:** కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ఆరోగ్యం మెరుగుపడుతోంది. అనారోగ్య సమస్యలతో ఆదివారం ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరిన సంగతి విదితమే. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలోని గ్యాస్ట్రో విభాగంలో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ అజయ్ స్వరూప్ వెల్లడించారు. ఈ నెల 9న సోనియా ఇదే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొన్ని రోజుల క్రితం సిమ్లా పర్యటనలో ఉన్న ఆమెకు రక్తపోటు ఎక్కువ కావడంతో అక్కడ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న సంగతి తెలిసిందే.

# అమెరికాలో కాల్పులు, ముగ్గురు మృతి

**వాషింగ్టన్, జూన్16:** అగ్రరాజ్యం అమెరికాలో మరోమారు ఉన్మాదుల తుపాకుల తూటాలకు అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తాజాగా, ఉటా రాష్ట్రంలో జరిగిన ఓ పండుగలో చెలరేగిన కాల్పుల భీభత్సం, పసికందుతో సహా ముగ్గురిని బలిగొంది. ఈ దారుణ ఘటనతో యావత్ అమెరికా ఉలిక్కి పడింది, తుపాకీ సంస్కృతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే, ఉటా రాష్ట్రంలోని వెస్ట్ వ్యాలీ సిటీలో గల సెంటెనియల్ పార్క్‌లో 'వెస్ట్‌ఫెస్ట్' పేరిట జరుగుతున్న వార్షిక కార్నివాల్ ఆనందోత్సాహాల మధ్య ఈ విషాదం చోటుచేసుకుంది. కార్నివాల్ రైడ్‌ల సమీపంలో ఈ ఘాతుకం జరిగినట్లు తెలుస్తోంది. వెస్ట్ వ్యాలీ సిటీ పోలీసులు ఈ ఘటనను ధృవీకరిస్తూ, తమ అధికారిక ఎక్స్ ఖాతాద్వారా ప్రాథమిక సమాచారాన్ని వెల్లడించారు. 'సెంటెనియల్ పార్క్‌లో జరుగు తున్న వెస్ట్‌ఫెస్ట్‌లో కాల్పులుజరిగాయి. పలువురు బాధితులు ఉన్నారు'. అని పోలీసులు తమ పోస్టులో పేర్కొన్నారు. ఈ అమానుష కాల్పుల్లో 8నెలల పసికందు ఎజ్రా పంతలి యోన్స్, 20 ఏళ్ల పాల్ తాహి, 21 ఏళ్ల ఏంజె లికా చావెజ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగాగాయపడ్డారు. వైద్య బృందాలు ఘటనాస్థలికి చేరుకుని వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరికి ప్రాణాపాయం లేదని వైద్యులుతెలిపారు.

సమాచారం అందు కున్న వెంటనే అత్యవసర సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను హుటా హుటిన సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెస్ట్‌వ్యాలీ సిటీ పోలీసులు ఈ ఘటనపై కేసునమోదుచేసి, దర్యాప్తును ముమ్మరంచేశారు. ప్రాథమిక సమా చారం ప్రకారం, రెండు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణ కాల్పులకు దారి తీసి ఉండవచ్చని, ఇది ప్రతీకారచర్యగా జరిగిన గ్యాంగ్ సంబంధిత దాడిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

# ప్రపంచంలో బడులకు వెళ్లని పిల్లలు 27.2 కోట్లు

## యునెస్కో జిఇఎం తాజా నివేదిక

**న్యూఢిల్లీ, జూన్ 16:** ప్రపంచవ్యాప్తంగా పాఠశాలకు వెళ్లని పిల్లల సంఖ్య ప్రస్తుతం దాదాపు 27.2 కోట్లుగా ఉందని ఐక్యరాజ్య సమితికి చెందిన యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ టీమ్ (జిఇఎం) తాజా నివేదిక పేర్కొంది. ఇది గత అంచనాల కంటే 2.1 కోట్లు ఎక్కువ అని తెలిపింది. ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లల్లో 11 శాతం మంది (7.8 కోట్లు), లోయర్ సెకండరీ స్కూల్ వయస్సు కౌమారదశ పిల్లల్లో 15 శాతం మంది (6.4 కోట్లు), అప్పర్ సెకండరీ స్కూల్ వయస్సు వాళ్లలో 31 శాతం మంది (13 కోట్లు) పాఠశాలకు దూరంగా ఉన్నారని వెల్లడించింది. పాఠశాలలకు వెళ్లని పిల్లల పెరుగుదలకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని పేర్కొంది. 80 లక్షల మంది (38 శాతం) పెరుగుదలకు కొత్త ఎన్‌రోల్‌మెంట్, అటెండెన్స్ డేటా లేకపోవడం కారణమని పేర్కొంది. 2021లో అఫ్ఘానిస్థాన్‌లో సెకండరీ విద్యలో చేరే విద్యార్థినులపై విధించిన నిషేధం కూడా ఇందుకు దోహదం చేసిందని వెల్లడించింది. మరోవైపు అప్‌డేట్ చేసిన యుఎన్ జనాభా అంచనాల కారణంగా మరో 1.3 కోట్ల మంది (మిగతా 62 శాతం) పెరిగారని, ఇది మరొక కారణమని తెలిపింది.

# ప్రయాణికుల భద్రతే ప్రధానం

## 'మ్యాన్ ఆఫ్ ది మంత్' అవార్డుల ప్రదానోత్సవంలో రైల్వే జిఎం జైన్ ఉద్ఘాటన



రైల్వే జిఎం జైన్‌చే మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డును అందుకుంటున్న సిబ్బంది

**గుంతకల్లు రైల్వే, జూన్ 16,ప్రభాతవార్త:** వర్షాకాలం సీజన్ ప్రారంభం అయినందున రైలు ప్రయాణికుల భద్రతకు,రక్షణలకై ప్రతి రైల్వే ఉద్యోగి నిబద్ధత,చిత్తశుద్ధిలతో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఉద్ఘాటించారు. సోమవారం రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయం నుంచి భద్రతపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జీఎం నీరజ్ అగర్వాల్ ప్రిన్సిపల్ సిఎస్ఒ కె. వెంకటరమణారెడ్డిలతో కలిసి జోన్‌లో జరుగుతున్న రైల్వే పనితీరును సమీక్షించారు. ప్రయాణికుల భద్రతా నిమిత్తం అన్ని ప్రధాన రైల్వే స్టేషన్‌లలో మార్గదర్శకాలు అందించేందుకు అవసరాలకు సరిపడా సిబ్బందిని నియమించుకోవాలని ఆయన సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ ఏడాది మే మాసంలో జోన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేసిన సికింద్రాబాద్ డివిజన్‌లో ముగ్గురికి, విజయవాడ డివిజన్‌లో ముగ్గురికి,గుంటూరు డివిజన్‌లో ఇద్దరికి, హైదరాబాద్ డివిజన్‌లో ఒకరికి కలిపి జోన్ వ్యాప్తంగా మొత్తం 9మంది రైల్వే సిబ్బందికి జీఎం జైన్ మే మాసపు మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డులను ప్రధానం చేశారు. విపత్కర పరిస్థితులను నివారించడంలో విధి నిర్వహణ పట్ల అప్రమత్తత,అంకితభావంతో పనిచేసిన వారికి ఈ అవార్డులను అందచేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె వెంకటరమణారెడ్డి,జోన్‌కు చెందిన ఆయా కీలక విభాగాలకు చెందిన ప్రధాన అధికారులతో పాటు గుంతకల్లుసహా వివిధ డివిజన్లకుచెందిన డిఆర్ఎంలు, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు,సీనియర్ సబార్డినేట్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త



# అందరికీ ఆరోగ్యం యోగాతో సాధ్యం...

## - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్







**మొగల్తూరు/ నరసాపురం: ప్రభాతవార్త :** యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగంగా మారితే సంపూర్ణ ఆరోగ్యం మన సొంతం అవుతుందని, ప్రతి ఆసనం ఆరోగ్యప్రదాయిని అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమం పేరిట సోమవారం మొగల్తూరు మండలం పేరుపాలెం/కేపీ పాలెం సముద్ర తీరాన సాయంకాల సంధ్యా సమయంలో జిల్లా రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగఅభ్యసన కార్యక్రమంలో పట్టణ ప్రజలు, విద్యార్థి, విద్యార్థులు, అన్ని శాఖల అధికారులతో ఇంటర్నేషనల్ యోగ టీచర్ టి.శిరీష, యోగా మాస్టర్ ట్రైనర్లు యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో యోగాసనాలపై అవగాహన, శిక్షణ ఇవ్వడం జరిగింది జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, నరసాపురం ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హాజరై యోగాసనాలు వేసి అందరిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. దేశ ప్రధాని పిలుపు మేరకు, మన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సూచనలతో యోగాసనాలను ఉత్సాహంగా నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుందన్నారు. ప్రతి ఆసనం ఆరోగ్యప్రదాయని అని, బిపి షుగర్, కిడ్నీ, కీళ్ల వాపులు వంటి అనేక వ్యాధులకు ఆసనాల ద్వారా స్వస్తి పలకవచ్చు అన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, డివిజన్, జిల్లాలోని 4,835 ప్రాంతాలలో గత 20 రోజులుగా యోగ అభ్యసన కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా ఆసనాలు వేయడం ద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. మానసిక సమతుల్యత లేని సమాజాన్ని యోగా సరి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఉద్యోగాలు, పనులలో ఒత్తిడికి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మానసిక ఒత్తిడి నుంచి ప్రజలను యోగా విముక్తి కల్పిస్తుందన్నారు. నాణ్యమైన జీవితం యోగాతోనే సాధ్యమన్నారు. నాచురోపతి యోగా జీవితంలో ఒక భాగం కావాలన్నారు. యోగాసనాలతో కలిగే ప్రయోజనాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఎలాంటి ఖర్చు, మందులు లేకుండా రోగాలు నివారించడం యోగాతోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ యోగాని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని, జిల్లా యంత్రాంగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని కోరారు. నరసాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నరసాపురం పేరుపాలెం బీచ్ లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం చాలా సంతోషించదగిన విషయం అన్నారు. నెలరోజుల పాటు యోగేంద్ర కార్యక్రమాన్ని నిర్వహించుకోవడానికి ప్రధానమంత్రి పిలుపుమేరకు, మన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆలోచనలతో రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గత నెల 27వ తేదీన వశిష్ట గోదావరి వలందల రేవు నందు ఎంతో గొప్పగా యోగ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగిందన్నారు. సుదీర్ఘ తీర ప్రాంతంలో నేడు యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుని అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని కోరారు. నేడు గడుపుతున్న యాంత్రిక జీవితంలో ప్రతి ఒక్కరికి యోగా ఎంతో అవసరం అని తెలిపారు. యోగ ఈ నెల రోజులే కాకుండా నిరంతరాయంగా సాధన చేసి ఆరోగ్యానికి పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు అడిషనల్ ఎస్పి వి.భీమారావు, ఆర్డిఓ దాసిరాజు, డి.ఎస్.పి డాక్టర్ శ్రీ వేద, ఇంటర్నేషనల్ యోగ టీచర్ టి.శిరీష, ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ ఏ హరి శ్రీనివాస్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీరామ్, మాస్టర్ ట్రైనర్లు పి రోహిణి, యు. వెంకట రామరాజు, అనంతలక్ష్మి, స్థానిక నాయకులు పోత్తూరు రామరాజు, పేరుపాలెం, కేపీ పాలెం సర్పంచులు తిరుమాని విజయలక్ష్మి, అందే వెంకటలక్ష్మి, తహసిల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వర్ణాంధ్ర, వై ఎన్ కాలేజ్, సూర్య కాలేజీల విద్యార్థులు, గౌతమి, వివేక పాఠశాలల విద్యార్థులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యే భవిష్యత్‌కి దిశదశ

## - కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ

**భీమవరం( ఉండి )జూన్ 16 ప్రభాతావార్త:** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతోందని దేశంలోని అత్యుత్తమ సర్వీసుల్లో ఉన్న ఉద్యోగుల్లో చాలామంది ఇలాంటి పాఠశాలల నుండి వచ్చినవారే అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఉండి మండలం కోలమూరు గ్రామంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయని శ్రీమతి దుర్గ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ సమయంలో తీసుకొచ్చిన జీవో ప్రభావంతో కోలమూరు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 90 నుండి 10కి తగ్గిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ పాఠశాల పూర్వవైభవాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, పార్లమెంట్ జిల్లా పార్టీ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి తదితరులు తన దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు . పాఠశాలను ఆదర్శ



పాఠశాలగా గుర్తించేందుకు కనీసం 45 మంది విద్యార్థులు అవసరమన్న నిబంధనను నెరవేర్చేందుకు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు చేసిన కృషి అభినందనీయమన్నారు. విద్యావంతులైన ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు కలిగి ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు విశ్వాసంతో ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నర్సాపురం పార్లమెంటు కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు మాట్లాడుతూ, గ్రామంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి తాను రూ.5,000 చొప్పున ప్రోత్సాహకాన్ని అందించేందుకు సిద్ధమని తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మరో ఇద్దరు దాతలు ముందుకు వచ్చారని తెలిపారు.

# నేడు కొల్లేరులో పర్యటించనున్న సుప్రీం సాధికారిత కమిటీ

## ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి..

కైకలూరు , జూన్, 16(ప్రభాతవార్త): కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించేందు ఈనెల 17,18 తేదీల్లో జిల్లాలో సుప్రీంకోర్ట్ నియమించిన సాధికారిత కమిటీ పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం సాధికారిత కమిటీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా మండవల్లి మండలం మణుగునూరు, పులపర్రు, కైకలూరు మండలం ఆటపాక, ఆలపాడు, కొల్లేటికోట ప్రాంతాలలో కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించారు. వీరితో పాటు కైకలూరు శాసన సభ్యులు డా. కామినేని శ్రీనివాసరావు, ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు , పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కొల్లేరుకు సంబంధించి సుప్రీం సాధికారిత కమిటీ ఈనెల 17,18 తేదీల్లో కొల్లేరులోని కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. మానవీయత కోణంలో కొల్లేరులో ఎన్ని నివాసిత ప్రాంతాలు ఉన్నాయి, జిరాయితీ భూములు, డి.ఫారం పట్టా భూములు ఏమున్నాయి, 2006 సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఎలా అమలు చేశారనే సంబంధిత 4 అంశాలను కమిటీ పరిశీలించనున్నదన్నారు. దీనికి సంబంధించి మంగళ, బుధ



వారాల్లో సాధికారిత కమిటీ పర్యటించే ప్రాంతాల ప్లాన్ ను తయారు చేసేందుకు ఈరోజు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. రెండు రోజుల పర్యటన అనంతరం బుధవారం ఏలూరు కలెక్టరేట్ లో కొల్లేరుకు సంబంధించిన వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు మండలంలోని కొల్లేరు వాసులు కూడా తమ సమస్యలను అందజేయవచ్చన్నారు.

# విభిన్న ప్రతిభావంతులు సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవాలి

## - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం జూన్ 16ప్రభాతవార్త :** విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా రూ.2.88 లక్షల విలువగల ల్యాప్ ట్యాప్ లను ఉచితంగా అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన ఎనిమిది మంది ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెగ్యులర్ కోర్స్ లు చదువుతున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.సోమవారం కలెక్టరేట్ లో జరిగినకార్యక్రమం లో కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ దివ్యాంగులకు విద్యా సాంకేతికతను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ద్వారా ల్యాప్ టాప్ లను అందజేయడం జరుగుతుందన్నారు. దీని ద్వారా దివ్యాంగులకు విద్యా, సాంకేతికతను అందుబాటులోకి తేవటం జరుగుతుందన్నారు. ఈ ల్యాప్టాప్ లు వారికి విద్యను అభ్యసించుటలో నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు సమాజంలో మరింత చురుకుగా పాల్గొనుటకు సహాయపడతాయని అన్నారు. సామాజిక సమానత్వ దిశగా దివ్యాంగులు కూడా సమాన అవకాశాలు పొంది తమ జీవితాలను మెరుగుపరుచు కోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతులు దేనిలోనూ తక్కువ కాదని వారి యొక్క ప్రతిభను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని



అన్నారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బాల బాలికలు తప్పనిసరిగా గుర్తింపు కార్డు

**ఏలూరు, జూన్, 16 : ప్రభాతవార్త :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ ఈరోజు స్థానిక శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం ప్రతి బాల బాలికలు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని, అటువంటి గుర్తింపు కార్డు లేని బాలబాలికలను గుర్తించే పనిలో భాగంగా ఈ ప్రభుత్వ వసతి గృహాన్ని సందర్శించడం జరిగిందని, ఈ వసతి గృహంలో గుర్తింపు కార్డు లేని బాలలను గుర్తించి, వారి వివరాలను సేకరించి సంబంధిత అధికారుల ద్వారా గుర్తింపు కార్డు జారీ చేయడం జరుగుతుందని, ప్రస్తుతం ఈ వసతి గృహంలో 9 మంది బాలలకు గుర్తింపు కార్డులు లేవని, కార్డుల జారీకి తగిన చర్యలను త్వరలోనే తీసుకుంటామని తెలియజేశారు. అలాగే వసితి గృహ సిబ్బందితో మాట్లాడుతూ బాలలకు అందించే ఆహారంలో రాజీ పడవద్దని పరిశుభ్రమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు మరియు కార్యక్రమంలో బాలుర వసతి గృహ సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవల్లి తదితరులు



పాల్గొన్నారు.

# నెలాఖరు లోపు ధాన్యం సొమ్ములు చెల్లింపు - ఎమ్మెల్యే పితాని

**ఆచంట, (పెనుమంట్ర) జూన్-16, ప్రభాతవార్త:** నెలాఖరు లోపు ధాన్యం సొమ్ములు రైతులు ఖాతాల్లోకి జమా కానున్నాయని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆచంట మండలం పెనుమంచిలి, శేషమ్మ చెరువు గ్రామాల్లో పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో భాగంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ కూటమి రాకతో రాష్ట్రంలో రౌడీ పాలనకు స్వస్తి పలికి సంక్షేమ పాలన సాగిస్తున్నామని అన్నారు. ప్రజలకు జవాబు దారితనంగా పనిచేస్తూ ప్రజల ముందుకు ధైర్యంగా వచ్చి గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్నామని ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ ఏడాది పంట దిగుబడి అధికంగా ఉండడంతో కొంతమేర రైతులకు సొమ్ములు చెల్లింపులో జాప్యం జరిగిందని ఈ సమస్యను అధిగమించి నెలాఖరులోపు మిగిలిన రైతులకు సొమ్ములు చెల్లిస్తామని ఎమ్మెల్యే పితాని అన్నారు. త్వరలో రైతులకు భరోసా కింద నిధులు విడుదల చేయడానికి ఏర్పాటు చేశామని అన్నారు. గత ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని పంట కాలువలలో చెత్తతూడు కూడా తొలగించలేదని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంట కాలువల ప్రక్షాళన కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని అన్నారు. అర్హత ఉంటే చాలు కుల మత భేదాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వైసిపి నేతలు వెన్నుపోటు కార్యక్రమం నిర్వహించడాన్ని ఎమ్మెల్యే పితాని ఎద్దేవా చేశారు. ఒకపక్క తల్లికి మరోపక్క చెల్లికి ఆస్తి పంపకాల్లో వెన్నుపోటు పొడిచి ప్రజల ముందుకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెన్నుపోటు కార్యక్రమం నిర్వహించడం విడ్డూరంగా ఉందని అన్నారు. తల్లికి వందనం ద్వారా ఆచంట మండలంలో 8 కోట్ల 44 లక్షలు తల్లుల ఖాతాల్లో జం చేసామని ఇంకా ఎవరైనా రాకపోతే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.



ఈ కార్యక్రమంలో సర్పంచ్ గణేశుల శేషవేణి, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాసు, సిద్ధాంతం డిసి చైర్మన్ తమ్మినీడి ప్రసాద్, మార్టేరు డిసి చైర్మన్ జక్కంశెట్టి సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు చిలుకూరి సీతారాం, మాజీ అధ్యక్షుడు కేతమీరయ్య, మండల జనసేన అధ్యక్షుడు జవ్వాది బాలాజీ శ్రీనివాసు,బిజెపి మండల అధ్యక్షులు నేదునూరి శ్రీను బాబు,ఎంపీడీవో కృష్ణమోహన్ డిప్యూటీ తహసిల్దార్ సోమేశ్వరరావు వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేద ప్రాణానికి.....

## నిండైన హృదయంతో చంద్రన్న సాయం





**నరసాపురం.. ప్రభాతవార్త :** గతంలో నిరుపేదకు మధ్యతరగతి సగటు కుటుంబానికి చెందిన వ్యక్తికి తగని రోగం వస్తే అందుకు లక్షలు లక్షలు కావలసి వస్తే ఆ వ్యక్తి ఆయుష్షు అర్థంతరంగా ముగిసేది. కానీ ఇప్పటి ప్రభుత్వాలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద తగని రోగానికి అందిస్తున్న సాయం లక్షల మీదే ఉంటుంది. తద్వారా ఆ వ్యక్తులు కూడా తిరిగి ఆరోగ్యం పొంది కుటుంబాన్ని పోషించుకోగలుగుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మధ్యతరగతి మనిషికి అందిస్తున్న సాయం ఇవాళ కోట్ల మీదే వస్తుంది. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)తో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని మాజీ శాసనమండలి చైర్మన్, అడ్వైజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మైనార్టీ అఫైర్స్) సభ్యులు ఎంఎ .షరీఫ్ ,నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. పచ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో మహ్మద్ సయ్యద్ అహ్మద్ కు మంజూరైన 7లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఆదివారం అందించారు ఈ సందర్భంగా షరీఫ్ , రామరాజు, మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెక్కును అందుకున్న లబ్దిదారుడు వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి గారికి,కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, టీడీపీ నాయకురాలు షేక్ యూనిస్ బేగం, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ.మౌలాలి ఖాన్ నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు, ముస్లిం మత పెద్దలు అలీ భాయ్, తదితరులు పాల్గొన్నారు

# ఈనెల 21 న యోగాడేకు విశాఖ రానున్న ప్రధాని మోదీ

## గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆరిమిల్లి రాధాకృష్ణ

**తణుకు, జూన్ 16 ( ప్రభాత వార్త) :** ఈనెల 21న విశాఖపట్టణంలో నిర్వహించనున్న యోగా దినోత్సవం కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యే విధంగా ప్రతిఒక్కరు సహకరించాలని తణుకు ఎమ్మెల్యే, గాజువాక%-%2 నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం గాజువాక కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో 2015లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించగా తర్వాతి కాలంలో ఐక్యరాజ్య సమితి కూడా యోగా దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించినట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా ఈనెల 21న 11వ పర్యాయం ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్టణం వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సహకారంతో నిర్వహించడానికి అన్ని సన్నాహాలు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్న ఈ యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజలోల యోగా పట్ల అవగాహన కల్పించి యోగాను ప్రతి ఒక్కరు తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకుని తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రాచీనమైన యోగాను ప్రజల్లో భాగస్వామ్యం చేసే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి సమాజంలో ఆరోగ్యకవాతావరణం తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఈనెల 21న యోగా కార్యక్రమంలో



పాల్గొనేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీ పాకా ను మర్యాదపూర్వకంగా కలిసిన

## కైకలూరు గౌడ సంఘం

కైకలూరు జూన్ 16 (ప్రభాతవార్త) : ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం స్వీకారం చేసిన పాకా సత్యనారాయణ ను సోమవారం భీమవరం పట్టణంలోని ఆయన నివాసం వద్ద రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు ఆధ్వర్యంలో కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఎంపికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఎంపీ ని కలిసినవారిలో రాష్ట్ర నాయకులు పరసా ఏడుకొండలు, కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు, చేబ్రోలు శ్రీనివాస్,బొర్రా సత్యనారాయణ, మారగాని గణపతి, దాసరి శ్రీనివాస్,కట్టా అంజయ్య,వీరంకి



సత్యనారాయణ, నితిన్ సామ్రాట్, అనగాని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# పండిత విల్లూరుకు త్రాగునీరు అందించాలి

పోడూరు,(పెనుమంట్ర) జూన్-16, ప్రభాతవార్త: మండలంలోని పండిత విల్లూరు గ్రామ ప్రజలకు స్వచమైన త్రాగు నీరు అందించాలని సీపీఎం పార్టీ మండల నాయకులు పిల్లి ప్రసాద్, శాఖ కార్యదర్శి కాటూరి యాకోబు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ కార్యదర్శి తాగునీటి సమస్యపై వినతిపత్రం అందించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ అనేక సంత్సరాలు రాల నుంచి త్రాగు నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రాపంచాయితీ వారు ఇచ్చే త్రాగు బురదలుగా ఉంటున్నాయని అన్నారు. అవి త్రాగితే రోగాల బారినపడతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ప్రతి రోజు రోజుకి రెండు టిన్నులు నీరు, టీన్ను రూ.10/-, పెట్టీ కొనుకుంటున్నారని అన్నారు. పరిశుభ్ర మైన త్రాగు నీరు పండిత విల్లూరు ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో



కేతా వేంకటనరసింహ మూర్తి మల్లుల కొండమ్మ, జక్కంశెట్టి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసి చేయించుకోవాలి

### ఏవో గంగాధర్

జీలుగుమిల్లి, జూన్-16, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పథకం పొందాలంటే రైతులు తప్పనిసరి రైతు సేవ మండల వ్యవసాయ అధికారి కె గంగాధర్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ అవకాశం లేదని, తప్పనిసరి రైతులు రైతు సేవ కేంద్రం జాబితా రైతు సేవా కేంద్రాల వద్ద ఉన్నదని తెలిపారు. ఈ సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. కావున రైతులు



రైతులకు బాసటగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ కేంద్రాల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. సోమవారం దర్భ గూడెం రైతు సేవ పథకం లబ్ధి పొందాలంటే ఓటిపి ద్వారా నమోదు చేసే వద్ద ఈకేవైసీ వేయాలని అన్నారు. అర్హత ఉన్న రైతుల కే వై సి వేలు ముద్ర వేసిన రైతులకు మాత్రమే అన్నదాత సంబంధించిన రైతు సేవా కేంద్రాల వద్ద అర్హత ఉన్న రైతుల జాబితా పరిశీలించుకొని ఈ కే వై సి చేయించుకోవాలనీ రైతులకు సూచించారు.

# ప్రభుత్వ భూములు భూమిలేని పేదలకు పంచాలి

ఆగిరిపల్లి, జూన్ 16:-ప్రభాతవార్త :కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, మండలంలో అన్యాక్రాంతమైన అసైన్డ్, సీలింగు, ప్రభుత్వ పోరంబోకు, హెచ్ ఓ, పీ డబ్ల్యూ డి, భూములను రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలందరికీ పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండలం తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ముందుగా ఆగిరిపల్లి ప్రజా సంఘాల(సుందరయ్య) కార్యాలయం నుండి ర్యాలీగా హై స్కూల్ సెంటర్ మీదగా తాసిల్దార్ కార్యాలయం చేరుకోవడం జరిగింది. ర్యాలీలో పేదల భూములు పేదలకే పంచాలి, ప్రభుత్వ భూములు రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకోవాలి, భూమిలేని పేదలందరికీ భూమి పంచాలినే నినాదాలు చేశారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది.

## లక్కవరంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ


జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త: జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కూటమి నాయకుల సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం రోజే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో 9 రకాల వస్తువులతో కిట్లు పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. అదే విధంగా సన్న బియ్యంతో మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు అందించడంతో విద్యార్థుల తల్లిదండ్రులలో మరింత ఆనందం కనిపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు



పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చిర్రిని కలిసిన శాప్ డైరెక్టర్ జగదీశ్వరి

జీలుగుమిల్లి, జూన్-16, ప్రభాతవార్త: మండలంలోని బర్రింకలపాడులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజును శాప్ డైరెక్టర్ కొవ్వాసి జగదీశ్వరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు పుష్ప గుచ్ఛం అందజేసిన కొవ్వాసి జగదీశ్వరి దంపతులు శాలువాతో ఆయన్ని సత్కరించారు. శాప్‌టస్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఆంధ్రప్రదేశ్‌ఊలో డైరక్టర్ స్థానం పోలవరం నియోజకవర్గ వాని కి దక్కడం సంతోషంగా ఉ ందన్నారు. అనంతరం శాప్ డైరెక్టర్ కొవ్వాసి జగదీశ్వరిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేసారు.



## పాలకొల్లు ఏరియా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ యర్రా మాధురి

పాలకొల్లు జూన్-16, ప్రభాతవార్త: పాలకొల్లు ఏరియా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ యర్రా మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించే విషయంలో పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ని ఆదర్శంగా దిద్దుతామని తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు సూచించిన విధంగా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు. సిబ్బంది పాల్గొన్నారు



# జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం



ప్రభాతవార్త నరసాపురం : ప్రభాతవార్త నరసాపురం నియోజకవర్గం వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన, ప్రభుత్వ వైఫల్యాలపై పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పార్టీ కార్యాలయంలో సోమవారం పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ దూప్ అని పెద్ద చీటింగ్ అని ప్రజలు గుర్తించారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా చంద్రబాబు మోసం బయటపడింది అన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని వెనక కూసిన చాలా ధాన్యాన్ని ఏ రోజు వరకు కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. కాలువ వదిలారు తప్ప మరమ్మత్తులు కనీసం 25% కూడా చేయలేకపోయారన్నారు. హామీ ఇచ్చిన ఏ సంక్షేమాన్ని చంద్రబాబు నిజాయితీగా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర నాయకులు పీడీ రాజు మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె వెంకట్ రమణ కావలి నాని జాన్ కెనడి పోలిశెట్టి గోపీనాథ్ బర్రె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో వైద్యానికి సాయం.....

పాలకొల్లు జూన్ 16, ప్రభాతవార్త :రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేద మధ్యతరగతి వర్గాల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పెద్ద ఎత్తున సాయం అందిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో ఆయన కార్యాలయంలో పాలకొల్లు నియోజకవర్గం లో పేద వర్గాలకు వైద్య ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిగా 92 మందికి 68 లక్షల చెక్కులను కూటమి నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాడు జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశాడన్నారు.. పేదలకు వైద్య సాయం అందించలేక మానవత్వాన్ని మరిచిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. నేడు చంద్రబాబు అధికారంలోకి రాగానే మానవత్వంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని



పునరుద్ధరించారన్నారు. కూటమి ప్రభుత్వ 11 నెలల పాలనలో 50 వేల 235 మందికి సుమారు 349 కోట్లు వైద్య సాయం అందించడం జరిగిందని ఒక్క పాలకొల్లు నియోజకవర్గంలోనే నాలుగు కోట్లకు పైగా వైద్యశాయిం అందించినట్లు మంత్రి రామానాయుడు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చుట్టాయి

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం పట్టణం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర హైస్కూల్)నందు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఇతర వక్తలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి తల్లి బ్యాంకు ఖాతాలోకి ఒక్కొక్కరికి 13000 చొప్పున ఎంతమంది ఉంటే అంతమందికి నగదు జమ అయినందున పాఠశాలలో చిన్నారులు, ముఖ్యమంత్రికి,ఉప ముఖ్యమంత్రికి,విద్యాశాఖ మంత్రి లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు.



## సర్పంచ్ ని పరామర్శించిన మాజీ మంత్రి.



అత్తిలి - జూన్ 16 ( ప్రభాత వార్త ):ఇటీవల అస్వస్థత కు గురై రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందిన అత్తిలి గ్రామ సర్పంచ్ గంటా విజేత ని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరామర్శించారు. అత్తిలి లోని సర్పంచ్ గృహానికి వెళ్లి పరామర్శించారు. కారుమూరి తో పాటు మండల్ వైసీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ కోసం బయోమెట్రిక్ వెయ్యండి

### మండల వ్యవసాయ అధికారి శివశంకర్



చాట్రాయి, జూన్ 16, ప్రభాతవార్త : అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులందరూ రైతు సేవా కేంద్రాలలో బయోమెట్రిక్ వేయాలని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ చెప్పారు. గ్రామాలలో ఉన్న రైతు సేవ కేంద్రాల్లో వి ఏ ఏ / విహెచ్ఎ ల ద్వారా ప్రతి ఒక్కరూ ఇక వేసి చేయించుకోవాలని ఆయన చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేలు, కేంద్ర ప్రభుత్వం 2000 లబ్దారులు ఖాతాలో ఈనెల 20న జమ అవుతాయని అని చెప్పారు. చాట్రాయి, జనార్ధన వరం, ఆరుగొలను పేట, రైతు సేవా కేంద్రాలలో బయోమెట్రిక్ జరుగుతున్న విధానాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాల్సిందిగాని ఆయన కోరారు. అంతేకాకుండా ప్రతి ఒక కౌలు రైతు కౌలు కార్డును పొందాలని దీని గురించి కూడా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

### సైబర్ మోసాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి, ఆచంట ఎస్ఐ కట్టా వెంకటరమణ



ఆచంట, (పెనుమంట్ర) జూన్-16, ప్రభాతవార్త: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆచంట ఎస్ఐ కట్టా వెంకటరమణ అన్నారు. ఆచంట మండలం పెనుమంచిలి గ్రామంలో పల్లె పల్లెకు పితాని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో అందరికీ తల్లి కి వందనం డబ్బులు పడటం అభినందనీయం అన్నారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ లు అడిగితే చెప్పవద్దు అన్నారు. సైబర్ మోసాలు గురి కావద్దని ఆయన అన్నారు. బ్యాంకు వెళ్లి మీ అమౌంట్ లు చెక్ చేసుకోవాలన్నారు. బ్యాంక్ అధికారులు ఎవరూ ఫోన్ చేయరని అన్నారు. అలాగే మైనర్లకు 18 సంవత్సరాలు లోపు వాళ్ళకి బైక్ ఇస్తే రూ. 10000 నుండి రూ. 20.00 వేల వరకు పెనాల్టీ పడుతుందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ఆయన అన్నారు. ప్రమాదాల బారిన పడుకోకుండా చూసుకోవాలన్నారు.

## కుళాయి చెరువులోకి కాలువ ద్వారా నీటి విడుదల



నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం పట్టణంలో ఉన్న కుళాయి చెరువులోకి కాలువ ద్వారా ప్రారంభించిన ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ గారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చెరువులోకి నీళ్లు రావడంతో స్థానిక ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గారు %-% "పట్టణంలోని నీటి నిల్వల అభివృద్ధి, భూగర్భ జలాల పునరుత్తానానికి ఇది కీలకమైన చర్య. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా నీటి ప్రాజెక్టులపై దృష్టి సారించిందని" తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, కోటిపల్లి సురేష్, తోట అరుణ, అంబటి అరుణ, చిన్నాయమ్మ, బొమ్మిడి కృష్ణమూర్తి, సోమరాజు భవానీ, పోలిశెట్టి సాంబ, పిల్ల శ్రీహరి, కెల్లా సత్తిబాబు, సింహాద్రి, ఇతర జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### జంగారెడ్డి గూడెంలో సీసీ కెమెరా వ్యవస్థ ప్రారంభించిన జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లో ఆధునిక సీసీ కెమెరాల వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు.

## జర్నలిస్టు గంగాధర్‌ను పరామర్శించిన బిజెపి నేత సీతారామాంజనేయ చౌదరి

భీమవరం జూన్ 16ప్రభాతవార్త :భీమవరం పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చలువాది గంగాధర్ ను బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన) పరామర్శించారు. బుధవారం గంగాధర్ తండ్రి చలువాది విజయశ్రీ కాళిదాస్ రాజయోగేంద్ర మరణించడంతో, విషయం తెలుసుకున్న గారపాటి చౌదరి గంగాధర్ నివాసానికి వెళ్లి, కాళిదాస్ చిత్రపటానికి పుష్పమాలవేసి నివాళి అర్పించారు. గంగాధర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉ ండాలని, కుటుంబానికి అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తామని గారపాటి చౌదరి అన్నారు.



## పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలి

ఏలూరు ప్రభాతవార్త : పిజిఆర్ఎస్ లో అందిన అర్జీలను నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ వారి తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ అర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు కె.భాస్కర్, దేవకిదేవి, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన దరఖాస్తులకు



నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. నిబంధనల మేర ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను స్పష్టంగా ధరఖాస్తుదారుడికి తెలియజేయాలన్నారు.

# కాళ్ళలో సోలార్ వీధిలైట్లు ప్రారంభం

కాళ్ళ జూన్ 16(ప్రభాతవార్త) :గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం 'వెర్సాక్' సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కాళ్ల లో 'వెర్సాక్' సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ. 3. 50లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ లైట్స్ లను సంస్థ రీజనల్ బిజినెస్ మేనేజర్ ఎం.వి.వి. సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీకి వెళ్లాలంటే వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తమ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు గాదిరాజు కిరణ్ కుమార్ వర్మ,



నారిన శ్రీనివాసరావు, వర్రే శివ లు తెలపడంతో సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు 50 లైట్లు ఏర్పాటు చేశామన్నారు.

## మండల బిజెపి కన్వీనర్ గా సంగా రంగారావు.

ఆగిరిపల్లి జూన్ 16 ప్రభాతవార్త. :ఆగిరిపల్లి మండలం బిజెపి కన్వీనర్ గా సంగా రంగారావు, కో. కన్వీనర్ గా మొగదాటి వెంకటేశ్వరరావు లు నియమితులయ్యారు. ఆదివారం రాత్రి అగిరిపల్లిలో మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పార్టీ పరిశీలకులు మాటూరి రవికాంత్, శివరాజు వసుంధరదేవి, మాగంటి వాసు లు హాజరయ్యారు.ప్రస్తుత మండల కమిటీ కాల పరిమితి ముగియటంతో నూతన మండల పార్టీ కమిటీ ఏర్పాటు కావాలిసివుంది. అయితే నూతన కమిటీ నియామకానికి గ్రామ స్థాయిలో బూత్ కమిటీల నిర్మాణం జరగాలి. సంబంధిత బూత్ కమిటీల నిర్మాణ పర్యవేక్షణకు పార్టీ నాయకులు సంగా రంగారావు కన్వీనర్ గా, మొగదాటి వెంకటేశ్వరరావును కో -కన్వీనర్ గా పార్టీ సీనియర్ నాయకులు జి. ఆర్. కె. రంగారావు ప్రతిపాదించగా సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.



# నేడు పల్లె పల్లెకు మన పితాని"

పెనుమంట్ర, జూన్-16, ప్రభాతవార్త: మండలంలోని నేడు పల్లె "పల్లెకు మన పితాని" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ క్యాంప్ కార్యాలయం సోమవారం తెలిపింది. కార్యాలయం లో భాగంగా మండలంలో జుత్తిగ గ్రామంలో 09:00 గంటల నుండి 11:00 గంటల వరకు మండల స్థాయి అధికారుల బృందం మరియు ప్రజలతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొనున్నారు. 11:00 గంటల నుండి 12:00 గంటల వరకు గొలుగూరి సూర్యనారాయణ రెడ్డి (గుడి శీను) ఇంటి వద్ద జరిగు కూటమి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం" కార్యక్రమానికి హాజరుకానున్నారు. పోలమూరు గ్రామంలో 12:30 నిమిషాలకు సిపిఎం ఆఫీస్ దగ్గరలో 63 కెవి ట్రాన్స్ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనున్నారు. వెలగల వారి పాలెం గ్రామంలో 04:00 గంటల నుండి 06:00 గంటల వరకు జరిగు "పల్లె పల్లెకు..మన పితాని" కార్యక్రమంలో భాగంగా పంచాయతీ దగ్గరలో మండల స్థాయి అధికారుల బృందం మరియు ప్రజలతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొనున్నారు. వెలగలవారిపాలెం గ్రామంలో 06:00 గంటల నుండి 07:00 గంటల వరకు వెలగల బుల్లి రామరెడ్డి ఇంటి వద్ద జరుగు కూటమి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం" కార్యక్రమానికి హాజరుకానున్నారు. కావున తెలుగుదేశం,జనసేన,బిజెపి మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొవాలని క్యాంప్ కార్యాలయం తెలిపింది.



## విమాన ప్రమాద మృతులకు సంతాపం

తణుకు, జూన్ 16(ప్రభాత వార్త): అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ), ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) ఆధ్వర్యంలో సోమవారం నివాళులు అర్పించారు. తణుకులోని వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో ఈ మేరకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, యు.మురళి, ఏవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లిమిల్లి వంశీ, కమిటి సభ్యులు చిలుకూరి



అరవింద్ , చెట్టే సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మోసం, అబద్ధాలకు కేరాఫ్ ఏడాది కూటమి పాలన

### మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ధ్వజం

తణుకు, జూన్ 16(ప్రభాత వార్త): కూటమి ఏడాది పాలన మోసం, అబద్ధం, దాడులు, మర్డర్లు, మానభంగాలు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. జగన్ ఐదేళ్ల పాలన నమ్మకానికి ప్రతీకగా నిలిస్తే, కూటమి ఏడాది పాలనలో చంద్రబాబు అంటే మోసం అనే విధంగా సాగిందని స్పష్టం చేశారు. 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం కూటమి ఏడాది పాలన నిర్వాకంపై ముద్రించిన 'జగన్ నమ్మకం చంద్రబాబు మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలన చంద్రబాబు సృష్టించిన



నరమేధాన్ని, రక్తపుటేరులు సాగించిన వైనాన్ని పుస్తకంలో కళ్లకు కట్టినట్లుగా చూపించారని అన్నారు.

## జగన్ ఐదేళ్ల పాలనలో నాపై 25 అక్రమ కేసులు బనాయింపు..

పాలకొల్లు ప్రభాతవార్త: విజయవాడ ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు సోమవారం మంత్రి రామానాయుడు హాజరయ్యారు. మళ్లీ ఈ నెల 23వ తేదీకి వాయిదా వేశారు. 2019 ఆగస్టులో వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించిన ఆశ వర్కర్లకు న్యాయ పరంగా అండగా నిలిచిన మంత్రి రామానాయుడు తో పాటు పలువురు పార్టీ శ్రేణులు పైన నాడు అక్రమ కేసులు నమోదైన విషయం తెలిసిందే. అప్పటినుంచి గత ఐదేళ్లుగా విజయవాడ ప్రత్యేక కోర్టుకు హాజరవుతున్నారు.



# 'అఖండ2: తాండవం' నేటి నుంచే ఆర్‌ఎఫ్‌సిలో షూటింగ్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ అఖండ2: తాండవం కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. ఈ హైఆక్టేన్ సీక్వెల్ కథ, స్కేల్, నిర్మాణం, సాంకేతిక నైపుణ్యం.. ప్రతి అంశంలో అఖండను మించి ఉంటుందని హామీ ఇస్తోంది. ప్రతి ష్టాత్మకమైన 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట అత్యం త భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు. ఇటీవలే జార్జియాలోని గ్రాండ్ లోకేషన్స్‌లో కీలకమైన యాక్షన్ సీన్స్‌ని షూట్ చేశారు. నేటి నుంచి ఆర్‌ఎఫ్‌సీలో అఖండ2 కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణతో పాటు యూనిట్ అంతా పాల్గొంటున్నారు. సినిమాలోని చాలా కీలకమైన సన్నివేశాలని చిత్రీకరించనున్నారు. బాలకృష్ణ పుట్టినరోజుకు సందర్భంగా రిలీజ్ చేసిన టీజర్‌కు నేషనల్ వైడ్‌గా సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చింది. రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో టీజర్ అదరగొట్టింది. టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తుంది. డైనమిక్ ఆది పినిశెట్టి ఇంటెన్స్ పాత్రని పోషిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. సంగీత సంచలనం ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సి రాంప్రసాద్ డీవోపీగా పని చేస్తున్నారు. ఎడిటర్ తమ్మిరాజు. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. దసరా కానుకగా సెప్టెంబర్ 25న అఖండ2 పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. నటీనటులు: గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంట, బ్యానర్: 14 రీల్స్ ప్లస్ సమర్పణ: ఎం తేజస్విని నందమూరి, సంగీతం: థమన్ ఎస్, డీవోపీ: రాంప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కోటి పరుచూరి ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు ఫైట్స్: రామ్ లక్ష్మణ్, పీఆర్వో: వంశీ. శేఖర్.



# 'కుబేర' ప్రి రిలీజ్ ఈవెంట్

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారాగణంతో కుబేర ఇండియన్ సినిమాలో గేమ్‌ఛేంజర్‌గా నిలవబోతోంది. ఇప్పటికే విడుదలైన కుబేర ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. పోయిరా మామ, ట్రాన్స్ ఆఫ్ కుబేర, పీపీ డమ్‌డమ్ సాంగ్స్ చార్ట్ బస్టర్ రెస్పాన్స్‌తో మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసిఎల్‌ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. కుబేర తెలుగు,తమిళం,హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రాజమౌళి కుబేర ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రాండ్‌గా జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. శేఖర్ కమ్ముల చాలా సాఫ్ట్‌గా హంబుల్‌గా ఉంటారు. ఆయనను చూసిన వెంటనే మనకి అలానే అనిపిస్తుంది. కానీ ఆయన చాలా దృఢ నిశ్చయం కలిగిన మనిషి. తను నమ్మిన సిద్ధాంతానికి ఏది అడ్డు వచ్చినా ఒక్క ఇంచ్ కూడా పక్కకు జరగరు. ఆ క్వాలిటీని నేను చాలా ఎడ్మైర్ చేస్తాను. శేఖర్ ఆయన నమ్మిన సిద్ధాంతాల మీద సినిమాలు తీస్తారు. నేను నమ్మిన సిద్ధాంతాలకి నేను చేసే సినిమాలకి సంబంధం ఉండదు. మేము కంప్లీట్ అపోజిట్ పోల్స్. ఆయన అంటే నాకు అపారమైన గౌరవం. ఆయన ఇండస్ట్రీకి వచ్చి 25 సంవత్సరాల అయిందంటే నాకు నమ్మబుద్ధి కావడం లేదు.




ఆయన నాకు జూనియర్ అనుకున్నాను కానీ నాకంటే వన్ ఇయర్ సీనియర్ తను. ఈ 25 సంవత్సరాల్లో అలాగే ఉన్నాడు. తను నమ్మిన సిద్ధాంతాలతోనే సినిమాలు తీశాడు. ఆయన అలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. నాగార్జున, శేఖర్ కమ్ముల, టైటిల్ కుబేర.. ఈ అనౌన్స్మెంట్ వచ్చిన వెంటనే ఫెంటాస్టిక్‌గా అనిపించింది. ధనుష్ కూడా ఇందులో ఉన్నారని తెలిసిన తర్వాత అద్భుతమైన కాంబినేషన్ అనిపించింది. ట్రాన్స్ ఆఫ్ కుబేర రిలీజ్ అయిన తర్వాత మైండ్ బ్లోయింగ్ అనిపించింది. ఒక రిచ్ ప్రపంచంలో నాగార్జున, పూర్ ప్రపంచంలో ధనుష్.. సినిమా కథ గురించి ఏమి చెప్పకుండా ఈ రెండు క్యారెక్టర్స్‌ని చూపించడం చాలా ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది. శేఖర్ కమ్ముల తన సినిమాని ట్రైలర్‌లోనే చెప్పేస్తారు. కానీ కుబేర విషయానికి వస్తే నాకు ఒక సస్పెన్స్ సినిమా లాగా అనిపిస్తుంది.

# 'మిస్టీరియస్' టైటిల్ పోస్టర్ లాంచ్

మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన మిస్టీరియస్ తెలుగు సస్పెన్స్ థ్రిల్లర్, రోహిత్ సహాని (బిగ్ బాస్ ఫేమ్), అబిద్ భూషణ్ (నాగభూషణం మనవడు), రియాకపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో త్వరలో విడుదలకు సిద్ధమవుతుంది. ఆష్లీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా మరియు శివాని నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. ఫైనల్‌మిక్సింగ్ జరుగుతుంది, ఆడియో లాంచ్ త్వరలో షెడ్యూల్ చేయబడుతుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌత్ ఇండియా లెవెల్లో చేస్తున్నఈ సినిమా సౌత్‌లో ఉన్న అన్ని భాషలలో చేస్తున్న సినిమా చాలాబాగుంది. పోస్టర్‌సినిమా కూడా బాగుంటుంది అని ఆశిస్తున్నాను. మిస్టీరియస్ టీంకి శుభాకాంక్షలు తెలియజేశారు. దర్శకుడు మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ, మిస్టీరియస్ చిత్రం ప్రతి పాత్ర అనుమానాస్పదంగా ఉండేలా సస్పెన్స్ మిస్టరీతో ప్రేక్షకులను కట్టిపడేసేలా నిర్మించాము. చిత్రకథ మరియు స్క్రీన్ ప్లే సునిశితంగా రూపొందించిన ఈ చిత్రం క్రమ క్రమంగా క్లూలను బహిర్గతం చేస్తూ ప్రేక్షకులను చివరి వరకు ఉత్సాహంగా ఉంచుతుంది. ఈ చిత్రం షాకింగ్ ట్విస్ట్‌లు కథను కొత్త ఎత్తులకు తీసుకెల్లి వీక్షకులను రంజింప చేస్తుంది, యాక్షన్స్, థ్రిల్లింగ్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ వచ్చేవిధంగా ఉంటాయి అని వివరించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డికి థాంక్స్ మా టైటిల్ పోస్టర్ లాంచ్ చేయటం. చిత్రాన్ని ఉన్నతవిలువలతో రూపొందించడానికి అన్ని విధాలుగా సహకారం అందించిన నిర్మాతను ఆయన అభినందించారు.




# నేడు 'మై లవ్' టైటిల్ ఆవిష్కరణ

ఐటీ ఇండస్ట్రీస్ మినిస్టర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా మినిస్టర్ క్వార్టర్స్ బంజారాహిల్స్‌లో మంగళవారం మై లవ్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ రంగరంగా వైభావంగా జరిగింది, ఈ సందర్భంగా ఐటీ ఇండస్ట్రీస్ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మొదటగా సంజోష్ తగరంకి అభినందనలు ఎన్నో ఏళ్ళు కష్టపడి సిని పరిశ్రమలో ఉండి జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ సంస్థ స్థాపించి ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో వందలాది సినీ కళాకారులకు టెక్నీషియన్స్ సేవరంగల వారికీ అవార్డ్స్ ఇచ్చి వారి ప్రతిభను వెలుగులోకి తీసుకు వచ్చి విజయవంతం అయ్యారు, ఆలా అంచలంచలుగా ఎదుగుతూ ఇప్పుడు జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ప్రొడక్షన్స్‌లో సినిమా చెయ్యడం నిజంగా అభినందనీయం, నా సమర్పణలో జరుగుతున్న ఈ మై లవ్ సినిమాకి జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ప్రొడక్షన్స్ వారికీ డైరెక్టర్ సంజోష్ తగరంకి మరియు ఈ సినిమా నిర్మాతలకి ప్రభుత్వం తరుపున, నా తరుపున అన్ని విధాలుగా అండగా



ఉంటానని తెలియజేశారు. జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ ఫౌండర్ చైర్మన్ సంజోష్ తగరం మాట్లాడుతూ, మాకు మొదటి నుండి అన్ని విధాలుగా ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తున్న మా ఐటీ ఇండస్ట్రీస్ మినిస్టర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు, నేను దర్శకత్వం వహిస్తున్న నా మొదటి సినిమా టైటిల్ ఆవిష్కరణ ఐటీ ఇండస్ట్రీస్ మినిస్టర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా జరగడం మా మొదటి విజయం, ఈ సినిమా అన్నారు.

# 'రాజా సాబ్' టీజర్

రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ రాజా సాబ్. ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. రాజా సాబ్ సినిమా డిసెంబర్ 5న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. హైదరాబాద్‌లో ఈ చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌ను అభిమానులు, మూవీ లవర్స్ కేరింతల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ మాట్లాడుతూ, రాజా సాబ్ సినిమా కోసం మూడున్నరేళ్లుగా పనిచేస్తున్నాం. ఇదొక వండర్ ఫుల్ ఎక్సిపీరియన్స్. ఇప్పటికీ ఈ మూవీ కోసం డిజైన్స్ చేస్తున్నాం. మీరు రాజా సాబ్ హావేలీని, సినిమాకు చేసిన ఇతర ఆర్ట్ వర్క్‌ను ఇష్టపడతారు అన్నారు సినిమాటోగ్రాఫర్ కార్తీక్ పళని మాట్లాడుతూ, ఇలాంటి పెద్ద వేదిక మీద మాట్లాడటం నాకు ఇదే ఫస్ట్ టైమ్. రాజా సాబ్ సినిమాకు ఎంజాయ్ చేస్తూ వర్క్ చేశాం. ప్రభాస్‌తో నేను చేస్తున్న రెండో చిత్రమిది. ఆయన గురించి మీ అందరికీ తెలుసు. రాజా సాబ్ సినిమాకు పనిచేయడం గొప్ప అనుభూతిని కలిగించింది అన్నారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ, రాజా సాబ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కృతి బర్త్ డే. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. రాజా సాబ్ సినిమా టీజర్ చూశాక నిర్మాత విశ్వప్రసాద్ విజన్ ఏంటో మీ అందరికీ తెలిసి ఉంటుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పేరు ఎప్పటికీ గుర్తుండేలా రాజా సాబ్ సినిమా ఉంటుంది. దర్శకుడు మారుతి ప్రతిభ ఒక స్నేహితుడిగా నాకు తెలుసు. మారుతి వాళ్ల నాన్నగారు మచిలీపట్నం సిరి కాంప్లెక్స్ థియేటర్ దగ్గర అరటిపళ్లు అమ్మేవారు. అప్పుడే మారుతి ఒక కలగన్నాడు. ఏదో ఒకరోజు తన బ్యానర్ కూడా ఆ థియేటర్ దగ్గర పెడతారని నమ్మాడు.






నభా నటేష్ నయా లుక్

# 'ఆంధ్రా కింగ్ తాలూకా' టాకీ పార్ట్ షూటింగ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని యూనిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్రా కింగ్ తాలూకా. మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఈ మూవీలో పవర్ ఫుల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన సూపర్ స్టార్ సూర్య కుమార్ అనే పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో రామ్, ఉపేంద్ర పాల్గొంటున్నారు. కీలక టాకీ పార్ట్ షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర కాంబినేషన్‌లో వచ్చే ఈ సీన్స్ సినిమాలో మేజర్ హైలెట్‌గా ఉండబోతున్నాయి. ఈ సినిమాలో రామ్ ఇప్పటివరకు చేయని ఒక యూనిక్ క్యారెక్టర్‌ని చేస్తున్నారు. ఇటీవలే రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. దర్శకుడు మహేష్ బాబు పి ఈ సినిమా కోసం యూనిక్ కథని రాశారు. ఈ సినిమా ఆడియన్స్‌కి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందించబోతోంది. ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్స్ కథానాయికగా నటిస్తోంది. అద్భుతమైన తారాగణం, ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా భారీ అంచనాలని పెంచుతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సిద్ధార్థ నూని, మ్యూజిక్ వివేక్–మర్విన్. జాతీయ అవార్డు విజేత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా. తారాగణం: రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళి శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, జుగిజు గణేష్ తదితరులు. సాంకేతిక సిబ్బంది: కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మహేష్ బాబు పి. నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, ప్రొడక్షన్ హౌస్: మైత్రీ మూవీ మేకర్స్. సిఇఒ: చెర్రీ, సంగీతం: వివేక్ మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్.



# ద్విభాషా చిత్రంలో అమ్ము అభిరామి!

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ రఫ్ నోట్ ప్రొడక్షన్ నిర్మాణంలో, ప్రముఖ దర్శకుడు మరియు సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తమిళతెలుగు ద్విభాషా చిత్రంలో ఇప్పటికే పలువురు తారలు ఈ చిత్రంలో ముఖ్యపాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. రాజ్ తరుణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రేమిస్తే భరత్, సునీల్, పాలడబ్బా తదితరులు ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఇప్పుడు వీరి జాబితాలో ప్రముఖ తమిళ నటి అమ్ము అభిరామ్ చేరారు. తమిళ చిత్రలు రాట్సా నన్, అసురన్ చిత్రంలో ఈ ఈమె తన అభినయంతో మంచి పేరు తెచ్చుకున్నారు. గోలీసోడా ఫ్రాంఛైజీగా ప్రముఖ దర్శకుడు, కెమెరామెన్ ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తన దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నాడు. గతంలో విజయ్ మిల్టన్ దర్శకత్వంలో వచ్చిన గోలీసోడా వెబ్ సీరిస్‌లో కూడా అమ్ము అభిరామి మంచి పాత్రను చేశారు. ఇది ఈ ఇద్దరి కలయికలో రెండో చిత్రం. ఈ చిత్రంలో అమ్ము అభిరామి పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా, ఎమోషనల్‌గా కూడా ఉంటుందని, ఆమె అభినయం, పాత్ర చిత్రానికి ప్లస్ అవుతుందని, ఆమెలోని పలు కొత్తకోణాలు ఈ చిత్రంలో ఆవిష్కరించబోతున్నామని అంటున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్.



# 'విజనరీ స్టూడియోస్ ప్రొడక్షన్ నంబర్ 2 షురూ'

కలర్ ఫోటో, రైటర్ పద్మభూషణ్, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ వంటి హిట్లతో హీరో సుహాస్ తనదైన ముద్ర వేశారు. ఆయన కొత్త చిత్రానికి డెబ్యు డైరెక్టర్ గోపి అచ్చర దర్శకత్వం వహిస్తున్నారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 2గా బి నరేంద్ర రెడ్డి నిర్మించనున్న ఈ చిత్రం ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో కూడిన అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్. రైటర్ పద్మభూషణ్‌తో ప్రశంసలు అందుకున్న షణ్ముక ప్రశాంత్ ఈ చిత్రానికి కథను అందించారు. ఈ చిత్రం ఈరోజు పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో దర్శకుడు నాగ్ అశ్విన్, హీరో సత్యదేవ్ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ముహూర్తం షాట్‌కు సత్యదేవ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. వంశీ నంది పాటి ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. సుహాస్ ఈ చిత్రంలో హిలేరియస్ క్యారెక్టర్ పోషించనున్నారు. గతంలో ఆయనతో కలిసి నటించిన అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్ ఫేం శివాని నగరం ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. నరేష్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ కూడా ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మహిరెడ్డి పండుగుల సినిమా టోగ్రఫర్‌గా, విప్లవ్ నైషదం ఎడిటర్‌గా, ఎ రామ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. రమణ రెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ నెల నుంచి ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుంది. తారాగణం: సుహాస్, శివాని నగరం, నరేష్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, దర్శకత్వం: గోపీ అచ్చర, నిర్మాత: బి నరేంద్ర రెడ్డి, బ్యానర్: త్రిశూల్ విజనరీ స్టూడియోస్, డీవోపీ: మహి రెడ్డి పండుగల, ఎడిటర్: విప్లవ్ నిషాదం, ఆర్ట్ డైరెక్టర్: ఎ రామ్ కుమార్.



# గడువు తేదీ చూస్తున్నారా?



మార్కెట్లో ఏ వస్తువు కొన్నా.. దానిపై తయారీ తేదీ, గడువు తేదీలు కచ్చితంగా రాసుంటాయి. అవి ఎప్పుడు తయారయ్యాయి? ఎంతకాలం వరకు వినియోగించడానికి సురక్షితం? అనే విషయాల్ని ఇవి తెలియజేస్తాయి. అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్/ యూజ్ బై అని కూడా కొన్నిటి మీద రాసుంటుంది. చాలామంది ఇది, గడువు తేదీ ఒకటేనేమో అని పొరబడుతుంటారు. కానీ ఈ రెండింటికీ స్వల్ప వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు. లేబుల్‌ని సునిశితంగా పరిశీలిస్తే ఆ తేడాను ఇట్టే పసి గట్టేయచ్చంటున్నారు. మరి, అదేంటో తెలుసుకుందాం..

**రెండాంటి మధ్య తేదా ఏంటంటే...** మార్కెట్లో కొనే ఉత్పత్తులపై తయారీ, గడువు తేదీలు ఉంటాయన్న విషయం తెలిసిందే! అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్‌ని కూడా ఆయా సంస్థలు లేబుల్‌పై పేర్కొంటాయి. కానీ ఇది, గడువు తేదీ ఒకటేనేమోనని అనుకుంటారు కొందరు. అయితే ఈ రెండింటి మధ్య స్వల్ప వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు.

**గడువు తేదీ అంటే...** ఒక ఉత్పత్తిని ఎన్ని రోజుల తర్వాత అస్సలు వాడకూడదో తెలియజేసే కాల పరిమితి. ఆ తర్వాత దాని ప్రభావం తగ్గిపోవడమే కాదు.. అది హానికరం కూడా అని దీని అర్థం.

**అదే షెల్ఫ్ లైఫ్ విషయానికొస్తే..** ఉత్పత్తిని తెరిచిన తర్వాత.. దాని లేబుల్‌పై పొందుపరిచిన నియమ నిబంధనలకు అనుగుణంగా సరైన నాణ్యతా ప్రమాణాలతో దాన్ని నిల్వ చేయడం/భద్రపరచడం చేస్తే అది ఎంత కాలం సురక్షితంగా ఉంటుందని తెలియజేసే సూచిక ఇది. ఉదాహరణకు 12ఎం అని ఉంటే.. దానికి 12 నెలల షెల్ఫ్ లైఫ్ ఉందని అర్థం! సాధారణంగా దీన్ని ఉత్పత్తిపై 'యూజ్ బై' లేదా సెల్ బై అనే పదాలతో సూచిస్తారు.

షెల్ఫ్ లైఫ్ దాటినప్పుడు ఒకవేళ గడువు తేదీ మీరకపోయినా ఆయా ఉత్పత్తుల్ని వాడకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ఆహారం, మందులు, కాస్మెటిక్స్. వంటి ఉత్పత్తుల్ని ఉపయోగించే క్రమంలో ఈ రెండు తేదీల్ని దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమంటున్నారు. తద్వారా ఆహారం, అందంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపచ్చంటున్నారు.

**నిల్వ చేయడమూ ముఖ్యమే!...** అయితే మార్కెట్లో కొన్ని ఉత్పత్తి ఏదైనా సరే.. వాటిపై పేర్కొన్న గడువు, షెల్ఫ్ లైఫ్ తేదీలకు అనుగుణంగా మన్నాలంటే దాన్ని నిల్వ చేసే లేదంటే భద్రపరిచే విషయంలో తగిన జాగ్రత్తలు



తీసుకోవాలంటున్నారు నిపుణులు. లేదంటే వాటి నాణ్యత తగ్గిపోయే ఆస్కారం ఉందంటున్నారు ఇందులోసం ఆయా ఉత్పత్తులపై పేర్కొన్న లేబుల్స్‌ని సునిశితంగా పరిశీలించాలంటున్నారు. ఉదా: ఫ్రిజ్‌లో పెట్టే ఉత్పత్తుల్ని లేబుల్‌పై పేర్కొన్న ఉష్ణోగ్రత వద్ద భద్రపరచడం ముఖ్యం అలాగే ఆహారం, మందుల్ని ఫ్రిజ్‌లో లేదంటే బయట ఉంచినా.. సరైన నిల్వ ప్రమాణాల్ని పాటించాలి. ◻

# సాటి మహిళల్లో స్ఫూర్తి నింపుతూ..



ఎవరెస్ట్ కల ఎంతోమందిని ఊరిస్తుంటుంది. కానీ దీన్ని నెరవేర్చుకోవాలంటే ధైర్యం, పట్టుదల కావాలి. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వాటిని దాటుకుంటూ వెళ్లే సాహసం ప్రదర్శించాలి. 'కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సిఐఎస్ఎఫ్)'లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోన్న గీతా సమోటా ఇలాంటి ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. ఈ దూకుడుతోనే ఇటీవలే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిందామె. తద్వారా 'కేంద్ర పారిశ్రామిక భద్రతా' నుంచి ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించింది. మన ఆత్మవిశ్వాసం ముందు ఎలాంటి శిఖరాలైనా తలవంచాల్సిందే అంటోన్న ఈ డేరింగ్ ఉమన్ స్ఫూర్తి గాథ మీకోసం! రాజస్థాన్ సికర్ చక్ అనే గ్రామంలో పుట్టిపెరిగింది గీత. ఐదుగురు అక్కచెల్లెళ్లలో ఒకరైన ఆమెది సంప్రదాయ కుటుంబం. అయినా ఆటల పట్ల మక్కువ చూపిందామె. కాలేజీలో చదువుతున్న సమయంలోనే హాకీ క్రీడాకారిణిగా రాణించిన గీత. దేశం గర్వించదగ్గ హాకీ ప్లేయర్‌గా పేరు తెచ్చుకోవాలనుకుంది. కానీ అలా జరగలేదు. గాయం కారణంగా ఆటకు పూర్తిగా దూరమవ్వాల్సి వచ్చింది. ఈ సమయంలోనే కేంద్ర సాయుధ బలగాల్లో చేలనుకుందామె. అలా 2011లో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్)' సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన గీత.. ప్రస్తుతం ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్ యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తోంది.

**పర్వతారోహణ అలా పరిచయమైంది!** కేంద్ర సాయుధ దళ సిబ్బంది పలు సాహస కృత్యాల్లో తరచుగా పాల్గొంటారు. వీటివల్ల వారు తమ వృత్తికి సంబంధించిన నైపుణ్యాలు పెంచుకుంటారు. తనకూ సీఐఎస్ఎఫ్లో చేరాకే మౌంటెనీరింగ్ పరిచయమైందంటోంది 35 ఏళ్ల గీత. మా బ్యాచ్ నేనొక్కదాన్నే మహిళను. అలాగని నన్ను నేను ఎప్పుడూ తక్కువ చేసి చూసుకోలేదు. ఏ విషయంలోనూ పరిమితులు విధించుకోలేదు. విధుల్లో చేరాక నా బృందంతో కలిసి చేసిన సాహస కృత్యాల్లో పర్వతారోహణ నన్నెంతో ఆకట్టుకుంది. అందుకే ముందుగా ప్రాథమిక శిక్షణ తీసుకున్నా. ఆపై అడ్వాన్స్ ట్రైనింగ్ తీసుకొని ఇందులో పూర్తి స్థాయి నైపుణ్యాలు పెంచుకున్నా. శిక్షణ పూర్తయ్యాక చిన్న చిన్న పర్వతాల్ని అధిరోహిస్తూ అనుభవం గడించా. ఇక 2019లో ఉత్తరాఖండ్‌లోని 'మౌంట్ సటోపంత్', నేపాల్‌లోని 'మౌంట్ లోబుచే' ని అధిరోహించడంతో నా ఆత్మవిశ్వాసం రెట్టింపయింది.. అంటూ సాగుతున్న గీత.. అడుగడుగునా సవాళ్లు విసిరే ఈ రెండు పర్వతాల్ని అలవోకగా అధిరోహించింది.

**నెరవేరిన ఎవరెస్ట్ కల** అయితే ఎన్ని పర్వతారోహణలు చేసినా.. గత నాలుగేళ్లుగా ఆమె ఎవరెస్ట్ కలగానే మిగిలిపోయింది. అందుకే ఈసారి పూర్తి దృష్టి పెట్టింది గీత. ఈసారి ఎలాగైనా ఎవరెస్ట్ శిఖరాగ్రానికి చేరుకోవాలనుకున్న ఆమె.. అనుకున్నట్లుగానే ఇటీవలే తన కలలను సాకారం చేసుకుంది. ఫలితంగా కేంద్ర పారిశ్రామిక దళాల నుంచి ఎవరెస్ట్‌ను అధిష్టించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించింది. 12. పర్వతారోహణ చేయాలంటే శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా సన్నద్ధమవడమూ ముఖ్యమే! నేను సాధించిన ఈ ఘనతకు దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. ఇందుకు గర్వంగా ఉంది. అయితే నా మౌంటెనీరింగ్ కెరీర్‌లో ఇలాంటి అవార్డులురివార్డులెన్నో సాధించా. కానీ మహిళలకు ఏదైనా సాధ్యమే అని నా ధైర్యసాహసాలతో నిరూపించడం అన్నింటి కంటే సంతృప్తినిస్తోంది. ఆత్మవిశ్వాసం ఉంటే ఎంపిక రంగంలో మనకు తిరుగుండదు.. అంటూ తన మాటలతోనూ సాటి మహిళల్లో స్ఫూర్తి నింపుతున్న ఈ డేరింగ్ ఆఫీసర్.. త్వరలోనే మిగతా మూడు ఎత్తైన పర్వతాలు అధిరోహించి.. అందుకే సెవెన్ సమిట్స్ చాలెంజ్ పూర్తిచేయాలన్న ఆలోచనతో ఉంది. ◻



# వానల్లో పెద్దవాళ్ల కోసం !

ఇంట్లో అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మారుతున్న సీజన్ తగ్గట్లుగా జాగ్రత్తలు తీసుకొంటూ పరిరక్షించాలి. వర్షాకాలంలో వారినెలా సంరక్షించాలో చూద్దాం.



- కాచి చల్లార్చిన లేదా గోరువెచ్చని నీటిని తరచూ తీసుకోవడం అలవాటు చేయాలి. సాధారణ వర్షా కాలంలో నీటి ద్వారా కలరా, టైఫాయిడ్, డయేరియా వంటి అనారోగ్యాలు దరి చేరే ప్రమాదం ఉంది. దీని నిరోధించాలంటే వేడి నీటిని మాత్రమే తాగాలి. స్నానానికి కూడా గోరువెచ్చని నీటిని ఏర్పాటు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు ఉండాలి. రయిన్‌కోటు వంటి ఏర్పాట్లు ఉండేలా జాగ్రత్త పడాలి.
- వ్యాధులెక్కువగా ప్రబలే సీజన్ కావడవంతో వ్యాధినిరోధక శక్తిని పెంచేలా ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు, అతి చల్లదనం. తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు అతి చల్లదనం, తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం, దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఇవ్వాలి. తీపి, నూనె పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఇంటి భోజనానికి పెద్దపీట వేసేలా చూడాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు సహా పీచు ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యతనివ్వాలి. దీంతో జీర్ణశక్తి మెరుగుపడుతుంది. త్వరగా అనారోగ్యాలు దరిచేరవు.
- వీరు విశ్రాంతి తీసుకునే గది, దాని చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉండాలి. గదికి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తపడాలి. లేదంటే వాటిపై దోమలు పెరిగే ప్రాదం ఉంది. గదిలో వెలుతు ఉండేలా చూడాలి. ఇండోర్ ప్లాంట్స్ పెంపకం మంచిది. వీరు నిద్రపోయే గది వెచ్చగా ఉంటే రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. దోమ లెక్కువగా ఉండే ప్రాంతమైతే ఈ సీజన్‌లో కిటికీలకు నెట్ వేయడం మంచిది. లేదంటే దోమకాటు కూడా తీవ్ర అనారోగ్యాలకు దారి తీస్తుంది. ◻

# ఇవి తింటే కంటికి మంచిది !

ఒకప్పుడు వయసు పైబడినవారికి చూపు మందగించేది. ఇప్పుడలా కాదు, పిల్లలకి కూడావచ్చేస్తోంది. మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే. ఆ సమస్యకు కొంతవరకు = పెట్టొచ్చు. ఎ, సి, ఇవిటమిన్లు, ఒమేగా3 అధికంగా ఉన్న పదార్థాలు తరచుగా తింటుంటే కంటిచూపు మెరుగ్గా ఉంటుంది. ఏయే పదార్థాల్లో ఈ విటమిన్లు లభిస్తాయంటే. ఈవిటమిన్, కోడిగుడ్డు, క్యారెట్, గుమ్మడికాయ, లివర్, పాలు, మొదలైనవాటిల్లో ఈ విటమి విస్తారంగా ఉంటుంది. సివిటమిన్ క్యాబేజీ, క్యాలీఫ్లవర్, నిమ్మకాయలు, నారింజపండ్లలో సి విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇవిటమిన్: బాదంపప్పు, పొద్దుతిరుగుడు గింజలు, బఠాణీలలో ఇవిటమిన్ అధికంగా ఉం ఒమేగా3 చేపల్లో ఇది ఎక్కువగా ఉంటుంది. ◻



# అభద్రతా భావం బయటపడాలంటే..

కొంతమంది తమలో సమర్థత ఉన్న తమను తాము తక్కువగా అంచనా వేసుకుని అభద్రతకు లోనవుతారు. ఇలా వివిధ కారణాలతో అభద్రతా భావానికి లోనై మానసిక వేదన పడేవారి సంఖ్య ఇటీవల పెరిగిపోతోందని నిపుణులు చెబుతున్నారు. దీనిని ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఈ మనలోని అభద్రతా భావాన్ని ఎలా గుర్తించాలి? దీన్నుంచి ఎలాబయటపడాలి? తెలుసుకుందాం..

**తక్కువ చేసి చూసుకొని...** ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ప్రత్యేక నైపుణ్యం ఉంటుంది. కానీ కొంతమంది మాత్రమే దానిని సరైన రీతిలో వినియోగించు కుంటారు. అయితే అభద్రతా భావం ఉన్న వారిలో కూడా మంచి నైపుణ్యాలున్నా.. తమను తాము తక్కువగా అంచనా వేసుకుంటారని నిపుణులు చెబుతున్నారు. వారు సరిగా పని చేసినా తరచుగా ఇతరుల అభిప్రాయం కోరుతుంటారు! అవతలి వారి నుంచి సానుకూల స్పందన వస్తేనే సంతృప్తి పడడం.. లేదంటే బాధపడడం జరుగుతుందిట. అయితే వారు ఇలాంటి స్వీయ నమ్మకం పెంపొందించుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

ఇతరులతో పోల్చుకుంటూ.. అభద్రతకు లోనయ్యే వారు ఇతరులతో ఎక్కువగా పోల్చుకుంటారు! వారు సాధించిన విజయాలను సాధించాలని ఆరాటపడడం, వారిపై అసూయ పడడం, ఒకవేళ వాటిని చేరుకోలేకపోతే కుంగిపోవడం అభద్రతకు లోనయ్యే వారిలో కనిపించే ముఖ్య లక్షణాలను నిపుణులు చెబుతున్నారు.



**నిందించడమే పనిగా..!** అభద్రతా భావం ఉన్న వారు తమ సమస్యను పరిష్కరించుకోవడానికి బదులుగా కప్పిపుచ్చుకోవడానికి ఎక్కువగా ప్రయత్నిస్తార! ఈ విధంగా వారి లోపాలకు ఇతరులను బాధ్యులను చేస్తూ వారిని నిందిస్తుంటారు. అయితే వీరు అప్పటికప్పుడు సంతృప్తి పొందినా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. కాబట్టి ఇలాంటి స్వభావం ఉన్న తమ సమస్యను పరిష్కరించుకోవడానికి నిపుణుల సహాయం తీసుకోవడం మంచిది.

**భవిష్యత్తు గురించి ఆందోళన..** అభద్రతాభావం ఉన్నవారిలో భవిష్యత్తు గురించిన ఆదోళనలు అధికంగా ఉంటాయి. ఈ క్రమంలో ప్రతి చిన్న విషయం గురించి ఎక్కువగా ఆలోచిస్తుంటారు. ఇది క్రమంగా ఒత్తిడికి దారి తీస్తుంటుంది. ఆ ఒత్తిడిని ఇతరులపై చూపించడం వల్ల రిలేషన్‌షిప్‌లోనూ సమస్యలు ఎదురువుతాయని చెబుతున్నారు నిపుణులు. ◻

# వీర హనుమ

ఆధ్యాత్మికం



సామర్థ్యం రామభక్త హనుమంతుడికి మాత్రమే ఉందని అందుకు పురికొల్పారు. ఇక మారుతి తన శక్తిని మననం చేసుకుని, వానరులకు ధైర్యం కలిగించేలా మహా రూపం ధరించాడు. ఒక దూత పాటించాల్సిన ఉత్తమ లక్షణాలను సముద్రాన్ని దాటడంలో చూపాడు. అతిథ్యం స్వీకరించమని కోరిన మైనాకుణ్ణి సున్నితంగానే తిరస్కరించి, ఆపై దీవించి సంతృప్తిపరిచాడు. కార్యదక్షతను పరీక్షించడానికి వచ్చిన నాగమాత సురసు యుక్తితో మెప్పించి ఆశీర్వాదం పొందాడు. తన వేగాన్ని నిరోధించబోయిన సింహికను సంహరించాడు. లంకలో అడ్డొచ్చిన లంకినిని దండించి, సీతమ్మ చెంతకు వెళ్లాడు. చూడగానే కంగారు పడక ఆమేనని తేల్చుకుని ధైర్యమిచ్చేలా శుభవచనాలు పలికాడు. శ్రీరాముడి దూతనని పరిచయం చేసుకుని రామయ్య గుర్తులు చెప్పి సీతమ్మ ఆశలకు జీవం పోశాడు. ఆమె వెలిబుచ్చిన సంశయాలకు చాలా వినయంగా 'అమ్మా! ఇటువంటి పనులకు అతి మామూలువారిని పంపిస్తారు. అతి సామాన్యుణ్ణి నేను. సుగ్రీవుడి దగ్గర నాకంటే అధికులు, నాతో సమానులు ఉన్నారే గానీ నాకంటే తక్కువ ఎవరూ లేరు. త్వరలోనే రామలక్ష్మణులు వానరసేన సమేతంగా లంకపై దండెత్తి రావణ సంహారం చేస్తారని సీతమ్మకు భరోసా కలిగించాడు. కార్యసాధనుడు ఎలా ఉండాలో చూపించాడు. రావణాసురుడి పుత్రుణ్ణి, మంత్రి ప్రహస్తుడి కుమారుణ్ణి అడ్డొచ్చిన వారిని సంహరించాడు. చాకచక్యంగా వ్యవహరించి రావణసభకు చేరుకుని లంకేశుడుకి రామ హెచ్చరికలు వినిపించి, రాక్షసుల ఆగడాలను తిప్పికొట్టి మరొక్కసారి సీతమ్మకు అభయం కల్పించాడు. ఆమె ఆశీర్వాదం తీసుకుని ఇవతలి ఒడ్డుకు చేరుకున్నాడు. 'చూశాను సీతమ్మను'.. అనే ఒక్క మాటతో జాంబవ, సుగ్రీవ, అంగద వానర సైన్యానికి ఉత్సాహం కలిగించి, రామలక్ష్మణులకు ఉపశమనం కలిగించాడు. ఇలా సుందరకాండలో అడుగడుగునా వీరత్వం, సమయస్ఫూర్తి, వినయవిధేయుతలు ప్రదర్శించి వినయ విధేయ వీర హనుమగా నిలిచాడు. ◻

# నీటి పరిశుభ్రతకు ..



తాగ దానికి, వంటకు ఉపయోగించే నీళ్ల పరిశుభ్రంగా ఉంటేసగం జబ్బులు రావు. నీటి కాలుష్యాన్ని నివారించడానికి వాటర్ క్యాన్ తెప్పించుకుంటాం కదా! దానికి వాటర్ డిస్పెన్సర్ బిగిస్తే నీళ్ల పరిశుభ్రంగా ఉంటాయి. వంపడం తేలికవు తుంది. పనయ్యాక తీసి ఇంకోదానికి అమర్చవచ్చు. ఇది మేలురకం ప్లాస్టిక్‌తో రూపొందిచ్చారు హానికరం కాదు. దీన్ని శుభ్రపరచ డమూ సులువే. ◻

# ఆరోగ్యానికి 'సూపర్ సిక్స్'

ఆహారం ప్రపంచంలో అత్యున్నతమైనవిగా. సూపర్‌ఫుడ్స్‌కి పేరు. అసలు వీటిని ఎవరు, ఎప్పుడు ప్రచారంలోకి తెచ్చారో తెలియదు కానీ ఈ జాబితాలో చాలానే ఉన్నాయి. అకైబెర్రీ, అవకాడో, కాలే, మాచా వంటివి ఎక్కువగా ఆదరణ పొందుతున్నాయి. వీటిల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు పుష్కలం. అయితే, అదే స్థాయిలో న్యూట్రియంట్లను నింపుకొన్ని దేశీయన సూపర్‌ఫుడ్స్ ఏంటో చూద్దాం.

**సూపర్‌ఫుడ్స్..**, ఈ మధ్యకాలంలో బాగా వినబడుతోన్న పదం. వీటిల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయనీ, దీర్ఘకాలిక వ్యాధుల్ని అదుపులో ఉంచుతాయనీ చెబుతున్నారు. అలాంటి వాటిల్లో ఎక్కువగా విదేశీ రకాలే కనిపిస్తున్నాయి కానీ, వాటికి దేశీయ ప్రత్యామ్నాయాలూ ఉన్నాయంటారు పోషక నిపుణులు.

**అకై బెర్రీ-ఉసరి..** చూడడానికి అచ్చం నల్లనద్రాక్షలా ఉండే అకై బెర్రీ, ఉసిరి రెండు ఒకే రకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉన్న శక్తివంతమైన సూపర్‌ఫుడ్‌లు. విటమిన్ సి నిల్వల్లో అకై బెర్రీని మించిన ప్రయోజకారి ఉసిరి. దీంతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పైగా ఉసిరిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలూ నిండుగా ఉంటాయి. ఇది దీర్ఘకాలిక వ్యాధుల్నే కాదు.. కాలేయ ఆరోగ్యం, అధికబరువుని తగ్గించడంలోనూ కీలకంగా పనిచేస్తుంది.



**మాచా మునగ ...** మాచా అనేది నీడలో పెరిగే లేత తేయాకుని సంప్రదాయ పద్ధతుల్లో చేసే పొడి. తీపి, చేదు, వగరు కలగలిపిన రుచిలో ఉండే దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి సెల్ డ్యామేజీని నిరోధించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలోనూ కీలకంగా పనిచేస్తాయి. దీనికి భారతీయ ప్రత్యామ్నాయాన్ని మునగాకు అందిస్తుంది. ఇందులో కీలక విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లతో పాటు తోణ శక్తినిందించే గుణాలూ ఎక్కువే. అందుకే దీన్ని పోషకాల పవర్‌హౌస్ అని పిలుస్తారు.



**చియా సీడ్స్-సబ్జాగింజలు..** చియా గింజల్నే మెక్సికన్ సీడ్స్ అని కూడా అంటారు. వీటిల్లో ఫైబర్, ఒమేగా-3 సమృద్ధిగా ఉంటాయి. ఒంట్లో వ్యాధినిరోధకతను పెంచుతాయి. ఈ గింజలు జిగురుగా ఉండటం వల్ల వీటినెక్కువగా స్మూతీలు, సాధారణ పుడ్డింగ్‌లను చిక్కబరచడానికి వాడతారు. అయితే వీటి కంటే ఖరీదు తక్కువగా ఉండే సబ్జా గింజల్ని దేశీయ సూపర్‌ఫుడ్‌గా వినియోగించొచ్చని అంటున్నారు నిపుణులు. ఎక్కువ ప్రోటీన్, తక్కువ కెలోరీలు ఉన్న ఇవి ఒంట్లో వేడిని నియంత్రించడంతోపాటు అవసరమైన శక్తినీ ఇస్తాయి. ఈ గింజల్లో ఐరన్ ఫైబర్ పుష్కలంగా ఉండి జీర్ణవ్యవస్థ పనితీరునీ మెరుగుపరుస్తాయి.



**పాలకూర ...** కాలే సూపర్ ఫుడ్ మాత్రమే కాదు. వంటకాలకు ప్రత్యేక రుచినీ అందిస్తుంది. దీనికి ప్రత్యామ్నాయం అదే విధమైన పోషకాలు, రుచితో ఊడిని ఇండియన్ సూపర్‌ఫుడ్ పాలకూర. విటమిన్ ఎ,సి,కెలతో పాటు ఇనుము, కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంది. బచ్చలికూర కూడా కాలేకు గొప్ప ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది. అదే విధమైన ఆరోగ్య ప్రయోజనాలనూ, రుచినీ అందిస్తుంది.



**క్వినోవా- ముతక గోధుమ రవ్వ ...** ప్రోటీన్, ఫైబర్‌లు ఎక్కువ ఉండే క్వినోవాను తీసుకోవడం మంచిదే కానీ, దానికి ప్రత్యామ్నాయంగా ముతక గోధుమ రవ్వనూ వాడుకోవచ్చు. ఇందులో మెగ్నీషియం, ఐరన్, బి విటమిన్లతో పాటు ప్రోటీన్, ఫైబర్, పలు రకాల ఖనిజ లవణాు దండిగా ఉంటాయి. క్వినోవాలనే ముతక గోధుమ రవ్వ కూడా తొమిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలతో కూడిన పూర్తి ప్రోటీన్ ఆహారం. శాకాహారులు మంచి ఎంపిక.



**మకా వేర్లు :** పెరూ దేశానికి చెందిన మకా వేర్లు అంతర్జాల ట్రెండింగ్ ఆహారాల్లో సూపర్‌ఫుడ్‌గా దూసుకుపోతున్నాయి. ఇవి మెనోపాజ్ దశలో హార్మోన్ల అసమతుల్యతను సరిచేయగలవు. మెదడు ఆరోగ్యాన్నీ, జీవనక్రియల్నీ మెరుగుపరుస్తాయి. మన దేశంలో దొరకడం కాస్త కష్టమే. లభించినా ఖరీదు ఎక్కువే. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా శతావరిని వాడొచ్చు. దీన్నే ఆస్పరాగస్ అని కూడా అంటారు. ఇది మాకా వేర్లకంటే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో ప్రోటీన్, కార్బోహైడ్రేట్స్ థయామిన్, విటమిన్ సి.ఇ.కె. క్యాల్షియం, ఇనుము మాంగనీస్ వంటి పోషకాలు ఎక్కువ. ఒత్తిడి, కుంగుబాటుల్ని అదుపులో ఉంచుతుంది. అజీర్తి, గుండెల్లో మంట మూడ్ స్వింగ్స్ వంటివాటిని తగ్గి)స్తుంది. ◻



# కెప్టెన్సీ లక్ లేని స్టార్స్

## కల తీరకుండానే గుడ్ బై.. ఆశించి భంగపడ్డ ప్లేయర్స్

**న్యూఢిల్లీ:** టీమిండియా నాయకత్వం వహించాలనే ప్రతి క్రికెటర్‌కు ఉండే కల. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఆటగాడు తాను రిటైర్ అయ్యేలోపు ఒక్కసారైనా కెప్టెన్సీ చేపట్టాలని కోరుకుంటాడు. అయితే అందరూ ఆటగాళ్లకు కెప్టెన్‌గా అవకాశం దక్కదు. కొందరు ఆటగాళ్లకు మాత్రమే నాయకత్వం వహించే అవకాశం దక్కుతుంది. ఇక కొందరు స్టార్ ఆటగాళ్లకు కెప్టెన్సీ దక్కినా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోయారు. మరికొందరు స్టార్ ఆటగాళ్లుగా ఉన్నా కెరీర్ చివరి వరకు ఉన్నా కెప్టెన్సీ పొందలేకపోయారు. అటువంటి వారిలో ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఒకడు. టీమిండియా టీ20, వన్డే వరల్డ్ కప్స్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. రెండు టోర్నీల్లోనూ మ్యాన్ ఆఫ్ టోర్నీగా ఎంపికయ్యాడు. 2011 ప్రపంచకప్‌లో బ్యాటింగ్‌లో 362 పరుగులు చేసి బౌలింగ్‌లో 15 వికెట్లు పడగొట్టాడు. క్యాన్సర్‌ను జయించి టీమిండియాకు వరల్డ్ కప్ అందించాడు. పద్మశ్రీ, అర్జున అవార్డు వంటి అవార్డులను కూడా గెలుచుకున్నాడు. అయితే యువరాజ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైనా కెప్టెన్సీ చేపట్టే అవకాశం మాత్రం రాలేదు. యూవీ టీమిండియా తరుఫున 40 టెస్టులు, 304 వన్డేలు, 58 టీ20లు ఆడాడు. ఇక టీమిండియా టెస్ట్ టీమ్ అత్యుత్తమ ఆటగాళ్లలో వీవీఎస్ లక్ష్మణ్ ఒకరు. ఈ హైదరాబాదీ ప్లేయర్ ఒంటి చేత్తో ఎన్నో మ్యాచ్‌లను గెలిపించాడు. లక్ష్మణ్ క్రీజ్‌లో ఉన్నంతసేపు ప్రత్యర్థి బౌలర్లకు ఔట్ చేయడం ఓ సవాల్‌గా ఉండేది. స్టార్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్నా లక్ష్మణ్‌కు కెప్టెన్‌గా అవకాశం దక్కలేదు. అలాగే టీమిండియా ఎవర్‌గ్రీన్ ఫాస్ట్ బౌలర్లలో జహీర్ ఖాన్ ఎప్పటికీ ఉండిపోతారు. ప్రస్తుతం బుమ్రాలాగే జహీర్ ఖాన్ కూడా అప్పట్లో గాయాలతో తీవ్ర ఇబ్బందిపడ్డాడు. గాయాల కారణంగా చాలా కాలం జట్టుకు కూడా దూరంగా ఉన్నాడు. బౌలింగ్ దళాన్ని ముందుండి నడిపించి అత్యుత్తమ బౌలర్‌గా రాణించినా జహీర్‌కు నాయకత్వం వహించే ఛాన్స్ రాలేదు. ఇక టీమిండియా దిగ్గజ స్పిన్నర్లలో హర్భజన్ సింగ్ ఒకడు. ప్రత్యేకమైన శైలితో బంతితో బ్యాట్స్‌మెన్లను ముప్పుతిప్పలు పెట్టేవాడు. టీమిండియా తరుఫున 103 టెస్ట్ మ్యాచ్‌లు, 236 వన్డేలు, 28 టీ20లు ఆడాడు. 417 టెస్ట్ వికెట్లు, 269 వన్డే వికెట్లు భజ్జీ ఖాతాలో ఉన్నాయి. హర్భజన్‌కు కూడా భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం రాలేదు. అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్ తరువాత టీమిండియాలో టాప్ క్లాస్ స్పిన్నర్‌గా రవిచంద్రన్ అశ్విన్ ఎదిగాడు. 2011 నుంచి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతున్న అశ్విన్ 2016లో ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నాడు. ఇటీవలే అతనికి పద్మశ్రీ అవార్డుకు కూడా ఎంపికయ్యాడు. గతేడాది ఆసీస్ పర్యటనలో అనూహ్యంగా అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. టెస్టుల్లో ఆరు సెంచరీలు చేయడంతోపాటు బౌలింగ్‌లో 537 వికెట్లు పడగొట్టాడు. అశ్విన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టే అవకాశం దక్కలేదు.




# వెస్టిండీస్ విన్

## 62 రన్స్ తేడాతో ఐర్లాండ్ ఓటమి




**న్యూఢిల్లీ:** వెస్టిండీస్, ఐర్లాండ్ జట్ల మధ్య జరిగిన టీ20 మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. రెండు జట్లు కలిపి 450 పరుగులు చేశాయి. చివరికి వెస్టిండీస్ జట్టుపై ఐర్లాండ్ 62 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఒకవైపు వెస్టిండీస్ బ్యాటర్ ఎవిన్ లూయిస్ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడగా, ఐర్లాండ్ యువ ఫాస్ట్ బౌలర్ లియామ్ మెక్‌కార్తీ తన అరంగేట్రం మ్యాచ్‌లోనే చెత్తరికార్డును నమోదు చేశాడు. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 256 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇది టీ20 చరిత్రలో వెస్టిండీస్ జట్టు చేసిన రెండో అత్యధిక స్కోర్. వెస్టిండీస్ జట్టు తరపున ఓపెనర్ గా క్రీజులోకి వచ్చిన ఎవిన్ లూయిస్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఐర్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఎవిన్ లూయిస్ కేవలం 44 బంతుల్లో 91 పరుగులు చేశాడు. అతని తుఫాన్ ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, ఎనిమిది సిక్సులు ఉన్నాయి. ఆ తరువాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ షాయ్ హోప్ కూడా 27 బంతుల్లో 51 పరుగులతో ఐర్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. తన కెరీర్ లో తొలి టీ20 మ్యాచ్ ఆడిన కేసీ కార్టీ 22 బంతుల్లో 49పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆ తరువాత రోమారియో షెపర్డ్ కూడా చివరి ఓవర్లలో ఐర్లాండ్ బౌలర్లను వదిలిపెట్టలేదు. కేవలం ఆరు బంతుల్లో మూడు సిక్సర్లు కొట్టడం ద్వారా జట్టుకు 19 పరుగులు జోడించాడు. దీంతో వెస్టిండీస్ జట్టు 256 పరుగుల భారీ స్కోర్ చేసింది. వెస్టిండీస్ జట్టు నిర్దేశించిన భారీ పరుగుల లక్ష్యాన్ని ఐర్లాండ్ చేధించలేక పోయింది. ఐర్లాండ్ బ్యాటర్లు రాస్ అడైర్ (48), హ్యారీ టెక్టర్ (38), మార్క్ అడైర్ (31) మినహా మిగిలిన బ్యాటర్లు పరుగుల రాబట్టలేక పోయారు. దీంతో ఐర్లాండ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 194 పరుగులు మాత్రమే చేసింది. ఫలితంగా 62 పరుగుల తేడాతో మ్యాచ్‌ను కోల్పోయింది. వెస్టిండీస్ బౌలింగ్‌లో అఖిల్ హుస్సేన్ మూడు వికెట్లు పడగొట్టగా.. జాసన్ హోల్డర్ రెండు వికెట్లు తీశాడు.




# లిబెమా ఓపెన్ విజేతగా ఎలెనా

## బెల్జియం మూడో సీడ్ రూస్ ఓటమి

**న్యూఢిల్లీ:** లిబెమా ఓపెన్-2025లో ఎలిస్ మెర్టెన్స్ తన ప్రత్యర్థి ఎలెనా గాబ్రియేలా రూస్‌ను ఓడించి విజేతగా నిలిచింది. డెన్ బాష్‌లో జరిగిన లిబెమా ఓపెన్ ఫైనల్‌లో బెల్జియం మూడో సీడ్ ఎలిస్ మెర్టెన్స్ 6-3 7-6 (4) తేడాతో ఎలెనా గాబ్రియేలా రూస్‌ను ఓడించి ఈ సంవత్సరంలో తన రెండవ డబ్ల్యూటిఎ టూర్ టైటిల్‌ను గెలుచుకుంది. ఈ విజయం మెర్టెన్స్‌కు పదవ జాగితి సింగిల్స్ టైటిల్‌ను మరియు గ్రాస్‌పై మొదటి టైటిల్‌ను సంపాదించిపెట్టింది. ఆమె 2021లో వింబుల్డన్ మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. అదే సమయంలో రూస్‌పై ఆమె హెడ్‌టు హెడ్ విజయాల రికార్డును 4-0కి పెంచుకుంది. రొమేనియన్ క్వాలిఫైయర్ ద్వారా తొలి సెట్‌లో ఒత్తిడికి గురైన మెర్టెన్స్ మొదటి సెట్‌లో 3-1తో వెనుకబడింది. బెల్జియన్ క్రీడాకారిణి తన తడబాటు ప్రారంభం నుండి కోలుకుని, ఐదవ గేమ్‌లో కీలకమైన పట్టును సాధించడానికి రెండు బ్రేక్ పాయింట్లను కాపాడుకోవడంతో ఇది పోటీ యొక్క మలుపును మార్చింది. రూస్ రెండుసార్లు డబుల్ ఫాల్ట్ చేయడంతో సెట్ 3-3తో తిరిగి సర్వ్‌లోకి వచ్చింది. మెర్టెన్స్ త్వరగా మరో మూడు గేమ్‌లను రీల్ చేసి ఓపెనర్‌ను కైవసం చేసుకుంది. రూస్ సెట్‌ల మధ్య సుదీర్ఘమైన మెడికల్ టైమ్ అవుట్ తీసుకుని రెండవ సెట్ మధ్యలో ఈ జంట బ్రేక్‌లను ట్రేడ్ చేసింది. రూస్ 5-4తో రెండు సెట్ పాయింట్లను సంపాదించగలిగింది. కానీ మెర్టెన్స్ సర్వ్‌ను పట్టుకోవడంలో టైబ్రేకర్‌ను అదుపు చేసి దానిని అధిగమించింది.

### సీజన్ 6 గ్రాండ్ ఫినాలేలో..

# ఛాంపియన్‌గా యు ముంబా

## జైపూర్‌పై 8-4 తేడాతో ఆధిపత్యం.. హైదరాబాద్ అమ్మాయి శ్రీజ తొలి ఓటమి




**న్యూఢిల్లీ:** సీజన్ 6 గ్రాండ్ ఫినాలేలో యు ముంబా టీటీ ఛాంపియన్‌గా నిలిచింది. జైపూర్ పేట్రియాట్స్‌పై 8-4 తేడాతో ఆధిపత్య విజయం సాధించి, అద్భుతమైన జట్టు ప్రదర్శనతో ముంబా తమ తొలి ఇండియన్ ఆయిల్ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. లిలియన్ బార్డెట్ మరియు బెర్నాడెట్ సోక్స్ ముంబాకు తొలి ఆధిక్యాన్ని అందించారు ఆ తర్వాత సోక్స్ మరియు ఆకాష్ పాల్ మిక్స్‌డ్ డబుల్స్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుని వారిని అంచుకు చేర్చారు. టీనేజర్ అభినంద్ పిబి నాల్గవ మ్యాచ్‌లో క్లచ్ గేమ్ విజయంతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. యశస్విని ఘోర్పడే ఫైనల్‌లో పాల్గొనకపోయినా, ఆమె అద్భుతమైన సెమీఫైనల్ ప్రదర్శన ఈ సీజన్‌లో యు ముంబా యొక్క సమిష్టి బలాన్ని ప్రతిబింబించింది. తొలి మ్యాచ్‌లో కనక్ ఝాపై బార్డెట్ అద్భుత ఆటతీరుతో 2-1 విజయంగా మార్చి ముంబాకు ఊపునిచ్చింది. ఆ జోరు లీగ్‌లో అగ్రస్థానంలో ఉన్న క్రీడాకారిణి స్జోక్స్, అంతర్జాతీయ సర్క్యూట్‌లో భారత్ అత్యధిక ర్యాంకర్ ప్యాడ్లర్ అకుల శ్రీజా మధ్య మార్క్యూ ఘర్షణకు దారితీసింది. ఒత్తిడిలో కూడా స్జోక్స్ ఎలైట్ డిఫెన్స్ ప్రదర్శించి 2-1 తేడాతో స్కోరు సాధించింది, శ్రీజాకు ఈ సీజన్‌లో తొలి ఓటమిని అందించింది. ఆకాష్‌తో కలిసి స్జోక్స్, జీత్, బ్రిట్ ఈర్లాండ్‌లను వరుస గేమ్‌లలో ఓడించింది. ప్రతి గేమ్ ఏకపక్షంగా సాగుతుండగా, యు ముంబా ద్వయం రెండవ గేమ్‌లో 5-5 నుండి 11-5కి చేరుకుంది. మరియు మూడవ గేమ్‌ను అదే స్కోరుతో ముగించింది. టైతో ముగిసిన తర్వాత, జీత్ పేట్రియాట్స్‌ను మ్యాచ్ 4ను ఉత్కంఠభరితంగా ప్రారంభించింది. ముంబాకు చెందిన అభినంద్‌తో జరిగిన మొదటి రెండు గేమ్‌లను గెలిచి జట్టును సజీవంగా ఉంచాడు. కానీ 17 ఏళ్ల యు ముంబా ప్యాడ్లర్ 6-6తో నిలిచిన అభినంద్ 10-8తో ఆధిక్యంలో నిలిచి, 11-8తో ఆధిక్యంలో నిలిచాడు, యు ముంబా టిటికి 8-4 మొత్తం విజయంతో మొట్టమొదటి ఇండియన్ ఆయిల్ యుటిటి టైటిల్‌ను గెలుచుకున్నాడు.

# గ్రాప్లింగ్ ప్రపంచ కప్‌లో రన్నరప్‌గా భారత్

**న్యూఢిల్లీ:** గ్రాప్లింగ్ ప్రపంచ కప్-2025లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. ఈ గ్రాప్లింగ్ ప్రపంచ కప్ 2025లో భారత్ గ్రాప్లర్లు 44 పతకాలతో ముగించారు. వీటిలో 3 స్వర్ణాలు, 13 రజాతాలు, 28 కాంస్య పతకాలు ఉన్నాయి. కజకిస్తాన్‌లోని అస్తానాలో భారత్ కాలమానం ప్రకారం సోమవారం జరిగిన ఈ పోటీల్లో భారత్ గ్రాప్లర్లు అద్భుత ప్రదర్శన కనపరచడంతో మొత్తం జట్టు ర్యాంకింగ్స్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. అలాగే ఆతిథ్య కజకిస్తాన్ (13620 పాయింట్లు) తర్వాత నిలిచింది. భారత గ్రాప్లర్లు 755 పాయింట్లతో 44 పతకాలను గెలుచుకున్నారు. గ్రాప్లింగ్ మరియు గ్రాప్లింగ్ జిఐ విభాగాలలో 10 దేశాల నుండి గ్రాప్లర్లు పోటీ పడ్డారు. భారత్‌కు చెందిన అభిమన్యు పతకాలు (100 కిలోలు) స్వర్ణం, కాంస్య పతకాలను సాధించగా, అదే విభాగాలలో వికాష్ కుమార్ (100 కిలోలు) స్వర్ణం, రజతాన్ని దక్కించుకున్నాడు. ఇతర విజేతలలో రవి మాలిక్ (71 కిలోలు), సవిత (53 కిలోలు) ఇద్దరూ చెరో రెండు రజత పతకాలు గెలుచుకున్నారు. నిశాంత్ మాలిక్ (62 కిలోలు) కూడా రెండు పతకాలు రజతం మరియు ఒక కాంస్య పతకం సంపాదించాడు. అలాగే వైష్ణవి సింగ్ (71 కిలోలు), రేషు నగర్ (64 కిలోలు) ఒక్కొక్కరు రజత పతకాలు, అభిమన్యు కాంస్య పతకం సాధించారు. కాగా 2023లో జరిగిన గ్రాప్లింగ్ ప్రపంచ కప్‌లో భారత్ గ్రాప్లర్లు 105 పతకాలు గెలుచుకుని ఛాంపియన్లుగా నిలిచారు. అయితే ఈ సంవత్సరం పలువురు ఆటగాళ్ళు టోర్నమెంట్ నుండి వైదొలిగారు. గత ఎడిషన్ లో 88 మంది ఆటగాళ్ళు ఉండగా, ఈ ఏడాది ఆ జట్టులో దాదాపు సగం మంది మాత్రమే ఉన్నారు.




# వోడాఫోన్ ఐడియాకు ప్రభుత్వం ఉపశమన ప్యాకేజీ!

vodafone !dea

**ముంబై, జూన్ 16:** దేశంలోని అతిపెద్ద టెలికాం కంపెనీలలో ఒకటైన వోడాఫోన్ ఐడియా కష్టాలుతగ్గడం లేదు. కంపెనీకి కష్టాలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. అయితే, ప్రభుత్వం, కంపెనీ అధికారులు టెలికాం దిగ్గజాన్ని కాపాడటానికి ప్రయత్నిస్తున్నారు. కానీ అన్ని ప్రయత్నాలు విఫలమవుతున్నట్లు కనిపిస్తోంది. నివేదిక ప్రకారం, ప్రభుత్వం వోడాఫోన్ ఐడియా (విఐ) కోసం ఒక ఉపశమన ప్యాకేజీని సిద్ధం చేస్తోంది. కానీ దాని పెండింగ్ స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీలను మాఫీ చేయక పోతే, కంపెనీ మనుగడ సాగించే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని టెక్ నిపుణులు చెబుతున్న మాట. ఈ బకాయిలను ఈక్విటీగా మార్చడానికి ఎటువంటి ప్రణాళిక లేదని, దీనివల్ల వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వ వాటా ప్రస్తుత 49 శాతానికి పెరుగుతుందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వం ఎలాంటి ఉపశమన ప్యాకేజీని ప్లాన్ చేస్తుందో తెలుసుకుందాం. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత నిర్ణయించిన ఆరు సంవత్సరాల కాలానికి బదులుగా వొడాఫోన్ ఐడియా తన ఎజిఆర్ బకాయిలను 20 సంవత్సరాలలో చెల్లించనివ్వడం ఒక ఆలోచన. ఎజిఆర్ చెల్లింపు వ్యవధిని రూ. 18,064 కోట్ల స్థిర ఆరు వార్షిక వాయిదాల నుండి 20 సంవత్సరాలకుపైగా పొడిగించాలని ఒక అధికారి చెప్పినట్లు నివేదిక పేర్కొంది. టెలికాం శాఖ ప్రకారం 2026చివరి నాటికి విఐ మొత్తం రూ.18,064 కోట్లు చెల్లించాల్సివస్తే, 2027బిల్లు రాకముందే కంపెనీవద్ద నిధులు ఉండవని చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో నాలుగో త్రైమాసికానికి కంపెనీ నష్టం రూ.7,166.1 కోట్లుగా ఉంది. ఇది వార్షిక ప్రాతిపదికన కొంత తగ్గినా, డిసెంబర్ త్రైమాసికంతో పోల్చితే సుమారు రూ.500కోట్లుపెరిగింది. అలాగే డిసెంబర్ త్రైమాసికంలో రూ.6,609.3కోట్ల వరకు నష్టం వచ్చింది. వోడాఫోన్ ఐడియా సిఇఒ అక్షయ్ మూంద్రా 2025 ఏప్రిల్ 17న టెలికాం శాఖకు లేఖ రాశారు. ప్రభుత్వం నుంచి మద్దతు లభించకపోతే 2026 మార్చి తర్వాత కంపెనీ కార్యకలాపాలు కొనసాగించడం సాధ్యం కాదని పేర్కొన్నారు.

# యుపిఐతోనే 50% డిజిటల్ లావాదేవీలు: ప్రధాని మోడీ

**లిమాసోల్, జూన్ 16:** మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ద్వీప దేశమైన సైప్రస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. లిమాసోల్‌లో జరిగిన భారత్‌సైప్రస్ సీఈవో ఫోరమ్ లో ప్రధాని ప్రసంగిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో 50శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ డిజిటల్ విప్లవం భారత్‌లో గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆర్థిక, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. భారత్ వేగంగా ఆర్థిక వృద్ధి సాధిస్తూ, ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే లక్ష్యంగా ముందుకువెళ్తున్నామన్నారు. నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని అన్నారు. జీఎస్టీఅమలు, కార్పొరేట్ పన్నులకు సంబంధించిన అనేక చట్టాల్లో సంస్కరణలను ప్రవేశపెడుతూ స్థిరమైన విధానాలను కలిగిఉండడం ద్వారా భారత్‌లో వ్యాపారరంగం వృద్ధి చెందుతోందని మోదీ అన్నారు. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సెమీ కండక్టర్లు, బయోటెక్, గ్రీన్ డెవలప్‌మెంట్ వంటి రంగాలపై దృష్టి సారించి, దేశ తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మోడీ పేర్కొన్నారు. దీంతో త్వరలో భారత్ సెమీకండక్టర్ తయారీకి ప్రపంచ కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్ నౌకలు, వైమానిక రంగాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో వ్యాపారం చేయడంలో నమ్మకంతోపాటు వారి సౌలభ్యానికి కూడా భారత ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. భారతీయ కంపెనీలు సైప్రస్‌ను యూరప్‌కు ప్రవేశ ద్వారంగా చూస్తున్నాయని మోడీ అన్నారు. సైప్రస్‌ను యుపీఐలో చేర్చడానికి కొనసాగుతున్న చర్చలను ప్రధాని స్వాగతించారు.



# కర్ణాటకలో బైక్ ట్యాక్సీలకు బ్రేక్




**బెంగళూరు, జూన్ 16:** కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థలు తమ సేవలను సోమవారం ఉదయం నుంచి నిలిపివేశాయి. హైకోర్టు ఆదేశానుసారం తమ సేవలను నిలిపివేస్తున్నట్లు ర్యాపిడో పేర్కొంది. సేవలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని తెలిపింది. బైక్ ట్యాక్సీ సేవలను ఉబర్ మోటో కొరియర్ కింద మార్చగా, ఓలా తన యాప్‌లో బైక్ ట్యాక్సీ అనే ఆప్షన్‌ను పూర్తిగా తొలగించింది. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటే కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జూన్15 వరకు గడువు ఇచ్చింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయగా, డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. సోమవారం నుంచి బైక్ ట్యాక్సీ సేవలు నిలిపివేయాలని ఆదేశించింది. జూన్ 20లోగా దీనిపై తమ స్పందన తెలియజేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 24కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. బైక్ ట్యాక్సీలపై నిషేధం వల్ల గిగ్‌వర్కర్ల జీవితాలు రోడ్డున పడతాయంటూ నమ్మ బైక్ ట్యాక్సీ అసోసియేషన్ సీఎం సిద్ధరామయ్య, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లేఖ రాసింది. దీనిపై జోక్యం చేసుకోవాలని కోరింది.

# ఆల్ టైమ్ గరిష్టానికి పసిడి

**ముంబై, జూన్ 16:** దేశీయ మార్కెట్లో బంగారం ధరలు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. సోమవారం ఎంసీఎక్స్ (మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్)లో ఆగస్ట్ ఫ్యూచర్స్ బంగారం ధర 10 గ్రాములకు ఏకంగా రూ.1,01,078 వద్ద ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరింది. ఇటీవల తొలిసారిగా తులం బంగారం ధర రూ.లక్ష మార్కును దాటిన విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లపై ఒత్తిడి, ముడిచమురు ధరలు పెరగడం వంటి అంశాలు పసిడి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. వెండి ధరలు కూడా దాదాపు గరిష్ట స్థాయిల్లోనే స్థిరంగా కొనసాగుతున్నాయి. జూలై సిల్వర్ ఫ్యూచర్స్ కేజీకి రూ.1,06,464 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. గత ట్రేడింగ్ సెషన్‌లో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండిధరలు సానుకూలంగా ముగిశాయి. బంగారం ఆగస్ట్‌ఫ్యూచర్స్ 1.91 వృద్ధితో 10 గ్రాములకు రూ.1,00,276 వద్ద స్థిరపడగా, వెండి జూలై ఫ్యూచర్స్ 0.57 లాభంతో కిలోకు రూ.1,06,493 వద్ద ముగిశాయి. గత వారం బంగారం, వెండి ధరలు భారీగా పెరగడానికి ప్రధాన కారణం ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు. దీనికి తోడు డాలర్ ఇండెక్స్ బలహీనపడటం కూడా పసిడికి కలిసొచ్చింది. పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని ఎంచుకోవడంతో డిమాండ్ పెరిగింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో క్షీణత, ముడిచమురు ధరల పెరుగుదల కూడా విలువైన లోహాల ధరలకు మద్దతునిచ్చాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా సురకిత పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ పెరిగింది. ఇదే బంగారం, వెండి ధరల కదలికలను ప్రభావితం చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధర ఒక ఔన్సు 3,450 డాలర్లను దాటింది. రాబోయే ట్రేడింగ్ సెషన్లలో వెండి కూడా ఇదే బాటలో పయనించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.



# ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో స్వల్ప తగ్గుదల

**ముంబై, జూన్ 16:** మే నెలలో దేశీయ ప్యాసింజర్ వెహికల్ హోల్‌సేల్ అమ్మకాలు 0.80 శాతం తగ్గి 3,44,656 యూనిట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే నెలలో 3,47,492 యూనిట్ల అమ్మకాలు జరిగాయని సోమవారం సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) తెలిపింది. సియామ్ విడుదల చేసిన తాజా డేటా ప్రకారం, తయారీదారుల నుంచి డీలర్లకు ద్విచక్ర వాహనాల సరఫరా మేనెలలో 2.20శాతం పెరిగి 16,55,927 యూనిట్లుగా నమో దయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో ఇవి 16,20,084 యూనిట్లు. దేశీయ మార్కెట్లో మొత్తం త్రిచక్ర వాహనాల అమ్మకాలు గత ఏడాది మే నెలలో 55,763 యూనిట్లు కాగా, గత నెలలో 3.30 శాతం తగ్గి 53,942 యూనిట్లుగా నమోదయ్యాయని సియామ్‌తెలిపింది. అన్ని కేటగిరీలకు చెందిన మొత్తం వాహన హోల్‌సేల్ అమ్మకాలు గత ఏడాది మేనెలలో 19,76,674 యూనిట్లుగా ఉండగా, గత నెలలో 1.80 శాతం పెరిగి 20,12,969 యూనిట్ల అమ్మకాలు నమోద య్యాయని సియామ్ తెలిపింది.



# వాణిజ్యం

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూన్ 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలతో గత రెండు సెషన్లు నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు మళ్లీ పుంజుకొన్నాయి. ఓ వైపు ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న మన మార్కెట్లు రాణించడం విశేషం. ముఖ్యంగా ఐటీ, మెటల్, రియల్టీ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు కలిసొచ్చింది. కీలక సూచీల ముగింపు స్థాయిలు సెన్సెక్స్ ఉదయం 81,034.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,118.60) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే కోలుకున్న సూచీ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 81,865.82 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 677.55 పాయింట్ల లాభంతో 81,796.15 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 227.90 పాయింట్ల లాభంతో 24,946 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.04గా ఉంది. సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3435 డాలర్ల వద్ద ట్రెడైనది. ఈ స్థిరంగా ఉన్న క్రూడ్ ధరలు దేశీయ ఇంధన ధరలపై ఒత్తిడి తగ్గించే అవకాశం ఉంది. మరోవైపు బంగారం ధరల్లో పెరుగుదల సాధారణంగా మార్కెట్‌లో రిస్క్ సెంటిమెంట్‌ను సూచిస్తుంది. గత రెండు సెషన్లలో సూచీలు అమెరికాయూరప్ మార్కెట్ల ప్రతికూలతల వల్ల నష్టాల్లోకి వెళ్లాయి. బలమైన కొనుగోళ్లు, మెటల్ రియల్టీ షేర్లలో జోరు మార్కెట్‌ను పాజిటివ్ మూడ్‌లోకి తీసుకొచ్చాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.